అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 31-12-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 312 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



నోటికాడి కూడు లాక్కుంటే కొట్లాడాలి

పెద్దల భూములకో నీతి పేదల భూములకో నీతా ?

గరీబోళ్ల జోలికొస్తే ఎర్రజెండా అడ్డుగా నిలుస్తుంది

భూమిని పంచిన, సాధించిన చరిత్ర ఎర్రజెండాదే

లగచర్ల భూముల రక్షణకు అండగా ఉంటాం

ఫార్మాను వెనక్కు తీసుకునేలా సీఎంపై ఒత్తిడి పెంచి విజయం సాధించాం

ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రత్యామ్నాయ భూములు చూడాలి :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హకీంపేటలో లగచర్ల బాధిత రైతులతో సభ

నవతెలంగాణ-కొడంగల్

'మీ నోటికాడి కూడు లాక్కుంటుంటే చూస్తూ ఊరుకోకుండా గట్టిగా కొట్లాడాలి. మీ పిల్లలు, భవిష్యత్ తరాలు బతికేది భూమిపైనే. అలాంటి భూమి తల్లి దూరమైతే బతుకే లేదు. పేదల భూముల జోలికొస్తే ఎర్రజెండా అడ్డంగా నిలుస్తుంది. ఐక్యంగా చీమల గుంపు వలే కదిలేందుకు సిద్ధంగా ఉండాలి' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం పంటలు పండే భూములు కాకుండా ప్రత్యామ్నాయ భూములు చూడాలంటూ వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం హకీంపేటలో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో లగచర్ల, పోలేపల్లి, హకీంపేట్, రోటి బండతండా, పులిచర్లకుంట తండా రైతులతో 'రైతాంగ సభ' నిర్వహించారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన రైతులను సన్మానించారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తేసేందుకు కృషి చేయాలని తమ్మినేని వీరభద్రంకు రైతులు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో తమ్మినేని ప్రసంగించారు.

ప్రభుత్వం 1300 ఎకరాల భూమిని ఫార్మాసిటీ కోసం సేకరించేందుకు ప్రయత్నించిందని తమ్మినేని చెప్పారు. వామపక్ష పార్టీల నేతలు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించాక ముఖ్యమంత్రిని కలిసినప్పుడు చట్టాన్ని గౌరవించరా? అని ప్రశ్నించామన్నారు. ఇక్కడ తొండలు గుడ్లు పెట్టే భూములు లేవని, రెండు పంటలు పండే భూములు, బోరు బావులు ఉన్నాయని చెప్పామన్నారు. పచ్చని పొలాల్లో ఫార్మా పెడితే గిరిజనులు ఎక్కడికి పోవాలని, ఎట్లా బతకాలని 'మీ గొంతును మా గొంతు చేసుకుని' సీఎంకు విన్నవించినట్టు తెలిపారు. దాంతో సీఎం పునరాలోచించి నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారన్నారు. ఫార్మా వెనక్కి తీసుకోవడం ప్రజలందరి విజయమన్నారు. ఇబ్రహీంపట్నం లాంటి ప్రాంతంలో 13వేల ఎకరాల భూమి సేకరించి ఫార్మా పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ...2లో

ఉపాధ్యాయునిపై మతోన్మాదుల దాడి అత్యంత హేయం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని 11లో

తెలంగాణ ఆత్మబంధువు

నీతినిజాయితీలకు రోల్‌మోడల్ మన్మోహన్ సింగ్



పేదల కోసం కీలక చట్టాలు చేశారు

ఆయనకు భారతరత్న ఇవ్వాలి

ఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తాం :

మాజీ ప్రధాని సంతాప తీర్మానంలో సీఎం రేవంత్‌రెడ్డి

అసెంబ్లీ ఘన నివాళులు


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తెలంగాణకు పురుడుపోసిన వ్యక్తి అనీ, నాలుగు కోట్ల మంది తెలంగాణ బిడ్డల గుండెల్లో ఆయన చిరకాలం ఆత్మబంధువుగా నిలిచిపోతారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎల్‌పీజీ విధానాలను తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రణాళికసంఘం సభ్యులుగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రొఫెసర్‌గా ఆర్థిక రంగంలో రాణించిన ఆయనలోని ప్రతిభా పాటవాలను గుర్తించిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు తన క్యాబినెట్‌లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌ను నియమించుకున్నారని తెలిపారు. ఆయన ఓ స్థితప్రజ్ఞుడని కొనియాడారు. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించేందుకు రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు, శాసనసభ్యులు ఈ సందర్భంగా మన్మోహన్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం ఈ దేశానికి తీరని లోటు. మౌనముని అంటూ ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన తన సహనాన్ని కోల్పోలేదు. దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడంపైనే దృష్టిసారించారు. ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఆదర్శంగా తీసుకునే వారిలో మన్మోహన్ సింగ్ మొదటి వరుసలో ఉంటారు. ఆయన నీతినిజాయితీలకు రోల్‌మోడల్. మాజీ ప్రధాని నిరాడంబరత మనందరికీ ఆదర్శనీయం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్లమెంటు సభ్యులుగా మాతో పాటు ఆయన ఢిల్లీలో నిరసనలో పాల్గొన్నారు. ఇది మాకు జీవిత కాలం గుర్తుండిపోయే సంఘటన. పార్లమెంట్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నిరసనలో పాల్గొనడం ఆయన నిరాడంబరతకు నిదర్శనం. ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చి పేదలకు 100 రోజులు పని కల్పించిన వ్యక్తి మన్మోహన్ సింగ్. ఆహార భద్రత, సమాచార హక్కు చట్టాలను తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి ఆయన. 2013 భూసేకరణ చట్టం తెచ్చి భూమి లేని పేదలకు మేలు జరిగేలా చేశారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిన వ్యక్తి మన్మోహన్‌సింగ్. అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన చట్టాలు తీసుకొచ్చారు. అలాంటి గొప్ప మానవతావాదిని కోల్పోవడం దురదృష్టకరం. ఆయన తీసుకొచ్చిన సరళీకృత విధానాలు మన దేశ దశ-దిశను మార్చాయి. ప్రపంచానికి మేధోసంపత్తిని ఎగుమతి చేసేస్థాయికి దేశం ఎదగడానికి కారణం మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చిన సంస్కరణలే కారణం. దేశానికి ఆయన మాజీ ప్రధాని, మాజీ ఆర్థిక మంత్రి...కానీ తెలంగాణకు మాత్రం ఆత్మబంధువు. తెలంగాణకు పురుడుపోసిన వ్యక్తిగా ఆయన్ను ఇక్కడి ప్రజలు గుండెల్లో ...11లో

సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్

మోడ్రన్ ఇండియా..

బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్

వివరాలు 3లో

మన్మోహన్ గొప్ప నేత

చనిపోయాడని తెలిసీ

రాహుల్‌గాంధీ వియత్నాం వెళ్లడమేంటి?

బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం తగదు

ఆయన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలి :

మంత్రి శ్రీధర్‌బాబు... తొలగించిన సభాపతి

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటాం

నైపుణ్యాభివృద్ధి..మౌలిక వసతుల పెంపు సీఎం దార్శనికతకు నిదర్శనం :

మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల

సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేక భేటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆయనతో భేటీ అయ్యారు. ఐటీ రంగంలో రాష్ట్ర ప్రగతి, పెట్టుబడులు, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలపై ఈ ...11లో



టీఎస్ యూటీఎఫ్

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షులుగా చావ రవి,

ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ జిల్లా కేంద్రం లక్ష్మీగార్డెన్స్‌లో జరిగిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర 6వ మహాసభ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా 21 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్, ఉపాధ్యక్షులుగా కె.జంగయ్య, సిహెచ్.దుర్గాభవాని ఎన్నికయ్యారు. కోశాధికారిగా ...11లో

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదు

రాష్ట్రపతి జోక్యం చేసుకుని

ఆయన్ను బర్తరఫ్ చేయాలి :

వామపక్ష పార్టీల డిమాండ్

హైదరాబాద్‌లో నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హత లేదన్నాయి. ఆయన దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకుని కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కోరాయి. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని నారాయణ గూడ వైఎంసీఏ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. 'రాజ్యాంగాన్ని కాపాడు కుందాం, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని రక్షించుకుందాం, అమిత్‌షా రాజీనామా చేయాలి, కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన కేంద్ర హోంమంత్రి రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా మాట్లాడారని చెప్పారు. దేశ ప్రజలు ఖండిస్తున్నా, దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా అమిత్‌షా తన తప్పును అంగీకరించడం లేదనీ, ప్రజలకు క్షమాపణ చెప్పడం లేదని అన్నారు. ఆయన అనుచిత వ్యాఖ్యలపై ఇతర మంత్రులు, ...11లో

నిప్పులు చిమ్ముతూ

నింగిలోకి

దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ 60

భూ కక్ష్యలో అనుసంధానం చేసే

బృహత్తర ప్రయోగం : ఇస్రో

ఈ సాంకేతికతను కలిగిన 10లో

నాలుగో దేశంగా భారత్



గుదిబండగా మెట్రోలు!



ఖర్చు ఎక్కువ..రాబడి తక్కువ

తగ్గిపోతున్న ప్రయాణికుల డిమాండ్

- దూర ప్రయాణాలకే పరిమితం
- చౌకైన ప్రజా రవాణా వ్యవస్థ ఉండాలంటున్న నిపుణులు

న్యూఢిల్లీ : పేదలు, సామాన్య ప్రజల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రధాన నగరాల్లో మెట్రో రైళ్లను పరుగులు పెట్టించేందుకు కృతనిశ్చయంతో ఉంది. యాభై నగరాల్లో మెట్రోలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ 2016లో పూనే మెట్రోకు భూమిపూజ చేసిన సందర్భంగా ప్రకటించారు. రాబోయే పాతిక ముప్పై సంవత్సరాల కాలంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. మెట్రో రైలు నడిపిన వెంటనే లాభాలు రావని, కానీ అవి నడవడం మొదలు పెట్టిన 2-4 సంవత్సరాల్లో లాభాల బాట పడతాయని కూడా చెప్పారు.

2014కు ముందు...ఆ తర్వాత

2014కు ముందు మెట్రో రైల్ వ్యవస్థ కేవలం ఐదు నగరాలకే... కొల్‌కతా, ఢిల్లీ, గుర్‌గావ్, బెంగళూరు, ముంబయి...పరిమితమైంది. ఈ నగరాలన్నింటిలో కలిపినా ఆ వ్యవస్థ కేవలం 229 కిలోమీటర్లకే పరిమితమైంది. పది సంవత్సరాలు గడిచిన తర్వాత...అంటే ఈ ఏడాదిలో మెట్రో నెట్‌వర్క్ 900 కిలోమీటర్లకు పైగా విస్తరించింది. ప్రస్తుతం 13 ప్రధాన నగరాల్లో (సమీపంలోని ...11లో





ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- అయ్యప్ప మాల ముసుగులో మతకలహాలు : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్
- బాధితుడికి ప్రజాసంఘాల నేతల పరామర్శ

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయ్యప్ప స్వాముల ముసుగులో కాషాయ మూకలు మతకలహాలకు పాల్పడుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో అయ్యప్ప మాలలో ఉన్న విద్యార్థికి ప్రధానోపాధ్యాయుడు రాములు కాలు తగిలిందనే కారణంతో అతనిపై అయ్యప్ప స్వాములు దాడి చేయడాన్ని సీఐటీయూ, ప్రజాసంఘాలు ఖండించాయి. సోమవారం ప్రధానోపాధ్యాయుడు రాములును తుక్కుగూడలోని ఆయన నివాసంలో సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడిపై లేనిపోని నిందలు వేసి, అయ్యప్ప స్వాముల ముసుగులో బీజేపీ నాయకులు దాడి చేశారన్నారు. అతని బట్టలు చించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత విద్యార్థి కాళ్లు మొక్కించారని తెలిపారు. ఈ దుర్మార్గమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కవిత, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాంచందర్ తదితరులు ఉన్నారు.

అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ 3కు వాయిదా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

సంధ్యా థియేటర్ ఘటన కేసుకు సంబంధించి నటుడు అల్లు అర్జున్ బెయిల్ కోరుతూ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారం జనవరి 3కు వాయిదా వేసింది. అర్జున్‌కు బెయిల్ మంజూరు చేయాలనీ, డిసెంబర్ 4న పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటకు, అర్జున్‌కు ఎలాంటి సంబంధమూ లేదనీ, ఆయనపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టులో వాదించారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను వాయిదా వేశారు. ఇప్పటికే ఈ కేసులో అల్లు అర్జున్‌ను నాలుగువారాల పాటు అరెస్ట్ చేయరాదంటూ హైకోర్టు ఆదేశించిన విషయం విదితమే. మరోవైపు, ఇటీవలనే అర్జున్‌ను స్టేషన్‌కు పిలిచి చిక్కడపల్లి పోలీసులు విచారణ జరిపి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

కేటీఆర్‌కు మతి భ్రమించింది

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. కొత్త సంవత్సరంలోనైనా ఆయనకు మంచి బుద్ధి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కనీసం ప్రతిపక్ష హోదాను కూడా నిలబెట్టుకోలేపోతుందని విమర్శించారు. అసెంబ్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానంపై మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తారని ఆశించామని తెలిపారు. మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేసిన కేసీఆర్ కూడా అసెంబ్లీకి రాకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడంలో మన్మోహన్ సింగ్ పాత్ర ఎంతో ఉందన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డుపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- బీఆర్ఎస్ హయాంలోని పనులను తమ ఖాతాలో వేసుకుంటున్నారు : మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రీజినల్ రింగ్ రోడ్డుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి కేసీఆర్ హయాంలో చేసిన పనులను తాము చేసినట్టు సీఎం రేవంత్ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. గత సర్కార్ పలు మార్పు చేసిన విజ్ఞప్తి మేరకు 2021 డిసెంబర్ 6న కేంద్రం అలైన్ మెంట్ అప్రూవల్ ఇచ్చిందని గుర్తు చేశారు. భూసేకరణకు కేంద్రం వద్ద డిపాజిట్ చేసిన రూ.100 కోట్లలో ఇప్పటి వరకు కాంగ్రెస్ సర్కార్ నయాపైసా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. అలాగే దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్‌ను తమ భూముల చుట్టూ మార్పులు చేయడం ద్వారా కాంగ్రెస్ నేతలు లబ్ది పొందేందుకు చూస్తున్నారని ఆరోపించారు. అలైన్ మెంట్ మార్చడం ద్వారా రూ.12 వేల కోట్లు సర్కార్‌పై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే అలైన్ మార్చకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

రైల్వే విద్యుత్ లైన్ల వద్ద గాలిపటాలు ఎగరేయొద్దు

- తీగల నుంచి వేలాడుతున్న గాలిపటం దారాలను తాకడాన్ని నివారించాలి : ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైల్వే విద్యుత్తు లైన్ల దగ్గర గాలిపటాలను ఎగరేయొద్దని సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే సూచించింది. విద్యుత్తు తీగల నుంచి వేలాడుతున్న గాలిపటం దారాలను తాకడాన్ని నివారించాలని కోరింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రైల్వే ప్రాంగణంలో యార్డులు, ట్రాక్‌ల సమీపంలోని జనావాసాల ప్రాంతాలతో సహా విద్యుత్తు తీగల దగ్గర ఆడుకుంటుండగా పలువురు గాలిపటాలు ఎగరేసేవారు విద్యుద్ఘాతానికి గురై మరణించినట్టు గమనించబడిందని తెలిపింది. ఇలాంటి సంఘటనలు భారతీయ రైల్వేలోని అనేక జోన్‌లలో మునుపటి సంక్రాంతి పండుగ సీజన్‌లో కొన్ని కేసులు నమోదయ్యాయని పేర్కొంది. ఇందులో వ్యక్తులు 25 కెవి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్లలో చిక్కుకున్న గాలిపటం దారాలను తాకడంతో విద్యుత్ షాక్‌లు లేదా విద్యుద్ఘాతానికి గురయ్యారని వివరించింది. సాధారణంగా ప్రజలచే ఉపయోగించబడే చైనా నుంచి దిగుమతి చేయబడిన గాలిపటాల దారాలు, విద్యుత్ వాహకం అవడం వల్ల అవి మానవ జీవితానికి, క్లిష్టమైన రైల్వే ఎలక్ట్రికల్ మౌలిక సదుపాయాలకు కూడా గణనీయమైన నష్టాలను కలిగిస్తాయని తెలిపింది. ఈ విషయంలో ప్రజల నుంచి సంపూర్ణ సహకారాన్ని కోరుతున్నట్టు పేర్కొంది. రైల్వే ట్రాక్‌ల దగ్గర గాలిపటాలు ఎగరేయడాన్ని నివారించాలనీ, ఓవర్‌హెడ్ లైన్‌లు అధిక ఓల్టేజ్ విద్యుత్‌తో ఛార్జ్ చేయబడినందువల్ల వాటిని తాకినప్పుడు మానవ జీవితానికి పెను ప్రమాదం కలిగిస్తాయని తెలిపింది. ఓవర్‌హెడ్ కండక్టర్ల నుంచి గాలిపటం దారాలను వేలాడుతున్న సమయంలో రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించింది. తద్వారా శిక్షణ పొందిన సిబ్బంది సురక్షితంగా గాలిపటాల దారాలను తీసివేయగలరని సలహానిచ్చింది.

గర్జించిన రైతన్న



- స్తంభించిన జనజీవనం
- 163 రైళ్లు రద్దు... నిలిచిన రాకపోకలు
- ప్రజల నుంచి విశేష స్పందన
- వాణిజ్య సంస్థల మద్దతు, మూసివేత

కేంద్రం వైఖరికి నిరసనగా పంజాబ్ బంద్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతులు గర్జించారు. తాము పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్ట హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంజాబ్ వ్యాప్తంగా కిసాన్ మజ్దూర్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చా బంద్ చేపట్టాయి. దీంతో రాష్ట్రం మొత్తం స్తంభించింది. పెద్ద ఎత్తున రైతులు రోడ్లపైకి వచ్చి ఈ బంద్‌లో పాల్గొన్నారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్, బటిండాలోని రాంపురా ఫుల్, మొహాలీలోని ఐఐఎస్ఈఆర్ చౌక్ వద్ద ఎయిర్‌పోర్ట్ రోడ్డు, కురాలి రోడ్ టోల్ ప్లాజా, లాల్రూ సమీపంలోని అంబాలా - ఢిల్లీ హైవే, ఖరార్-మొరిండా హైవే సహా కీలక మార్గాలను రైతులు దిగ్బంధించారు. ధరేరి జట్టన్ టోల్ ప్లాజా వద్ద బైటాయించారు. దీంతో పాటియాలా-చండీగఢ్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి.

ప్రజల నుంచి విశేష స్పందన

బంద్ పట్ల ముందు నుంచి విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. రాష్ట్రంలోని ప్రజలకు నిత్యావసర వస్తువుల సరఫరా ఉండబోదని ముందుగానే చెప్పడంతో ప్రజలు కూడా అందుకు సిద్ధపడ్డారు. అలాగే వాహనాలు, రైళ్లను సైతం తిరగనివ్వబోమని ప్రకటించడంతో ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అత్యావసరాలకు మాత్రమే బంద్ నుంచి మినహాయించారు. దీంతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగలేదు. ప్రజలకు కూడా బంద్‌కు సహకరించారు. ఈ బంద్‌కు వ్యాపారులు, ఉద్యోగ సంఘాలు, కార్మికులు, మాజీ సైనికులు, సర్పంచ్‌లతోపాటు వివిధ వర్గాల వారు మద్దతు ప్రకటించారు. బంద్‌కు సహకరించిన ప్రజలకు రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ ధన్యవాదాలు తెలిపారు. జనవరి 4న ఖనౌరీ నిరసన ప్రదేశంలో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించనున్నట్టు ఆందోళన కారులు ప్రకటించారు.

కొనసాగిన జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరాహార దీక్ష

70 ఏండ్ల రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. రైతుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు నిరాహార దీక్ష విరమించేదే లేదని దల్లేవాల్ ప్రకటించారు. అయితే దల్లేవాల్ ఇప్పటివరకు వైద్య చికిత్సను నిరాకరించారు. ఆయనను ఆస్పత్రికి తరలించడానికి ఒప్పించేందుకు సుప్రీంకోర్టు పంజాబ్ ప్రభుత్వానికి డిసెంబర్ 31 వరకు సమయం ఇచ్చింది. అవసరమైతే కేంద్రం నుంచి లాజిస్టికల్ మద్దతును కోరే స్వేచ్ఛను రాష్ట్రానికి ఇచ్చింది. ఈ నేపథ్యంలో జనవరి 3న రైతులతో చర్చించనున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది.

వాణిజ్యసంస్థల మద్దతు

రైతులు చేపట్టిన ఈ బంద్‌కు వాణిజ్య సంస్థలు సైతం మద్దతిచ్చాయి. ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు బంద్‌కు మద్దతునిస్తూ మూసివేశాయి. ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మూతబడ్డాయి. పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200కిపైగా రోడ్లను రైతులు బ్లాక్ చేశారు. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రైతుల బంద్‌తో రైళ్ల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ-పంజాబ్ మధ్య రాకపోకలు సాగించే దాదాపు 163 రైల్వే సర్వీసులు రద్దయ్యాయి. విమానాలు, వైద్య, అంబులెన్స్‌లు, పెండ్లిండ్లు, ఉద్యోగ ఇంటర్వ్యూలు సహా అత్యవసర సేవలకు బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. రైతుల బంద్ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మొహాలి జిల్లా వ్యాప్తంగా దాదాపు 600 మంది పోలీసు సిబ్బంది మోహరించారు. సీనియర్ పోలీస్ అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ బంద్ కొనసాగింది.

నోటికాడి కూడు లాక్కుంటే కొట్లాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎర్రజెండా తరఫున పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మా కంపెనీని రద్దు చేయడంతో పాటు రైతులకు భూములు ఇస్తామని హామీనిచ్చిందన్నారు. లగచర్లలో 1300 ఎకరాలకు తోడు మరో 15వేల ఎకరాలు తీసుకుని విదేశీ కంపెనీని తీసుకొచ్చి ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని చెప్తున్నారన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ హైదరాబాద్, జహీరాబాద్‌లో పెట్టాలని చూస్తే అక్కడ ఎర్రజెండాలే పోరాటం చేసి అడ్డుకున్నాయని, ఇక్కడ కూడా ఎర్రజెండాలు పోరాటం చేసి అడ్డుకుంటాయని హెచ్చరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తమ్మినేని ఖండించారు. అమిత్ షాను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఫ్రీ బస్సు తప్ప అమలు చేసిందేమీ లేదన్నారు. పైగా హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్‌ను సమర్థించిన ఎర్రజెండాలే పేదల పక్షాన నిలదీసి అడుగుతున్నాయని స్పష్టం చేశారు. భూమిని పంచిన, సాధించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని, ఆ అనుభవంతోనే లగచర్ల భూములను రక్షించేందుకు అండగా ఉంటుందని అన్నారు. 1156 ఎకరాల భూమి కొడంగల్‌లో దొరల దగ్గర ఉందని, ఆ భూముల్లో ప్రభుత్వం అనుకున్న వాటిని నెలకొల్పాలని సూచించారు. 'దొరల భూముల దగ్గరకు పోతే కోర్టు అడ్డం వస్తుంది. పేదల భూముల దగ్గరికి పోతే కోర్టు అడ్డం రాదా..' అని ప్రశ్నించారు. కానీ, పేదల భూముల దగ్గరికి పోతే కోర్టు అడ్డం రాకపోయినా ఎర్రజెండా అడ్డం వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములను చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డిజి.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్‌రాములు, శ్రీరామ్‌నాయక్, వికారాబాద్ జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటయ్య, బుస చంద్రయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, సతీష్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ.. నూతన సంవత్సర శుభాకాంక్షలు

నిజాలు నిర్భయంగా చెబుతూ ప్రభుత్వానికి, ప్రజలకు పత్రికలు వారధిగా ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నవతెలంగాణ 2025 నూతన క్యాలెండర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, శ్రీరామ్‌నాయక్, జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, నవతెలంగాణ రిపోర్టర్ వెంకట్‌రామ్‌రెడ్డితో కలిసి తమ్మినేని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను పత్రిక చెప్పాలన్నారు. వాస్తవాలను, ప్రజాసమస్యలను వెలికితీయడంలో నవతెలంగాణ కృషి గొప్పదన్నారు. ప్రతి ఏడాదీ నవతెలంగాణ యాజమాన్యం నాణ్యమైన రంగులతో, కొత్త హంగులతో ప్రజలకు నూతన క్యాలెండర్ అందించడం సంతోషం అన్నారు. అనుదినం జనస్వరం ట్యాగ్ లైన్ కలిగిన నవతెలంగాణ అనునిత్యం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అలాగే నాయకులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక యాజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



తుపాకీ విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

- తూపాకి, 2 తూటాలు, కారు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం : ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ వెల్లడి

నవతెలంగాణ-మహబూబాబాద్

తుపాకీ విక్రయించడం కోసం కారులో పెట్టుకుని తిరుగుతున్న ముఠాలోని ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి తూపాకీ, రెండు తూటాలు, కారు, 5 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నట్టు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు. సోమవారం మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఎస్పీ ఆ కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. కేసముద్రం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును ఆపి.. అందులో ఉన్నవారిని విచారించారు. అందం గోపి, గోస్వామి ప్రవీణ్ భారతి, మాధవ పెద్ది శ్రీకాంత్ రెడ్డి, దొంతగాని సందీప్, మెరుగు సిద్ధార్థ గుజరాత్‌లో తుపాకీ కొనుగోలు చేశారు. దాన్ని మహబూబాబాద్ జిల్లాలో అమ్మకానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. దీంతో వారిని అరెస్టు చేశారు. వీరారెడ్డిపల్లిలో ఒక కిరాణం షాపులో దొంగతనం చేశారని, నెక్కొండ మండలంలోని రెడ్లవాడ దగ్గరలోని తండాలో మేకలు దొంగతనం చేసినట్టు నిందితులు ఒప్పుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఇమ్రాన్ ఖాన్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సొత్తు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. వారిని పట్టుకున్న సీఐ సర్వయ్య ఎస్ఐలు మురళీధర్ రాజు, తహేర్ బాబాను ఎస్పీ అభినందించారు.

శాస్త్రీయ విద్య కోసం పోరాడదాం

- నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి
- హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో శాస్త్రీయ విద్యారంగం కోసం పోరాడదామని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని వ్యతిరేకిద్దామని చెప్పారు. అమరుల త్యాగాలతో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని అన్నారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆర్ఎల్ మూర్తి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై రాజీ లేకుండా పోరాటం చేసే ఏకైక సంఘం దేశంలో ఎస్ఎఫ్ఐ మాత్రమే అని అన్నారు. ఈ 55 ఏండ్ల ప్రస్థానంలో ఎందరో ఎస్ఎఫ్ఐ నాయకులు అమరులయ్యారనీ, వారి త్యాగాలతో మరింత ముందుకు వెళ్తామని చెప్పారు. విద్యా ప్రయివేటీకరణ, విద్యాకాషాయకరణ, విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా అనునిత్యం ఉద్యమిస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదన్నారు. రాజ్యాంగంలోని హక్కులను హరిస్తున్నదని చెప్పారు. జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం ముసుగులో ఈ దేశంలో విద్యా విధానాన్ని సామ్రాజ్యవాద దేశాలకు వ్యాపారం చేసుకునేలా రెడ్ కార్పెట్ పలుకుతున్నదని అన్నారు. విద్యలో శాస్త్రీయ దృక్పథం లేకుండా మూఢవిశ్వాసాలను పాఠ్యాంశాల్లో చేరుస్తున్నదని చెప్పారు. మోడీ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న కారణంగానే దేశంలో ఎస్ఎఫ్ఐ నాయకుల మీద భౌతిక దాడులు జరుగుతున్నాయని అన్నారు. దేశద్రోహ చట్టాలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడంలో ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉందన్నారు. మోడీ ప్రభుత్వం మనువాద ఎజెండాను అమలు చేస్తూ వెనకబడిన వర్గాలను విద్యకు దూరం చేస్తున్నదని విమర్శించారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలపై సామాజిక అసమానతలపై కలిసి ఉద్యమం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, సహాయ కార్యదర్శి కిరణ్, అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, స్టాలిన్, ప్రశాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఉపాధ్యక్షులు ఎండీ జావేద్ పాల్గొన్నారు.

పది మంది యువ ఐపీఎస్‌లు బదిలీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

గ్రేహౌండ్స్‌లో ఉన్న ఏఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులను బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాజల్‌ను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏఎస్పీగా మార్చారు. కంకనాల రాహుల్ రెడ్డిని భువనగిరి ఏఎస్పీగా బదిలీ చేశారు. చిత్తరంజన్‌ను ఆసిఫాబాద్ ఏఎస్పీగా, బొక్క చైతన్యరెడ్డిని కామారెడ్డి ఏఎస్పీగా, పండెరె చేతన్ నితిన్ జనగామ ఏఎస్పీగా నియమిం చారు.

నగ్రాలే శుభమ్ ప్రకాశ్‌ను కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా, రాజేశ్ మీనాను నిర్మల్ ఏఎస్పీగా, పి. మౌనికను దేవరకొండ ఏఎస్పీగా బదిలీ చేశారు. అలాగే, విక్రాంత్ కుమార్ సింగ్‌ను భద్రాచలం ఏఎస్పీగా నియమించి, ఇక్కడున్న ఏఎస్పీ అంకిత్ కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

దళిత ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

- తుక్కుగూడ ఘటనపై సీఐటీయూ నిరసన
- సంగారెడ్డిలో మతోన్మాదుల దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మతోన్మాదం ముదిరిపాకాన పడిందని, రాష్ట్రంలో మూక దాడులు పెరిగాయని, దళిత ఉపాధ్యాయుడిపై అకారణంగా దాడి చేసి కాళ్లు మొక్కించడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాములపై మతోన్మాద మూకలు భక్తి ముసుగులో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సుందరయ్య భవన్ నుంచి ర్యాలీ నిర్వహించి న్యూ బస్టాండ్ సెంటర్‌లో మతోన్మాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. మతం, కులం పేరిట, భక్తి ముసుగులో మతోన్మాద శక్తులు మూక దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ఇలాంటి దాడుల్ని ఉద్యోగ, కార్మికులు, ప్రజాతంత్రవాదులు, లౌకిక శక్తులు ఖండదించడమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరముందని చెప్పారు. దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసి అవమానపర్చిన వారందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గురువుల్ని గౌరవించాల్సింది పోయి వారిపై దాడులు చేసి కాళ్లు మొక్కించుకుని అవమాన పర్చడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉపాధ్యాయుడు రాములు క్షమాపణ చెప్పినప్పటి కీ అయ్యప్ప మాల వేసిన విద్యార్థితో పాటు ఇతర స్వాముల కాళ్లు మొక్కించడం హేయమైన చర్య అన్నారు. గతంలో నిజామాబాద్ జిల్లా వర్నిలో కూడా ఒక పాఠశాలలో విద్యార్థులకు టీచర్ శాస్త్రీయ భావనలు, సైన్స్ దృక్పథాన్ని బోధించడాన్ని సాకుగా తీసుకుని మతోన్మాదులు అతనిపై దాడి చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

విద్యకు కేటాయింపులేవీ..?

అసంతృప్తి వ్యక్తం చేసిన సీఐఐ | నిధులు పెంచాలని సూచన | వృత్తి విద్యను బలోపేతం చేయాలని సిఫారసు

దేశ ప్రగతికి కీలకమైన విద్యా రంగానికి ప్రభుత్వ కేటాయింపులు నానాటికీ తీసికట్టుగా ఉంటున్నాయి. పాఠశాల విద్యా వ్యవస్థ తీరుతెన్నులపై ఎనిమిది దేశాల్లో ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం మన దేశంలో విద్యా రంగానికి కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి. గత ఆరు సంవత్సరాల కాలంలో జీడీపీలో విద్యకు కేటాయింపులు కేవలం 2.7-2.9 శాతం మధ్యలోనే ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలంటే కేటాయింపులను జీడీపీలో 6 శాతానికి పెంచాల్సిన అవసరం ఉన్నదని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన అధ్యయనం తెలిపింది. భారత్, ఆస్ట్రేలియా, చైనా, ఇండోనేషియా, స్వీడన్, థాయిలాండ్, బ్రిటన్, అమెరికా దేశాల్లోని విద్యా వ్యవస్థల తీరుతెన్నులను సీఐఐ పరిశీలించింది.

కేటాయింపులు ఇలా...



పరిశ్రమకు భాగస్వామ్యం కల్పించాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : 2018-2023 మధ్య కాలంలో భారత్ తమ జీడీపీలో విద్య కోసం 2.7-2.9 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేయగా స్వీడన్ (6.7-6.9 శాతం), బ్రిటన్ (5.3-5.6 శాతం) వంటి సంపన్న దేశాలతో పాటు ఇండోనేషియా (3.7-4.3 శాతం), థాయిలాండ్ (4.0-4.3 శాతం) వంటి వర్ధమాన దేశాలు అధిక కేటాయింపులు జరిపాయి. గత ఆరు సంవత్సరాల కాలంలో విద్యా రంగానికి ఆస్ట్రేలియా కేటాయింపులు 8 శాతం, చైనా కేటాయింపులు 2.4 శాతం పెరగగా భారత్‌లో మాత్రం ఎలాంటి పెరుగుదల కన్పించలేదు. ఇండోనేషియాలో విద్యా రంగానికి కేటాయింపులు 2.8 శాతం తగ్గగా స్వీడన్‌లో పెద్దగా మార్పులు జరగలేదు.

వీడని మొద్దు నిద్ర

ఇతర వర్ధమాన దేశాలు తమ జీడీపీలో విద్యకు కేటాయింపులను 5-7 శాతం పెంచుతుంటే భారత్ మాత్రం మొద్దు నిద్ర వీడడం లేదని నివేదిక ఎత్తిపొడిచింది. సీఐఐ తన అధ్యయనం కోసం ప్రభుత్వ నివేదికలతో పాటు ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ), ఐరాస ఎడ్యుకేషన్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) వంటి అంతర్జాతీయ సంస్థలు, విద్యా సంబంధమైన ప్రచురణల నుండి సమాచారాన్ని సేకరించింది.

2020లో జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ) ప్రకటించిన తర్వాత విద్యా రంగాన్ని సంస్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు నూతన చర్యలను చేపట్టిందని సీఐఐకి చెందిన అధికారి ఒకరు తెలిపారు. భారతీయ పాఠశాల విద్యా వ్యవస్థ ప్రమాణాలను ఇతర దేశాల్లోని ప్రమాణాలతో పోల్చడంపై దృష్టి సారించామని ఆయన చెప్పారు.

సెకండరీ స్థాయిలో తగ్గిన ప్రవేశాలు

ప్రాథమిక విద్యలో ప్రవేశాలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ సంపన్న దేశాలతో పోలిస్తే దేశంలో సెకండరీ స్థాయిలో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని సీఐఐ అధ్యయనం తెలిపింది. ప్రాథమిక విద్యలో ప్రవేశాల రేటు 103.4 శాతం ఉంటే సెకండరీ స్థాయికి వచ్చే సరికి 79.6 శాతం మాత్రమే ఉన్నదని చెప్పింది. దీనికి భిన్నంగా బ్రిటన్ (100 శాతం), స్వీడన్ (100 శాతం), అమెరికా (98 శాతం), చైనా (92 శాతం) ఆస్ట్రేలియా (90 శాతం), ఇండోనేషియా (82 శాతం), థాయిలాండ్ (80 శాతం)లో సెకండరీ విద్యలో ప్రవేశాలు అధికంగా ఉన్నాయి. సెకండరీ స్థాయిలో ప్రవేశాలు పడిపోవడానికి ప్రధాన కారణం సామాజిక ఆర్థిక అంశాలేనని నివేదిక చెప్పింది. దేశంలో ప్రాంతీయ అసమానతలు, లింగ వ్యత్యాసాలు, గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాలు సరిగా లేకపోవడం, మౌలిక సదుపాయాల లేమి వంటి అంశాలు కూడా ఈ పరిస్థితికి కారణమే.

నివేదిక ఏం చెప్పింది?

విద్య విషయంలో ఇతర దేశాలు కూడా సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నాయి. అయినప్పటికీ అవి అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాయి. మన దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం, ఉపాధ్యాయుల నియామకం కోసం పెట్టుబడులు పెంచాలని, తద్వారా గ్రామీణ-పట్టణ అసమానతలను తగ్గించాలని అధ్యయన నివేదిక సూచించింది. చైనా, ఆస్ట్రేలియా, థాయిలాండ్ దేశాల నుంచి పాఠాలు నేర్చుకొని విద్యా రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించింది. స్పష్టమైన విధానాలు, ఉపాధ్యాయులకు శిక్షణ, వనరుల కేటాయింపు ద్వారా పురోగతి సాధించాలని సిఫారసు చేసింది. విద్యను అభ్యసించడంలో సామాజిక, ఆర్థిక అసమానతలు అడ్డంకి కారాదని, ఆస్ట్రేలియా తరహాలో ఈ రంగానికి నిధులు సమకూర్చుకోవాలని చెప్పింది. వృత్తి విద్యను బలోపేతం చేసి దానిని పరిశ్రమతో అనుసంధానం చేయాలని సూచించింది. స్వీడన్, ఆస్ట్రేలియా దేశాలు విద్యను నేర్పడంతో పాటు అప్రెంటీస్‌షిప్ అవకాశాలు కూడా కల్పిస్తున్నాయని గుర్తు చేసింది. చైనా, థాయిలాండ్‌లో పరిశ్రమ భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుందని, అలాగే బ్రిటన్, అమెరికాలో సెకండరీ పాఠశాలలోనే వృత్తి విద్యను నేర్పుతారని, దీనివల్ల విద్యార్థులు విద్యా సంబంధమైన పరిజ్ఞానంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటారని సీఐఐ నివేదిక తెలియజేసింది. భారత్ కూడా అప్రెంటీస్‌షిప్ కార్యక్రమాలను విస్తరించాలని, పరిశ్రమ-పాఠశాల మధ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పాలని సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో వర్చువల్ ల్యాబ్స్, మొబైల్ ట్రైనింగ్ యూనిట్లను విస్తరించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. కార్మికులు, ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచాలని, ఉద్యోగావకాశాలు మెరుగుపరచాలని సీఐఐ అధ్యయన నివేదిక ప్రభుత్వాన్ని కోరింది.

సమస్య ఏదైనా కొట్లాడేది ఎర్రజెండానే..

ప్రజలు వామపక్షాలను కోరుకుంటున్నారు

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు చారిత్రాత్మక ప్రాధాన్యత : సంగారెడ్డిలో 'మీట్ ది ప్రెస్'లో ఎస్.వీరయ్య



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"రాష్ట్రం వామపక్షాలను కోరుతోంది. ఇప్పుడు ఎర్రజెండా అవసరం ఏర్పడింది. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పాలన చూశాం. తాజాగా ఏడాదిపాటు కాంగ్రెస్ పాలననూ చూశాం. కేంద్రంలో బీజేపీ అధికారం చెలాయిస్తోంది. వీరి పాలనలో తెలంగాణ ప్రజల జీవితాలు బాగుపడలేదు. మూడు పార్టీలకూ పెద్దోళ్ల, సంపన్నుల ప్రయోజనాలు తప్ప కార్మికులు, కర్షకులు, పేదల సంక్షేమం పట్టలేదు. ప్రజల జీవితాలను, ప్రజాస్వామ్య విలువలను గాలికొదిలేశారు. ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల పక్షాన కొట్లాడుతున్న ఎర్రజెండా, సీపీఐ(ఎం) అధికారంలోకి వస్తేనే రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం మార్పు.. ప్రజల జీవితాల్లో మౌలికమైన మార్పులు సాధ్యం' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో "మీట్ ది ప్రెస్" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉందన్నారు. తెలంగాణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాంశాలను చర్చించి తగిన తీర్మానాలు, నిర్ణయాలు చేయనున్నట్టు తెలిపారు. కార్మికుల కనీస వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా మాత్రమే కొట్లాడిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఏనాడూ కార్మికుల కష్టాల గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


రాష్ట్రంలో ఎర్రజెండా నాయకత్వంలో లక్ష గుడిసెలేయించి ఇండ్లు లేని పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని సీపీఐ(ఎం) పోరాడిందని గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడితే గత ప్రభుత్వం కేసులు పెట్టిందని, తాము అధికారంలోకి రాగానే కేసుల్ని కొట్టేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరించారని అన్నారు. ఏడాది పాలన చూస్తే పచ్చి అవకాశవాదమే కనిపిస్తోందన్నారు. మెదక్, కొమురంబీం ప్రాంతాల్లో బీజేపీ మత కల్లోహాలు లేపి అల్లర్లు చేస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కనీసం ఖండించలేదన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలంటే సీపీఐ(ఎం) బలపడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. మరోపక్క సామాజికంగా జరుగుతున్న వివక్ష, దాడులకు వ్యతిరేకంగా కూడా సీపీఐ(ఎం) మాత్రమే బాధితుల పక్షాన నిలబడి పోరాడిందన్నారు. కులదురహంకార హత్యలు, దాడుల్ని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో ఒక్కరోజైనా తప్పుపట్టిన పరిస్థితి లేదన్నారు. రాజకీయాల కోసం మాత్రం మూడు పార్టీలు అంబేద్కర్ పేరును వాడుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో సామాజిక దాడులు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కులదురహంకార చర్యలకు వ్యతిరేకంగా కనీసం ప్రచారమైనా చేయడం లేదన్నారు

ప్రజా ఉద్యమాల సారథి సీపీఐ(ఎం): చుక్క రాములు

ప్రజా ఉద్యమాల సారథిగా సీపీఐ(ఎం) పని చేస్తోందని రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు అన్నారు. మహాసభ జయప్రదం కోసం ఆహ్వాన సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. 25న స్థానిక పీఎస్ఆర్ గార్డెన్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, బీవీ.రాఘవులు, ప్రతినిధుల సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్, ప్రకాశ్‌కరత్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మాణిక్, ఎం.నర్సింహులు పాల్గొన్నారు.

వామపక్షాల వల్లే ఆ చట్టాలు



డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు పూర్తి గౌరవమిస్తూనే... దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఆయన భారతదేశ ఆర్థిక విధానాల రూపకల్పనలో పోషించిన కీలక పాత్రను గుర్తిస్తూనే అతి అంచనాలకు లోను కాకూడదు. ముఖ్యంగా 1991-96, 2004-2014 మధ్య సరళీకృత ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర కీలకం. ఈ విషయంలో ఆశ్చర్యకరంగా రఘురామ్‌రాజన్ ఒక విషయం చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని , ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చిన ఘనతను డాక్టర్ సింగ్‌కు అంటగట్టే వాళ్లు ఓ విషయాన్ని మరిచిపోతున్నారని అన్నారు. వామపక్షాలు, అనేక స్వచ్ఛంద సంస్థలు నిర్విరామంగా సల్పిన పోరు వల్లే ఆ చట్టాలు దేశంలో సుసాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. పాలకవర్గాలు ఏకగ్రీవంగా అమలు చేయటం నయా ఉదారవాద విధానాల అమల్లో భాగంగానే ఇవి ఉన్నాయి. కష్టజీవులపై ఆ విధానాల విపత్కర పరిణామాలను మన దేశ ఆర్థిక, రాజకీయ స్వావలంబనపై దాడిని నేడు మనం చూస్తున్నాం. వీటిని తేలికగా పక్కకు చెరిపివేయజాలమని గుర్తుంచుకోవాలి.

- వెంకటేష్ ఆత్రేయ

సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా
నూతన కమిటీ ఎన్నిక

జిల్లా కార్యదర్శిగా పగడాల యాదయ్య

25 మంది సభ్యులతో కమిటీ .. యువతకు చోటు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా 10వ మహాసభలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా పగడాల యాదయ్య ఎన్నికయ్యారు. 25 మందితో జిల్లా కమిటీని ఎన్నుకోగా.. అందులో 9 మంది సభ్యులతో జిల్లా కార్యదర్శివర్గం ఏర్పాటైంది. ఇబ్రహీం పట్నంలో రెండ్రోజుల పాటు జరిగిన జిల్లా మహాసభలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా రైతు, కార్మిక, నిరుద్యోగం, దళిత, మహిళల సమస్యల పరిష్కారంపై భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళికలను రూపొందించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కాడిగళ్ల భాస్కర్, బి.సామేల్, చంద్రమోహన్, కవిత, జగదీష్, దుబ్బాక రాంచందర్, కందుకూరి జగన్, ఏర్పుల నర్సింహ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా కె.సుమలత, ఆర్.జంగయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, ఏ.నర్సింహ, పి.అంజయ్య, సీహెచ్.బుగ్గ రాములు, సిహెచ్.జంగయ్య, డి.కిషన్, జె.రుద్రకుమార్, కె.నర్సిరెడ్డి, జి.నర్సింహ, సి.శోభన్, ఎస్.రాజు, పి.జగన్, కో-ఆప్షన్‌గా మహిళ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రారంభోపన్యాసం చేయగా.. భవిష్యత్ ప్రణాళికలు ప్రకటిస్తూ నూతన కమిటీని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ పరిచేయం చేస్తూ ముగింపు ప్రసంగం చేశారు.

బోయింగ్ విమానాలన్నింటికీ
భద్రతా తనిఖీలు

దక్షిణ కొరియా అధ్యక్షుని ఆదేశాలు



సియోల్ : దక్షిణ కొరియా ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న బోయింగ్ విమానాలన్నింటికీ భద్రతా తనిఖీలు నిర్వహిస్తామని దక్షిణ కొరియా అధికారులు సోమవారం తెలిపారు. ఇటువంటి తరహా బోయింగ్ విమానాలు 101 వున్నాయి. ఆదివారం జరిగిన విమాన ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విమాన ప్రమాదంతో దేశ వైమానిక రంగం భద్రతపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. దేశ వైమానిక నిర్వహణా వ్యవస్థలపై అత్యవసరంగా సమీక్ష చేపట్టాల్సిన అవసరం వుందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కొత్త తాత్కాలిక అధ్యక్షుడు చోయి సాంగ్ మాక్ సోమవారం అధికారులను ఆదేశించారు. ఈ విమాన ప్రమాదంపై ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వుండేందుకు మొత్తంగా వైమానిక రంగ భద్రతా వ్యవస్థను పునర్వ్యవస్థీకరిచండం అవసరమని చోయి అభిప్రాయపడ్డారు.

మన్మోహన్ గొప్ప నేత

చనిపోయాడని తెలిసీ రాహుల్‌గాంధీ వియత్నాం వెళ్లడమేంటి? : బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం తగదు

ఆయన వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలి: మంత్రి శ్రీధర్‌బాబు... తొలగించిన సభాపతి



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్ప నేత అనీ, ఆయనపై శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. పీవీ పట్ల కాంగ్రెస్ కక్ష పెంచుకున్నదని ఆరోపించారు. పదేండ్లు యూపీఏ ప్రభుత్వమే అధికారంలో ఉండగా పీవీకి భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ఆ పురస్కారాన్ని ఇచ్చామని గుర్తు చేశారు.

ఒకానొక దశలో మన్మోహన్‌సింగ్ తెచ్చిన ఆర్డినెన్స్ కాపీలను రాహుల్‌గాంధీ చించేశారని వ్యాఖ్యానించారు. ఓపక్క మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి కేంద్ర ప్రభుత్వం ఐదు రోజుల సంతాప దినాలు ప్రకటిస్తే.. రాహుల్ గాంధీ న్యూ ఇయర్ వేడుకల కోసం వియత్నాం వెళ్లడమేంటని నిలదీశారు. ఈ దశలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ... సంతాప తీర్మానంపై ఇలా మాట్లాడటం సరిగాదన్నారు.

ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. ఆ వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు సభాపతి ప్రకటించారు. అయినా ఏలేటి మళ్లీ రాహుల్‌గాంధీపై అవే వ్యాఖ్యలు చేయడంతో మంత్రి పొన్నం సీరియస్ అయ్యారు. ఇది సభామర్యాద కాదని హితవు పలికారు. సభలో ఏవోమాటలు మాట్లాడి తానున్న (బీజేపీ) పార్టీలో పేరుతెచ్చుకోవాలని చూడటం ఏలేటికి మంచిది కాదని సూచించారు. ఆయన సభలో ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని విమర్శించారు.

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ..దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి సంక్షేమం వైపు నడిపించిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఆర్థిక వేత్తగా, ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానిగా దేశంపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆ మహనీయుని మరణం యావత్ దేశానికి తీరనిలోటని తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, దేశ ఆర్థిక స్థితిగతులను మార్చేసిన మన్మోహన్ ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్
మోడ్రన్ ఇండియా...

బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థికరంగంలో దేశాన్ని ముందుకు నడిపించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్...సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ అభివర్ణించారు. ఆయన గొప్పతనాన్ని, సామర్థ్యాన్ని, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన ఘనత తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకే దక్కుతుందని కొనియాడారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదనీ, ఆ రకంగానే మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని గుర్తుచేశారు. సోమవారం శాసనసభలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి కేటీఆర్ మద్దతు తెలిపారు. మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నా మన్నారు. ఢిల్లీలో మాజీ ప్రధానులందరి పేరిట మెమోరియల్స్ ఉన్నాయనీ, తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావు పేరిట లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. దేశ రాజధానిలో పీవీ మెమోరియల్ భవనాన్ని ఏర్పాటు చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'లాటరీ ఎంట్రీ రాజకీయాల'తో సంబంధ లేని ఆర్థిక వేత్త అయిన మన్మోహన్‌సింగ్‌ను పీవీ...ఆర్థిక మంత్రిగా నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన మంత్రి అయ్యే నాటికి కేవలం 15 రోజుల విదేశీ నిల్వలు మాత్రమే మనదగ్గర ఉన్నాయని తెలిపారు. ఆ దశ నుంచి విప్లవాత్మక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని కొనియాడారు. మన్మోహన్ సింగ్ ఎక్కడా డాంబికాలకు, ఆర్భాటాలకు పోకుండా 'సింపుల్ లివింగ్-హై థింకింగ్' అనే పద్ధతినే చివరి వరకూ కొనసాగించారని ప్రశంసించారు, తనకు రాజకీయ అవకాశమిచ్చిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం విశ్వసపాత్రుడుగా ఉన్నారని కొనియాడారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు మన్మోహన్‌సింగ్‌తో ఉన్న అనుబంధాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని మాట్లాడేందుకు వెళ్లినప్పుడు తెలంగాణ బృందానికి గంటన్నరకుపైగా సమయం ఇచ్చి సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నారని తెలిపారు. యూపీఏ-1 హయాంలో కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇచ్చినప్పుడు డీఎంకేతో చిక్కుముడి ఏర్పడిందనీ, అప్పుడు తమ నేత కేసీఆర్ ప్రధాని మన్మోహన్ వద్దకు వెళ్లి తాను వచ్చింది పదవుల కోసమో, పోర్టుఫోలియోల కోసమో కాదు.. తెలంగాణ కోసమని చెప్పి, ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకి ఇచ్చారని గుర్తుచేశారు. 'మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుంది, కర్మయోగిగా నిలుస్తారంటూ' ఆనాడు మన్మోహన్... కేసీఆర్‌కు చెప్పిన మాటల్ని ప్రస్తావించారు. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని అర్థం చేసుకున్నారు కాబట్టే రాష్ట్ర ఏర్పాటుకు ఆయన సహకరించారని చెప్పారు. కేసీఆర్ ఆదేశాల మేరకు మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల్లో తాము పాల్గొన్నామనీ, కుటుంబ సభ్యులను పరామర్శించామని తెలిపారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ సంస్కరణల్లో మానవీయ దృక్పథాన్ని జొప్పించారన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా లక్షలాది మంది గిరిజనులకు ఉపయోగం జరిగిందని తెలిపారు. మన్మోహన్‌సింగ్ హయాంలో దేశంలోని రైతులందరి రుణాలు మాఫీ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ బిల్లు సభలోకి వచ్చిన క్లిష్టసమయంలో ప్రధానిగా ఆ బిల్లును ఆమోదించడంలో ఆయన ప్రదర్శించిన రాజకీయ చతురతను కొనియాడారు.

ఎంఐఎం సభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ..మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన తీసుకొచ్చిన కీలక చర్యలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు. ఆయన గొప్ప నేత అని కొనియాడారు. బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ప్రధాని పదవిని చేపట్టారనీ, పీవీ-మన్మోహన్‌సింగ్‌తో కలిసి దేశాన్ని గాడిలో పెట్టారని కొనియాడారు.

సంపాదకీయం

ఈశ్వర్ అల్లా తేరానామ్..!



నేడు దేశంలో బీజేపీ బాపుజీపై చూపుతున్న గౌరవం కానీ, ఒలకపోస్తున్న ప్రేమ కానీ చూస్తుంటే

"పైపై సొగసులు కల్ల సుమా!
లోపలిదంతా డొల్ల సుమా!
నిజం తెలియమని నేనంటాను
లేదా కొంపే గుల్ల సుమా!" అన్న దాశరథి కృష్ణమాచార్య కవితా వాక్కులు గుర్తుకు రాకమానవు. నిన్న (సోమవారం) మహాత్మాగాంధీ 76వ వర్థంతి సందర్భంగా బాపు ఘాట్‌కు ప్రధానమంత్రి దగ్గర నుంచి చోటామోటా నేతల వరకు క్యూ కట్టి నివాళులర్పించి, అక్కడ జరిగే సామూహిక ప్రార్థనల్లో కూడా పాల్గొన్నారు. వాళ్లే నిన్నటికి నిన్న పాట్నాలో నిర్వహించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో మహాత్ముడిపై ద్వేషాన్ని వెల్లకక్కారు. భోజ్‌పురి గాయకురాలు దేవి గాంధీజీకి అత్యంత ప్రీతిపాత్రమైన 'రఘుపతి రాఘవ రాజారామ్' భజనను ఆలపిస్తున్న తరుణంలో అందులో 'అల్లా' అన్న పదం వచ్చిందన్న కారణంతో ఆమెను కమల దళం అడ్డుకున్నది. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సహా పలువురు నాయకులు ఆమె నుండి మైక్రోఫోన్ లాక్కొని జైశ్రీరాం అంటూ నినాదాలు చేయడం గర్హనీ యం. అల్లా పేరును ఉచ్చరించి నందుకు క్షమాపణ చెప్పాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చి మరి చెప్పించారు. 'జై సీతారామ్'కు బదులు 'జై శ్రీరాం' అని నినదించాలని ఒత్తిడి తెచ్చారని ఆమె వాపోయారు.

'ఈశ్వర్ అల్లా తేరానామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అని పాడుకున్న జాతిపిత గుండెలను తుపాకీ గుండుతో చీల్చిన గాడ్సే వారసులకు ఆ గీతంలో విద్వేషం కాక ఐక్యత కనబడాలని ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ దేశంలో ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని కాంక్షిస్తూ మహాత్ముడు 'రఘుపతి రాఘవ రాజారామ్' భజన గీతానికి 'ఈశ్వర్ అల్లా తేరే నామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అన్న వాక్యాలను జోడించారు. సుమారు వంద ఏండ్లకు ఆ గీతంలోని 'అల్లా' అన్న పదం కేంద్రపాలకులను కలవరపాటుకు గురిచేస్తోంది. మహాత్ముడి సత్యాహింసలు, సత్యాగ్రహ సూత్రాలు ప్రపంచ ప్రాచుర్యం పొందినట్టుగానే, నిన్నటి విద్వేషాన్ని కూడా ప్రపంచ మీడియా చర్చిస్తున్నది. కానీ అధర్మం, అసత్యం రాజ్యమై సత్యాలోచనలను అణచివేస్తున్నది.

అన్ని మతాల ప్రజలు అన్నదమ్ములుగా సహనంతో జీవించాలని ఘోషించినందుకు ఆనాడు మతోన్మాదికి ఆగ్రహం తెప్పించింది. స్వేచ్ఛ, సమానత్వాలను కోరుకున్నాడు గాంధీ. ఇవేవీ గాడ్సే భావానుచరులకు మింగుడుపడని విషయాలు. అందుకే వాళ్లిప్పుడు సత్యం, న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే వారిని అణచివేసే హతమార్చే పనిలో ఉన్నారు. అందుకు అనేక ఉదాహరణలున్నాయి."యూపీ మే కాబా?" అని ఉత్తరప్రదేశ్‌లో ప్రజల బాధలను, రాజకీయుల దుర్మార్గాలను, సామాజిక పరిస్థితులను వ్యంగ్యంగా గానం చేసిన భోజ్‌పురి జానపద గాయని నేహాసింగ్‌కు నోటీసులిచ్చి నానా యాగీ చేసింది యోగీ సర్కార్. ఎవరు గొంతు విప్పినా వీరు నిర్బంధకాండకు పూనుకుంటున్నారు. ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మత సామరస్యత పోయి, మత విద్వేషం, మానవతా విధ్వంసం పెల్లుబుకుతున్న సందర్భాన శాంతి, అహింసల గాంధీతత్వాన్ని చర్చించటం సాహసమే.

మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడు గాంధీజీ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు ఆ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఆయన ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భిన్నత్వంలో ఏకత్వానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి విద్వేష హింసాలోచనల పరంపరనే. ఇప్పుడదే ఉన్మాదం సామూహిక విపత్తుగా పరిణమించిందన్న వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి.

వాళ్లు వేటినీ వొదలటం లేదు. విద్యను కాషాయీకరించటమే కాదు, విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ మార్చేందుకు బలమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. చైతన్యయుతమైన తెలంగాణ నడిబొడ్డున అయ్యప్పమాలలో ఉన్న విద్యార్థికి పొరపాటున ప్రధానోపాధ్యాయుడి కాలు తగిలిందన్న కారణంతో మతోన్మాదులు రెచ్చిపోయారు. దళిత ఉపాధ్యాయుడిపై కక్షగట్టింది అక్కడి మతతత్వం. బలవంతంగా ఆ గురువుతో విద్యార్థి కాలుపట్టించి క్షమాపణలు చెప్పించటం గమనిస్తే, మన విద్యా వ్యవస్థలోకి మూఢత్వ విద్వేషం ఎలా దూసుకొస్తుందో తేటతెల్లమవుతోంది. ఇది కేవలం ఒక సంఘటనగానే అర్థం చేసుకోలేము. రాబోయే కాలంలో విజ్ఞానానికి, స్వేచ్ఛకు, విద్యార్థులకు, విద్యా వికాసానికి ఎన్ని అడ్డంకులు రానున్నాయో తెలిపే సూచిక కూడా. రామరాజ్యమని చెప్పుకునే పాలకుల కాలంలో ఈ ఘటనలు ఆశ్చర్యపర్చవు. కానీ, కళాకారులు, రచయితలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరాన్ని ఇలాంటి సంఘటనలు ఎరుకపరుస్తున్నాయి.

> మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడు గాంధీజీ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు ఆ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఆయన ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భిన్నత్వంలో ఏకత్వానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి విద్వేష హింసాలోచనల పరంపరనే.

ట్రంప్ సుంకాల బెదిరింపులు-పర్యవసానాలు



ప్రభాత్ పట్నాయక్

అధిక సుంకాలను విధిస్తానంటూ ట్రంప్ తక్కిన దేశాలను బెదిరిస్తున్నాడు. మొదట బ్రిక్స్ దేశాలను బెదిరించాడు. ఆ దేశాలు గనుక డాలర్ మాధ్యమంలో వ్యాపారం చేయడం మానుకుంటే వాటి సరుకులపై అమెరికాలో 100 శాతం దిగుమతి సుంకం విధిస్తానని ప్రకటించాడు. ఆ తర్వాత వంతు యూరోపియన్ యూనియన్ (ఇ.యు) దేశాలది. 2023లో ఆ దేశాలు అమెరికాకు చేస్తున్న ఎగుమతులు అమెరికా నుండి చేసుకుంటున్న దిగుమతులకన్నా 208.7 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. అంటే వాటితో అమెరికా వాణిజ్యం లోటులో ఉంది. అందుచేత ఆ దేశాలు గనుక అమెరికా నుండి ముడిచమురు, సహజ వాయువు కొనుగోళ్లను పెంచకపోతే ఆ దేశాల నుండి అమెరికాకు వచ్చే దిగుమతుల మీద సుంకాలను పెంచుతానని హెచ్చరించాడు. ఇవిగాక ప్రపంచంలో ఏ దేశం నుండి అయినా అమెరికాకు దిగుమతయ్యే సరుకులన్నింటి మీదా 10 శాతం సుంకం పెంచుతానని, ప్రత్యేకించి చైనా నుండి వచ్చే దిగుమతుల మీద 60 శాతం పెంచుతానని ప్రకటించాడు. 2023లో చైనా నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులు ఎగుమతులకన్నా 279.4 బిలియన్ డాలర్ల మేరకు ఎక్కువగా ఉన్నాయి. 2018లోనైతే అవి 418 బిలియన్ డాలర్లు అధికంగా ఉన్నాయి. అప్పటి నుంచి కొంత తగ్గినా, ఇంకా చైనాతో అమెరికా వాణిజ్య లోటు గణనీయంగానే ఉంది.

ఇలా విధించే అధిక సుంకాల ఫలితంగా ఆర్థిక రంగంలో ముఖ్యమైన పరిణామాలు జరుగుతాయి. ఇప్పటికీ ఇ.యు దేశాలు ఇంకా రష్యన్ ముడిచమురు, సహజ వాయువు దిగుమతుల మీద కొంతవరకూ ఆధారపడతూనే వున్నాయి. అది కూడా లేకుండా మొత్తం అమెరికా నుండే కొనుగోలు చేస్తే అప్పుడు దానివలన ఇ.యు దేశాల్లో చమురు ధరలు ఏమీ పెరగకపోవచ్చు. కాని అమెరికాలో పెట్రోలు, సహజ వాయువు ధరలు కనీసం 30 శాతం పెరుగుతాయి. ఇయు దేశాలు అదనంగా కొనుగోళ్ళు పెంచిన ఫలితంగా అమెరికన్ చమురు డిమాండ్ పెరుగుతుంది. ముడిచమురు అంతర్జాతీయ ధరలు ఒకే విధంగా ఉంటాయి గనుక ఇ.యు లో దాని ప్రభావం ఉండదు. కాని అమెరికా వద్ద చమురు నిల్వలు తగ్గిపోయి, ఆ దేశంలో పెరిగే డిమాండ్ ను తట్టుకోడానికి అక్కడ ధరలు పెరుగుతాయి. ఇలా పెరిగిన డిమాండ్ ను తట్టుకోడానికి అమెరికా తన చమురు ఉత్పత్తిని అందుకు తగినట్టు పెంచుతుందని ట్రంప్ ప్రకటించాడు. కాని అమెరికాలో చమురు ఉత్పత్తి వ్యాపారం అంతా ప్రైవేటు రంగంలోనే ఉంది. చమురు ఉత్పత్తిని పెంచాలంటే ప్రైవేటు కార్పొరేట్లు అందుకు అదనంగా పెట్టుబడులు పెట్టాలి. అది అంత తేలికేమీ కాదు. ముడిచమురు, సహజ వాయువులను వెలికి తీయడం అనేది పర్యావరణ సమస్యను పెంచుతుంది. పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడానికి అమెరికా ఆమోదించిన పరిమి తులను ఉల్లంఘించడం అంత సులభసాధ్యం ఏమీ కాబోదు. దానిని దృష్టిలో ఉంచుకునే ప్రైవేటు పెట్టుబడిదారులు అదనపు పెట్టుబడులను పెట్టడానికి అంత ఉత్సాహాన్ని చూపకపోవచ్చు. అదే విధంగా బ్రిక్స్ దేశాల మీద 100 శాతం సుంకాన్ని అదనంగా విధించడం వలన ఆ దేశాలు దానికి ప్రతీకారంగా తీసుకునే చర్యలు అమెరికన్ ఎగుమతులను దెబ్బ తీసే అవకాశం ఉంది.

అయితే ప్రస్తుతానికి ఇవన్నీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు. కాని అన్ని దిగుమతులపైనా 10 శాతం సుంకం పెంపు అనే ప్రతిపాదన, చైనా దిగుమతుల మీద 60 శాతం సుంకం పెంపు



ప్రతిపాదన కార్యరూపం ధరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చర్యల పర్యవసానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ఏ విధంగా ఉండబోతున్నాయో ఇప్పుడు చూద్దాం. కాస్సేపు ఈ రెండు చర్యలకూ తక్కిన దేశాల నుండి ప్రతీకార చర్యలు ఉండవనే అనుకుందాం. బైట దేశాల దిగుమతుల మీద సుంకాలు పెరిగితే వాటి ధరలు అమెరికాలో పెరుగుతాయి. అప్పుడు వాటికి బదులు అమెరికన్ ఉత్పత్తులనే కొనుగోలు చేయడానికి అక్కడి ప్రజలు మొగ్గు చూపుతారు. దానివలన అమెరికన్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. ఆ డిమాండ్‌ను అందుకోడానికి వీలుగా అమెరికన్ కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచవలసి వుంటుంది. దాని పర్యవసానంగా అమెరికాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

అదే సమయంలో దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన వాటి ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా అమెరికన్ ప్రజల కొనుగోలుశక్తి దెబ్బ తింటుంది. అది ఉపాధి అవకాశాలు తగ్గిపోడానికి దారి తీస్తుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ట్రంప్ ప్రభుత్వం గనుక 'పొదుపు' చర్యలు చేపట్టడం కూడా జరిగితే (అంటే ప్రజా సంక్షేమం మీద ఖర్చు తగ్గిస్తే) ప్రజల కొనుగోలు శక్తి ఇంకా బాగా తగ్గుతుంది. దాని వలన ఉపాధి ఇంకా ఎక్కువగా దెబ్బ తింటుంది. అయితే, రెండోవైపు దిగుమతుల మీద సుంకాలు పెంచినందువలన దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి దాని వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయి గనుక నికరంగా అమెరికాలో అటు ఉత్పత్తి, ఇటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అనుకుందాం.

అయితే తక్కిన ప్రపంచంలో పరిణామాలు వేరేగా ఉంటాయి. అమెరికా విధించిన సుంకాల పెంపు వలన ఆ దేశాల నుండి అమెరికాకు జరిగే ఎగుమతులు తగ్గుతాయి. ఆ మేరకు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచే చర్యలు చేపట్టడం సాధ్యపడదు కనుక ఆ దేశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. నయా ఉదారవాద చట్రంలో చైనా మినహా తక్కిన దేశాలన్నీ ఉన్నాయి కనుక ఆ దేశాల ప్రభుత్వాలు తమ తమ దేశాల్లో డిమాండ్‌ను పెంచడానికి కావలసిన చర్యలను చేపట్టడం సాధ్యపడదు.

అలా డిమాండ్‌ను పెంచాలంటే ప్రభుత్వం చేసే వ్యయాన్ని పెంచాలి. అందుకు తమ దేశ ద్రవ్యలోటునైనా పెంచాలి. లేదా పెట్టుబడిదారుల మీద అదనపు పన్నులనైనా వేయాలి. కాని ఈ రెండు రకాల చర్యలనూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు. ఐనా దానిని లెక్క చేయకుండా ఏ దేశమైనా వ్యయాన్ని పెంచడానికి చర్యలు చేపడితే ఆ దేశం నుండి ద్రవ్య పెట్టుబడి క్షణాల్లో బైటకు తరలిపోతుంది. దాని ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ అస్థిరతకు లోనౌతుంది.

నిజానికి అమెరికాలో దిగుమతి సుంకాల పెంపు అనేది కూడా ఎంతో కొంత మేరకు నయా ఉదారవాద చట్రానికి భిన్నమైన చర్యగానే చెప్పవచ్చు. అటువంటి చర్యలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కొంత వరకూ సహిస్తుంది. అదే గనుక ఏ దేశమైనా పెట్టుబడుల సంచారం మీద ఆంక్షలు విధిస్తే ఏ మాత్రమూ సహించదు. అందుకే ట్రంప్ పెట్టుబడుల కదలికలను నియంత్రించే విషయంలో ఒక్కమాట కూడా అనలేదు.

చైనా పరిస్థితి పూర్తిగా భిన్నం. నిజానికి కొంతకాలంగా అమెరికన్ ప్రభుత్వాలు తమ దేశంలోకి వచ్చిపడుతున్న చైనా ఉత్పత్తుల తాకిడి నుంచి తమ దేశాన్ని కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటూనే వున్నాయి. అందుకే అమెరికాకు చైనా దిగుమతులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. అయితే దాని ప్రభావాన్ని వీలైనంత మేరకు తగ్గించడానికి చైనా తన దేశీయ మార్కెట్ ను విస్తరించుకుంటోంది. ఇలా చైనా చేయగలగడానికి కారణం చైనా ఆర్థిక వ్యవస్థ, అందులో ఎన్ని రకాల మార్పులు జరిగినా, ఇప్పటికీ ప్రధానంగా ప్రభుత్వ నియంత్రణలో నడిచే వ్యవస్థగానే కొనసాగుతోంది. అక్కడ రాజకీయ నిర్ణయాలకు లోబడి ఆర్థిక వ్యవహారాలు సాగుతాయి. ఇంకా అక్కడ ప్రభుత్వ రంగమే గణనీయమైన భాగంగా ఉంది. పెట్టుబడిదారుల చేతుల్లో లేని ఈ భాగంలో పెట్టుబడికి, వేతనాలకు సంబంధించిన నిర్ణయాలన్నీ ప్రభుత్వమే చేస్తుంది. తక్కిన ప్రపంచంలో కార్మికుల నిజ వేతనాలు దాదాపు స్తంభించిపోయివున్న ప్రస్తుత కాలంలో చైనాలో కార్మికుల నిజవేతనాలు పెరుగుతున్నాయి. ఇందుకు కారణం అక్కడ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలే. అందుచేత చైనాలోని దేశీయ మార్కెట్ విస్తరణను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలు అడ్డుకోలేవు. కాని తక్కిన పెట్టుబడిదారీ దేశాల్లో అడ్డుకోగలుగుతాయి.

ఈ కారణంగా అమెరికా విధించే అధిక సుంకాల ప్రభావం వలన చైనా మినహా తక్కిన ప్రపంచ దేశాల్లో ఆర్థిక మాంద్యం మరింత తీవ్రం అవుతుంది (నయా ఉదారవాద చట్రం నుండి బైట పడినప్పుడే ఈ పరిస్థితి నుండి బైట పడడం సాధ్యం). మూడవ ప్రపంచదేశాల్లో, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఈ తీవ్రత మరి కాస్త ఎక్కువగా ఉంటుంది. అమెరికాలో ట్రంప్ దిగుమతి సుంకాలు పెంచితే మౌన ముద్ర పాటించే బ్రెట్టన్‌వుడ్ సంస్థలు మూడవ ప్రపంచ దేశాలకు మాత్రం అటువంటి రక్షణాత్మక చర్యలు చేపట్టడద్దని,

స్వేచ్ఛా వ్యాపారం చాలా విశిష్టమైనదని జ్ఞానబోధలు చేస్తాయి. దానితోబాటు ఆ దేశాలు ద్రవ్యలోటును నియంత్రించే విషయంలో షరతులకు కచ్చితంగా లోబడి వుండేలా ఒత్తిడి చేస్తాయి. ఆ విధంగా మూడవ ప్రపంచ దేశాలన్నీ నిస్సహాయంగా అమెరికన్ ప్రభుత్వం తీసుకునే రక్షణాత్మక చర్యల దుష్ప్రభావాన్ని భరించవలసి వస్తుంది. దానితోబాటు నానాటికీ తీవ్రమయ్యే ఆర్థిక మాంద్యం ప్రభావాన్ని కూడా మోయవలసి వుంటుంది.

ఇలా ఆర్థిక మాంద్యం తీవ్రం అవుతున్నకొద్దీ, రెండో పక్క నయా ఫాసిస్టు ధోరణులు కూడా ప్రపంచవ్యాప్తంగా బలపడతాయి. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్పొరేట్లకు, నయా ఫాసిస్టు శక్తులకు నడుమ బంధం బలంగా ఏర్పడుతుంది. ఆ సంక్షోభం ముదురుతున్నకొద్దీ ఈ బంధం కూడా మరింత బలపడుతుంది. ఏవో కొన్ని మైనారిటీ సెక్షన్ల ప్రజలను శత్రువులుగా చిత్రించి సమాజ జీవిత వాస్తవాల నుండి ప్రజల దృష్టిని పక్కకు మరల్చే ప్రచారం ఉధృతమౌతుంది.

పెట్టుబడిదారీ విధానం ముందుకు సాగుతున్నకొద్దీ ప్రజలు సోషలిజం, లేదా ఆటవిక వ్యవస్థ-ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని రోజా లగ్జెంబర్గ్ చెప్పినది నేడు వాస్తవ రూపం ధరిస్తోంది. పెట్టుబడిదారీ విధానపు తాజా దశ అయిన నయా ఉదారవాద వ్యవస్థ ముందు ఇప్పుడున్న దారులన్నీ మూసుకుపోయాయి. అది ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజాన్ని ఆటవిక స్వభావం కల నయా ఫాసిజం వైపు నెడుతోంది. ఈ పరిస్థితి నుండి బైట పడడానికి సోషలిజం కోసం పోరాడడం ఒక్కటే మార్గం.

(స్వేచ్ఛానుసరణ)

> నిజానికి అమెరికాలో దిగుమతి సుంకాల పెంపు అనేది కూడా ఎంతో కొంత మేరకు నయా ఉదారవాద చట్రానికి భిన్నమైన చర్యగానే చెప్పవచ్చు. అటువంటి చర్యలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కొంత వరకూ సహిస్తుంది. అదే గనుక ఏ దేశమైనా పెట్టుబడుల సంచారం మీద ఆంక్షలు విధిస్తే ఏ మాత్రమూ సహించదు. అందుకే ట్రంప్ పెట్టుబడుల కదలికలను నియంత్రించే విషయంలో ఒక్కమాట కూడా అనలేదు. చైనా పరిస్థితి పూర్తిగా భిన్నం. నిజానికి కొంతకాలంగా అమెరికన్ ప్రభుత్వాలు తమ దేశంలోకి వచ్చిపడుతున్న చైనా ఉత్పత్తుల తాకిడి నుంచి తమ దేశాన్ని కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటూనే వున్నాయి.

> పెట్టుబడిదారీ విధానం ముందుకు సాగుతున్నకొద్దీ ప్రజలు సోషలిజం, లేదా ఆటవిక వ్యవస్థ-ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని రోజా లగ్జెంబర్గ్ చెప్పినది నేడు వాస్తవ రూపం ధరిస్తోంది. పెట్టుబడిదారీ విధానపు తాజా దశ అయిన నయా ఉదారవాద వ్యవస్థ ముందు ఇప్పుడున్న దారులన్నీ మూసుకుపోయాయి. అది ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజాన్ని ఆటవిక స్వభావం కల నయా ఫాసిజం వైపు నెడుతోంది. ఈ పరిస్థితి నుండి బైట పడడానికి సోషలిజం కోసం పోరాడడం ఒక్కటే మార్గం.

కదిలే కాల చక్రం

నేనే కదిలే కాలచక్రాన్ని
ప్రపంచాన్ని నడిపించే ఒకే ఒక ఆధారాన్ని!
డబ్బు పెట్టి కొనలేని ఖరీదైనా బంగారాన్ని!
వెల కట్టి పొందలేని మెరిసే వజ్రాన్ని!
ఎవరి కంట పడకుండా గాలిలో
నిండిపోయిన పరిమళాన్ని!
పట్టుకుందామని చూస్తే
జారిపోయే పాదరసాన్ని!
అప్పుడప్పుడు గులకరాళ్ళ మీద
నదిలా నడిచే నీటి ప్రవాహాన్ని!
మదిలో కదిలే భావాలకు ప్రతిరూపమై
నిలిచే చిత్రాన్ని!
అంచనాలకు అందని ప్రతిబంధకాన్ని!



ఆచరణకు సాధ్యం కానీ అడ్డంకులను
తొలగించే ఏకైక మార్గాన్ని!
అనుకున్న లక్ష్యం వైపు నడిపించే
ఒకే ఒక సాధనాన్ని!
ఋతువుల ఆగమనాన్ని నిర్దేశించే కాలాన్ని!
అతీతమైన శక్తులకు
అడ్డుగా నిలబడి ఆపే బలాన్ని!
ప్రకృతి నియమాలను శాసిస్తూ నడిపించే
పంచ భూతలాకు అధిపతిని!
కాలచక్రమై తిరిగే రంగుల రాట్నాన్ని!
మానవ మనుగడకు మార్గం చూపే
సమయ సూచికని!
కళ్ళ ముందు కనిపిస్తూ పలకరించే
మూడు ముళ్ళ గడియారాన్ని!
తలరాతలను మార్చే కాగితం మీదున్న
తేదీల రూపంలోని క్యాలెండర్‌ని!
నిరంతరం కాళ్ళు లేకున్నా
కొనసాగే కాలాన్ని!
దారి తప్పి నడిచే ఈ లోకానికి మార్గ
నిర్దేశం చేసి నడిపించే సమయాన్ని!!

- ఎస్.జవేరియా
9849931255

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత రెండు నాలుకలు

చర్చిలు మసీదుల కింద ఆలయాలున్నా యంటూ సరికొత్త వివాదాలు లేవనెత్తడంపై ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఎవరైనా ఎలా అర్థం చేసుకోగలుగుతారు? చర్చిలు మసీదుల కింద ఆలయాలున్నాయంటూ కొత్త వివాదాలు లేవనెత్తడం సరికాదంటూ ఆయన డిసెంబర్ 19న పూనేలో మాట్లాడారు. రామమందిరం అనేది హిందువుల విశ్వాసానికి సంబంధించిన అంశమని ఆయన అన్నారు. అయోధ్యలో హిందువుల విశ్వాసానికి సంబంధించిన అంశమైన రామమందిర నిర్మాణం మరిన్ని వివాదాలకు దారితీయరాదని చెప్పారు. "ప్రతిరోజూ ఒక కొత్త విషయం (వివాదం) రగిలించబడుతున్నది. దీన్ని ఎలా అనుమతించగలం? ఇది కొనసాగకూడదు" అని ఆయన ముగింపులో అన్నారు.

ఈ వ్యాఖ్యలపై పరిపరివిధాల వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఆలయాలను ధ్వంసం చేసి ఆ స్థానంలో మసీదులు నిర్మించడం ద్వారా చరిత్రలో జరిగిన తప్పుల పట్ల ఆరెస్సెస్ వైఖరిలో ముఖ్యమైన మార్పు వచ్చినట్టుగా కొందరు భావించారు. అలాటి వివాదాల విషయంలో ఆరెస్సెస్ అసలైన వైఖరిని కప్పిపుచ్చేందుకు మార్పు వచ్చినట్లుగా చేస్తున్న ప్రయత్నంగా మరికొందరు భావించారు.

ఆ వైఖరి నిజంగా మారిందా?

మోహన్ భగవత్ ప్రసంగాన్ని బట్టి ఆరెస్సెస్ ప్రకటిత వైఖరిలో నిజంగా తలకిందులుగా మార్పు వచ్చినట్టుగా అనుకుంటే అది అమాయకత్వమే. భగవత్ నిజంగా ఏం చెప్పారంటే అర్థం చేసుకోవడానికి ఏవైనా ఆధారాలు కావాలంటే మనం 2020లో ఆయన చేసిన ప్రసంగాన్ని గుర్తు చేసుకోవాలి. నాగపూర్‌లో సంఘ్ కార్యకర్తల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతూ ప్రతి మసీదు కిందా ఒక శివలింగాన్ని కనుగొని కొత్త వివాదం లేవనెత్తే ధోరణిని ఆయన విమర్శించారు. ఒక నిర్దిష్ట పరిస్థితుల్లో కొన్ని చారిత్రిక అవశ్యకతల వల్ల ఆరెస్సెస్ రామజన్మభూమి ఆందోళనలో చేరిందని ఆయన వివరించారు. మనం ఆ పని పూర్తి చేశాం. ఇక మరిన్ని ఆందోళనలు చేపట్టాలని మనం కోరుకోవడం లేదు' అన్నారు. అనంతరం ఆయన గ్యానవాపి మసీదు- కాశీ విశ్వనాథ ఆలయం వివాదం గురించి వివరించారు. ఇందుకు సంబంధించి అన్ని వైపుల వారూ ఒక చోట కూర్చుని పరిష్కారం వెతకాలనీ లేదంటే న్యాయవ్యవస్థ అత్యున్నతమైనది గనక కోర్టు నిర్ణయాన్ని ఆమోదించాలనీ పేర్కొన్నారు. ఇస్లాం ఆక్రమణదారులతో భారత్‌కు వచ్చి ఆలయాలను ధ్వంసం చేసిన చారిత్రక నేపథ్యంలో గ్యానవాపి మసీదు వివాదాన్ని ఆయన ముందుకు తీసుకొచ్చారు.



అయోధ్య, కాశీ, మధుర మందిరం/మసీదు వివాదాలు హిందువులకు అనుకూలంగా పరిష్కరించబడాలనేది బీజేపీ, ఆరెస్సెస్ వైఖరి. ఇదే జరిగితే మిగిలిన వివాదాలను చేపట్టనవసరం వుండదు. మోహన్ భగవత్ ప్రసంగం అంతర్యం ఏమంటే బాబరీమసీదు విధ్వంసానికి దారితీసిన ఆందోళనలో ఆరెస్సెస్ పాల్గొన్నది గనక అది విలక్షణమైనది. గ్యానవాపి మసీదు వివాదం కూడా ప్రాధాన్యత కలిగిందే గానీ దానికోసం ఆందోళన అవసరం లేదు. దాన్ని హిందువులు ముస్లిముల మధ్య పరస్పర ఆమోదంతో లేదంటే ఒక కోర్టు నిర్ణయంతో పరిష్కరించాలి. మధురలో ఈద్గా మైదాన్ కృష్ణమందిరం తగాదాకూ ఇదే వర్తిస్తుంది.

నిజంగా జరుగుతున్నదేమిటి?

మోహన్ భగవత్ ప్రస్తుత ప్రసంగం ఆనాటి ప్రసంగం పరిధిలోనే వుంది. రామమందిర ఉద్యమం దానికదే విభిన్నమైందని ఆయన చెబుతున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిపోయింది గనక మరిన్ని ఆందోళనలు వుండకూడదు. వారణాసి మధుర వివాదాలకు సంబంధించి కోర్టులో వాజ్యాలు నడుస్తున్నాయి. అవి కాకుండా ఇతర చోట్ల మసీదు/మందిరం వివాదాలు వద్దని ఆరెస్సెస్ అధినేత అంటున్నారు. అయితే భగవత్ బోధిస్తున్న దానికి వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్నదానికి మధ్య లోతైన గండి వుంది.

ప్రతి మసీదులోనూ శివలింగాన్ని వెతకాల్సిన పనిలేదని 2020లో ఆయన ప్రసంగం చేసిన తర్వాత వివిధ రాష్ట్రాలలో వివిధ మసీదుల మత స్వభావాన్ని గురించి అనేక లీగల్ వివాదాలు లేవనెత్తబడ్డాయి. దాదాపు 17 వాజ్యాలు నడుస్తున్నాయి. సంబాల్ షాహిఇమామ్ జామా మసీదు గురించీ, అజ్మీర్‌లో షరీఫ్ దర్గా గురించిన వాజ్యాలు... వాటిలో తాజాగా వేసినవే.

భగవత్ అంతర్యం ఆర్గనైజర్ సంకేతం

మతపరమైన విభజన రగిలించడం ద్వారా ఎవరూ 'హిందువుల నాయకుడు' కాలేరని మోహన్ భగవత్ అన్నారు. ఈ విధంగా చెప్పడం ద్వారా ఆయన రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడవద్దని ఆరెస్సెస్ వెలుపల వున్న చెదురుమదురు వర్గాలను హెచ్చరిస్తున్నారన్నమాట. న్యాయవ్యవస్థలో కొన్ని వర్గాలు మత ప్రదేశాల వివాదాలపై వాజ్యాలను అనుమతిస్తున్నారని భగవత్‌కు తెలుసు. ఇందుకు సంబంధించిన 1991 ప్రార్థనా స్థలాల చట్టం నిబంధనలను విరుద్ధంగా వారు ఉల్లంఘిస్తున్నారు. ఈ న్యాయప్రక్రియ ద్వారా కాశీ మధుర వివాదాలు హిందువులకు అనుకూలంగా పరిష్కారమవుతాయని ఆయన ఆశిస్తున్నారు. న్యాయప్రక్రియపై ఆయన నమ్మకం నిరాధారమేమీ కాదు. ఎందుకంటే అప్పటి ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గ్యానవాపి మసీదు సర్వేను కొనసాగించడానికి అనుమతినిచ్చారని భగవత్‌కు తెలుసు.

ఒక పథకం లేకుండా దేశమంతా మందిరం మసీదు వివాదాలు రగిలించే చిత్తానుసార చర్యలు మోహన్ భగవత్ కోరుకోవడం లేదు. అవి సంబాల్‌లో జరిగినట్టుగా హింసాకాండకు అల్లర్లకు దారితీస్తాయి. చాపకిందనీరులా పాలిస్తూ హిందూత్వ ఎజెండాను ఒక వ్యూహాత్మక రీతిలో ముందుకు తీసుకుపోయేపని ఆర్‌ఎస్‌ఎస్ మోడీ ప్రభుత్వానికి అప్పగించింది. ప్రభుత్వ వ్యవస్థల్లో అనేకం అంతకంతకూ ఎక్కువగా ఆర్‌ఎస్‌ఎస్ పట్టులోకి వస్తుండడంతో వారణాసి మధుర స్థలాలు శాంతియుతంగా చట్టబద్ధమైన పద్ధతిలో స్వాధీనం చేసుకోవడం సాధ్యమయ్యేట్టు కనిపిస్తుంది. సరైన పథకం లేని అరాచక చర్యలు ప్రతికూలంగా పరిణమిస్తాయి. ఇక్కడ భగవత్ మౌలిక హిందూత్వ ఎజెండా దెబ్బతినకుండా కార్యాచరణ పథకం రూపొందిస్తున్నారు. ప్రస్తుతానికి మొదట అనుకున్న మూడింటికే కట్టుబడి వుండింది. హిందూత్వ రాజ్యం కుదుటపడిన తర్వాత మిగిలిన 'చారిత్రక తప్పులు' సరిదిద్దవచ్చు. 'నాగరిక న్యాయం కోసం సమరం' వదలిపెట్టడం లేదని ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' తాజా సంచిక చూస్తే అర్థమవుతుంది. సంబాల్ గుడిని పున:స్వాధీనం చేసుకోవడమే ముఖచిత్రంగా ప్రచురించింది. పచ్చి రెండునాల్కల ధోరణి/ద్వంద్వనీతి ఇదే.

సుప్రీం కోర్టుకే సాధ్యం

ఈ కారణంగానే 1991 ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీం కోర్టుముందున్న కేసు కీలకంగా మారుతుంది. అలాటి వివాదాలపై అన్ని దిగువ కోర్టుల ముందున్న చట్టపరమైన తగాదాలపై కోర్టు స్టే విధించింది. ఈ రిట్ పిటిషన్లపై నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆ పని చేయకుండా దాటవేస్తున్నది. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనే దాన్నిబట్టి ఈ విషయంలో బిజెపి -ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహం అర్థం చేసుకునే ఆధారం దొరుకుతుంది. ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సమర్థించడమే గాక గట్టిగా అమలులో పెట్టడం ద్వారా సుప్రీం కోర్టు మాత్రమే దీన్ని మొగ్గలోనే తుంచి వేయగలుగుతుంది.

(డిసెంబర్ 25వ తేదీ సంపాదకీయం)

> భగవత్ మౌలిక హిందూత్వ ఎజెండా దెబ్బతినకుండా కార్యాచరణ పథకం రూపొందిస్తున్నారు. ప్రస్తుతానికి మొదట అనుకున్న మూడింటికే కట్టుబడి వుండింది. హిందూత్వ రాజ్యం కుదుటపడిన తర్వాత మిగిలిన 'చారిత్రక తప్పులు' సరిదిద్దవచ్చు. 'నాగరిక న్యాయం కోసం సమరం' వదలిపెట్టడం లేదని ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' తాజా సంచిక చూస్తే అర్థమవుతుంది. సంబాల్ గుడిని పున:స్వాధీనం చేసుకోవడమే ముఖచిత్రంగా ప్రచురించింది. పచ్చి రెండునాల్కల ధోరణి/ద్వంద్వనీతి ఇదే.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com



అమిత్ షా రాజ్యాంగ ద్రోహి

- పదవి నుంచి వెంటనే తప్పుకోవాలి
- వామపక్షనేతల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ- ఖమ్మం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను పార్లమెంట్లో కించపరిచే విధంగా మాట్లాడిన అమిత్ షా రాజ్యాంగ ద్రోహి అని వామపక్షనేతలు ఆరోపించారు. ఆయనకు పదవిలో కొనసాగే కనీస అర్హత లేదని, పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం), సీపీఐ, మాస్ లైన్, ఎన్డీ ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ కార్యాలయం నుండి ప్రదర్శనగా వెళ్లి బైపాస్ రోడ్‌లో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వామపక్షాల నేతలు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సబ్బండ వర్గాల అందరికీ హక్కులు, సంక్షేమ అర్హతులు కల్పించారని వారు తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చిన అమిత్‌షా రాజ్యాంగ నిర్మాతనే కించపరిచారని, ఎంపిగా, మంత్రిగా ఆయన కొనసాగే నైతిక హక్కులేదన్నారు. బీజేపీ ఈ దేశానికి ప్రమాదకరంగా మారిందని, భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి పాలన చేయాలనే ప్రయత్నంలోనే బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని కించపరుస్తున్నారని వారు తెలిపారు. మతోన్మాదం రెచ్చకొట్టడం ద్వారా రాజకీయ లబ్దిపొందుతున్న బీజేపీ లౌకిక వాదానికి తూట్లు పొడుస్తుందన్నారు. అమిత్‌షా రాజీనామా చేయకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, సీపీఐ(ఎం) నాయకులు మాదినేని రమేష్, యర్రా శ్రీను, నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మాస్ లైన్ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆవుల అశోక్, ఎన్డీ నాయకులు రాజేంద్రప్రసాద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గసభ్యులు శింగుసర్సింహారావు, పోటు కళాపతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, నాయకులు పగిడిపల్లి ఏసు, యడ్లపల్లి శంకరయ్య, ఎంఎల్ నాయకులు, సివై.పుల్లయ్య, ఝాన్సీ, శిరోమణి పాల్గొన్నారు.



కోర్టులో ఉన్నా దురాక్రమణ యత్నాలు

- జాతీయ రహదారుల పీడీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితుల వినతి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

హైకోర్టులో స్టే ఆర్డర్ ఉన్నా గ్రీన్‌ఫీల్డ్ హైవే-163జీ అధికారులు తమ భూములపై దురాక్రమణకు పాల్పడుతున్నారని నిర్వాసిత రైతులు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్-2 రామాంజనేయరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాగపూర్ నుంచి అమరావతి వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి -163జీ కోసం ఖమ్మంరూరల్ మండలం తీర్థాల నుంచి రఘునాథపాలెం, చింతకాని మండలం వందనం వరకు 130 మంది భూ నిర్వాసితులు, ప్లాట్ ఓనర్స్ అలైన్‌మెంట్ మార్చాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. మొత్తం 130 మంది రైతులు 8 పిల్స్ హైకోర్టులో వేయగా కోర్టు స్టే ఆర్డర్స్ ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు నిర్వాసితులకు ఫోన్లు చేయటం, వ్యక్తిగతంగా కలిసి పరిహారం తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు చెప్పకుండా భూముల్లో హద్దురాళ్లు పాతుతున్నారని తెలిపారు. కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండగా ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడినా కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కింద కేసులు పెడతామని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతకుముందు మంచికంటి మీటింగ్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు ఉన్నారు. అనంతరం వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి సంగబత్తుల నవీన్‌రెడ్డి, రైతు జేఏసీ ప్రతినిధులు తక్కెళ్లపాటి భద్రయ్య, నాగండ్ల శ్రీధర్, బోజెడ్ల వెంకటయ్య, వేములపల్లి సుధీర్, నల్లమోతు శ్రీనివాస్, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, బత్తినేని నాగప్రసాద్, రమణారెడ్డి, శ్రీధర్, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు మృతి

నవతెలంగాణ-నేలకొండపల్లి




మండలంలోని మోటాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతి పరురాలు ఇంటూరి ధనమ్మ(85) సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నారు. మరణం వార్త తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డిలు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళ్లర్పించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు ఏలూరు రంగారావు, మండల నాయకులు బెల్లం లక్ష్మీ, ఇంటూరి అశోక్, శాఖ కార్యదర్శి ఏలూరి రామారావు, తాళ్లూరి శ్రీనివాసరావు, మందుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చి తోటలలో రసం పీల్చు పురుగులు గుర్తింపు

ఏడిఏ విజయచంద్ర

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మిర్చి తోటలలో రసం పీల్చు పురుగులతో పాటు పొగాకు లద్దె పురుగులను గుర్తించడం జరిగిందని, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి రైతులకు మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర పలు సూచనలు, సలహాలను అందించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని గట్లగౌరవరం గ్రామంలో గల మిర్చి పంటలను క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా విజయచంద్ర పురుగుల నివారణ గురించి రైతులతో మాట్లాడుతూ ఇమిడాక్లోప్రిడ్ 0.3-0.4 ఎం ఎల్ ఏసిపెట్ 1.5 గ్రాముల మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వలన రసం పీల్చు పురుగులను నివారించవచ్చునని తెలిపారు. పసుప్పు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 20 నుండి 25 వరకు పెట్టుకున్నట్లయితే రసం పీల్చు పురుగును నివా రించుకోవచ్చుఅని రైతులకు సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు పైరును గమనించుకొని సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే వీటి నుంచి బయటపడే అవకాశం ఉంటుందని రైతులకు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలను తీసుకొని పంటలను రక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి వంశీ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎస్ఐ సాయికుమార్

నవతెలంగాణ- కామేపల్లి



నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కామేపల్లి ఎస్సై సాయి కుమార్ కోరారు. ర్యాష్ బైక్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించడం, రాకపోకలకు అంతరాయం కలిగించడం, డీజే స్పీకర్లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టడం, రోడ్లపై మద్యం సేవిస్తూ తిరగడం, మాదక ద్రవ్యాలు (డ్రగ్స్), గంజాయి సేవించడం వంటి అసాంఘిక పనులకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కామేపల్లి మండల ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్



సీపీఐ(ఎం)త్రీ టౌన్‌లోని 34 డివిజన్ శాఖ సమావేశం కుప్పల సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ త్రీ టౌన్ నాయకులు మద్ది సత్యం మాట్లాడుతూ ఖమ్మం నగరంలో అన్ని డివిజన్లో కిరాయి ఇళ్లల్లో పేదలు నివసిస్తున్నారని, గత ప్రభుత్వం లాటరీ పేరుతో డ్రా పేరుతో చాలామందికి ఇవ్వలేదని, ఈ ప్రభుత్వమైన ప్రజా పాలన దరఖాస్తుదారులందరికీ కిరాయి ఇళ్లలో ఉండే వారందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అలాగే వృద్ధులకు హామీ ఇచ్చిన ప్రకారం నాలుగు వేల పింఛన్ పెంచాలని, స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో నాయకులు గొబ్బెటి పుల్లయ్య, జుట్టు బోయిన కాశయ్య, లక్ష్మీనారాయణ, వేల్పుల నాగేశ్వరరావు, వేల్పుల మధు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-మధిర



పేదలందరికీ పథకాలు అందించాలని, కొద్దిమందికి పథకాలు అందించి అందరికీ అందించినట్లు ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. పార్టీ పార్టీ మధిర డివిజన్ కమిటీ సమావేశం మధిర బోడేపూడి భవన్ నందు దొండపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లెక్కకు మించి హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులందరికీ రుణమాఫీ అంటూ సగానికి పైగా రైతుల రుణమాఫీ మరిచిపోయిందని, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇల్లు ప్రజలకు తీరని కలలాగా మిగిలిపోతున్నాయన్నారు. భూమిలేని పేదలకు 12 వేల రూపాయల ఆర్థిక సహాయం, కార్మికుల కనీస వేతనం అమలు, నిరుద్యోగ భృతి మాటల్లో చెప్పి ప్రజలను ఊరించడం తప్ప ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. విలేకరులను ఎన్నికల ముందు ప్రసన్నం చేసుకోవడం కోసం ఇల్లు ఇస్తామని, ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, హెల్త్ కార్డులని వాగ్దానాలు చేసి వాటిని మరవటం దురదృష్టకరమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసేందుకు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని అన్నారు. గ్రామాలలో కొంతమంది పథకాల అందిస్తామంటూ పార్టీలోకి రావాలంటూ ప్రజలను ఒత్తిడి చేయడం, మరి కొంతమంది డబ్బులు వసూలు చేయడం అధికార పార్టీ నాయకుల పేర్లతో అధికారులు బెదిరించడం సహజంగా జరిగిపోతున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అని, దీనిపై అధికార పార్టీ స్పందించి కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడపల్లి గోపాలరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. యువకులు, మహిళల సమస్యలపై దృష్టి సారించి మరిన్ని ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ డివిజన్ కమిటీకి పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, దివ్వెల వీరయ్య, మందా సైదులు, బట్టు పురుషోత్తం, పయ్యావుల ప్రభావతి, పార్టీ మండల కార్యదర్శులు కిలారి సురేష్, రాచబంటి రాము, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్, పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమగ్ర భూ సర్వే చేపట్టాలి

భూ భారతితో భూ సమస్యలు మొత్తం పరిష్కారం కావు

రైతు భరోసా అమలులో జాప్యం తగదు

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి-2024 కేసిఆర్ ప్రభుత్వం రూపొందించిన ధరణి-2020 కంటే మెరుగైన ఆర్వోఆర్‌గా ఉండవచ్చు కానీ భూ సమస్యలు మొత్తం పరిష్కారం చేయలేదని, సమగ్ర భూ సర్వే మాత్రమే భూ సమస్యలకు సమగ్ర పరిష్కారమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో భూములు సమగ్ర సర్వే నిజాం కాలంలో జరిగిందని అప్పటి నుంచి భూములు అనేక మంది చేతులు మారి పట్టా ఒకరు పేరుతో ఉండి సాగులో మరొకరు ఉన్న పరిస్థితుల్లో సమగ్ర సర్వే చేసి అనుభవం ఆధారంగా హద్దులు నిర్ణయించి ప్రతి కమతానికీ భూధార్ నెంబర్ ఇచ్చి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని కోరారు. కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ ఆహ్వానించే పరిణామం అన్నారు. అనుభవదారు కాలంతోపాటు కౌలు రైతుల గుర్తింపు కూడా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది అన్నారు. రైతు భరోసా విధివిధానాలు రూపకల్పన పేరుతో మంత్రి వర్గ ఉపసంఘం సమావేశాలు పేరుతో కాలయాపన చేయకుండా రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. శాటిలైట్ చాయాచిత్రాలు ఆధారంగా రైతు భరోసా ఇవ్వడానికి వానాకాలం పంట, రబీ సీజన్లో పంట ఎలా పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. స్థానిక వ్యవసాయ అధికారులు సాగు సర్వే ప్రకారం రైతు భరోసా రెండు సీజన్‌లో తక్షణమే విడుదల చేసి రైతుల బ్యాంకు ఎకౌంటుకు జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, దుగ్గి కృష్ణ, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, రచ్చా నరసింహారావు, బిక్కసాని గంగాధర్ పాల్గొన్నారు

మండల స్థాయిలో సాంఘిక శాస్త్ర ప్రతిభ పాటవ పరీక్షలు

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పాటవ పరీక్షలు బోనకల్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షలలో ఇంగ్లీష్ మీడియం నుండి మొదటి బహుమతి డి.విమల జడ్పీహెచ్ఎస్ ముష్టికుంట, ద్వితీయ బహుమతి జి.మనస్విని జడ్పిహెచ్ఎస్ బోనకల్, తృతీయ బహుమతి సిహెచ్ మహిత జడ్పీహెచ్ఎస్ గోవిందపురం ఎల్ సాధించారు. అదే విధంగా తెలుగు మీడియం నందు మొదటి బహుమతి కే.వంశీ జడ్పిహెచ్ఎస్ మోటమర్రి, రెండవ బహుమతి కె.వెంకట శివతేజ జడ్పీహెచ్ఎస్ చిరునోముల, తృతీయ బహుమతి ఎస్ ఝాన్సీ జడ్పిహెచ్ఎస్ గోవిందపురం ఎల్ విజేతలుగా నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో డి.మేఘన సెయింట్ మేరీ స్కూల్ మొదటి బహుమతిని, ఎం సుస్మిత షైన్ హై స్కూల్ ద్వితీయ బహుమతిని, కే జోషిత షైన్ హై స్కూల్ తతీయ బహుమతిని సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య జడ్పీహెచ్ఎస్ బోనకల్ ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్ అభినందించారు. అదేవిధంగా విజయతలకు బహుమతులను వారు అందజేశారు.

ఇండోఖతర్ వెంచర్‌లో వివాదం

- ఆందోళనలో వినియోగదారులు

నవతెలంగాణ-కొణిజర్ల



కొణిజర్ల సమీపంలోని ఇండోఖాతర్ వెంచర్‌లో కొన్ని రోజులుగా భాగస్వాములు, డెవలపర్సు మధ్య వివాదం కొనసాగుతోంది. పది సంవత్సరాల క్రితం కొణిజర్ల సమీపంలో గ్రీన్ ల్యాండ్ పేరుతో వెంచర్ వేసి దానిలోని కొంతభాగాన్ని ఇండోఖాతర్‌కి డౌలప్ కోసం ఇచ్చారు. అప్పటి నుంచి నేటి వరకు రెండు వర్గాల మధ్య భూవివాదం కొనసాగుతుండటంతో సోషల్ మీడియా, పత్రికల ద్వారా తెలుసుకుంటున్న స్థలాలు కొన్న వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇరక్కపోయి ఇక్కడ స్థలాలు కొన్నామనీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కొన్ని రోజులు రెవెన్యూ సమస్యలతో మరికొన్ని రోజులు వాటాదారుల వివాదంతో స్థలాలు కొనుగోలు చేసిన వినియోగదారులు తీవ్రంగా నష్టపోయారు. తాము కొన్న ధరకు కూడా నేడు అమ్ముడుపోయే పరిస్థితి లేకపోవడంతో పాటు కనీస వసతులు కల్పించకపోవడం పైగా భూవివాదాలు నేపథ్యంలో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. గత రెండు రోజుల నుంచి గ్రీన్ ల్యాండ్, ఇండోఖాతర్ భాగస్వాముల మధ్య వివాదం చోటుచేసుకుంది. కార్యాలయ స్థలం తమదంటూ కార్యలయానికి తాళం వేయగా మరోవర్గం తాళాన్ని పగలగొట్టి లోపలికి వెళ్లారు. ఈ వెంచర్ వద్ద రెండు వర్గాలకు చెందిన కొంతమంది వ్యక్తులు ఒకరిపై ఒకరూ దాడులు చేసుకోవడానికి సిద్ధంగా ఉండటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనే ఆవకాశం ఉందని ఎస్ఐ సూరజ్ తన సిబ్బందితో వెంచర్ కార్యాలయం వద్దకు చేరుకొని సదరు వ్యక్తులను పంపించారు.

రియల్‌కు రాజకీయరంగు..

గ్రీన్ ల్యాండ్, ఇండోఖాతర్ మధ్య నడుస్తున్న రియల్ వివాదానికి రాజకీయ రంగు పులుముకుంది. దీంతో అధికార పార్టీకి చెందిన రెండు వర్గాలు చెరొక వైపు ఉంటూ కయ్యానికి కాలుదువ్వుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వెంచర్‌లకు చెందిన భాగస్వాములు కూడా అధికార పార్టీ నాయకులతో మంతనాలు జరుపుతూ తమకు అండగా ఉండాలని వారిని తెరపైకి తెస్తున్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికీ వారే పైచేయి సాధించేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఈనేపథ్యంలో ఇరువర్గాలతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.చర్చలు ఫలిస్తాయా లేక ఇదే విధంగా వివాదాలు జరుగుతుంటాయా..? వెంచర్‌లో స్థలాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు భరోసా కల్పిస్తారా లేదా అనేది వేచిచూడాలి...

ఇరువర్గాలు ఫిర్యాదు...

గ్రీన్‌ల్యాండ్, ఇండోఖతర్‌లకు చెందిన ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ళపై ప్రమాదకరంగా ఉన్న కరెంటు లైన్ తొలగించాలి

- స్మశాన వాటిక స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలి
- సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్

నవతెలంగాణ- ఖమ్మం



ఇళ్ళపై ప్రమాదకరంగా ఉన్న కరెంటు లైన్ తొలగించాలని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని ఖానాపురం హవేలీ నాలుగో డివిజన్ మంచికంటినగర్ ఏరియాలో ఇళ్లపై ఉన్న ఎల్టి లైన్ కరెంటు తీగలను తక్షణమే తొలగించాలని పార్టీ హవేలీ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డిఇ రామారావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వై.విక్రమ్, ఖానాపురం మండల కార్యదర్శి దొంగలు తిరుపతిరావు మాట్లాడుతూ మంచికంటి నగర్ ప్రాంతంలో సుమారు 40 ఇళ్ళపై అతి తక్కువ ఎత్తులో కరెంటు తీగలు ఉండటం వల్ల అక్కడి ప్రజలు నిత్యం బిక్కుబిక్కుమంటు జీవిస్తున్నారని అన్నారు .వర్షం వస్తే చెట్ల కొమ్మలు తగిలి కరెంటు తీగలు చిటచిట మంటూ మంటలు వచ్చి వైర్లు కాలిపోవడం ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులకు గురికావడం, ఇళ్లలో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు కాలిపోవడం జరుగుతుందన్నారు. దీనివల్ల ప్రజలు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఎల్టి లైన్ తొలగించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

స్మశాన వాటిక స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలి

ఖానాపురం హవేలీ ఏడో డివిజన్ టేకులపల్లి బ్రిడ్జి వద్ద బైపాస్ రోడ్డు పక్కన ఉన్న స్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్య తీసుకుని ఆ స్థలాన్ని రక్షించాలని సీపీఐ(ఎం) హవేలీ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ తాసిల్దార్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం, హవేలీ మండల కార్యదర్శి దొంగలు తిరుపతిరావు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా టేకులపల్లి, లక్ష్మీ నగర్, ఇందిరానగర్ ప్రాంత వాసులకు సౌకర్యవంతంగా ఉన్న స్మశాన వాటిక స్థలాన్ని ఒక రౌడీషీటర్ కొంతమంది గుండాల ప్రోద్బలంతో ఆక్రమించి ఫెన్సింగ్ వేసుకొని తన అవసరాలకు వాడుకుంటున్నాడని, అక్కడ ప్రజలు ఈ విషయంపై అతనిని నిలదీస్తే తప్పుడు డాక్యుమెంట్స్ చూపించి ఇది "నా స్థలం మీరు అడ్డు వస్తే మర్యాదగా ఉండదు" అంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కబ్జాకు గురైన స్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేసి పటిష్టంగా ఫెన్సింగ్ వేసి అక్కడ స్మశాన వాటికలో అవసరమైనటువంటి సకల సౌకర్యాలు కల్పించాలని, ఈ స్మశాన వాటికను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎర్నింటి రమ్య, సీనియర్ నాయకులు ధనియాకుల నాగేశ్వరరావు, కత్తుల అమరావతి, గాలి వెంకటాద్రి, పోతురాజు వెంకటి, గాలి అంజయ్య, బోడెపుడి వీరభద్రం, పిన్నింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి పోరాటాల వేగు చుక్క ఎస్ఎఫ్ఐ

- ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వై.విక్రమ్
- అలుపెరగని త్యాగాల బాటలో నడిచిన ఎస్ఎఫ్ఐ
- జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్

నవతెలంగాణ- ఖమ్మం



విద్యార్థి పోరాటాల వేగు చుక్క ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వై.విక్రమ్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని ఎస్ఎఫ్ఐ ఖమ్మం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఆర్అండ్‌బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్స్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకులు రాజు అధ్యక్షతన జరిగింది. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు ఈ సమావేశంలో వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ 1970 డిసెంబర్ 30వ తేదీన కేరళ రాష్ట్రం త్రివేండ్రం ప్రాంతంలో 'అధ్యయనం- పోరాటం' అను నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే లక్ష్యాలతో మొదటగా 11 మంది సభ్యులతో ఏర్పడి 55 సంవత్సరాలు గడుస్తుందని, అప్పటి నుండి విద్యార్థుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఈ పోరాటంలో చాలా మంది విద్యార్థి నాయకులని కోల్పోయినప్పటికీ, నిర్బంధాలు ఎదుర్కొంటూ, ప్రభుత్వాలు దాడులు చేస్తున్నప్పటికీ, నాయకుల మీద కేసులు పెడుతున్నప్పటికి , మతోన్మాద దాడులను తిప్పి కొడుతూ, శాస్త్రీయ విద్యావిధానం కోసం అనునిత్యం పోరాడుతూ ఎక్కడ కూడా వెనక్కి తగ్గకుండా నిత్యం విద్యార్థుల పక్షాన ఉంటూ అనేక రూపాల్లో భవిష్యత్తులో విద్యారంగం కోసం పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ సమరశీల పోరాటాలను కొనసాగిస్తూ ఈ భారత దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. నాటి నుండి నేటివరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఈ భారత దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు సాగుతున్న ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయినప్పటికీ కూడా ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని, విద్యారంగ సమస్యలను బాగుచేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సదానందం, జిల్లా నాయకులు వినోద్, మనోజ్, రమ్య, సుశీల, రాగిణి, పూజిత, అలేఖ్య, త్రినాథ్, సంగీత్, అంజలి, భవాని, సింధు, శ్రావ్య, శరణ్య, హారిక తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలి

జాయింట్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ కూలీలకు చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12వేల రూపాయలు అందజేస్తామని చేసిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని, విధివిధానాలు రూపొందించాలని, వ్యవసాయ కార్మికులందరికీ షరతులు లేకుండా ఒకేసారి మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘాల అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జాయింట్ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం ఎంఎల్ జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఈనెల 28వ తేదీ నుండి వ్యవసాయ కూలీలకు మొదటి దఫాగా 6వేలు చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని, కానీ విధివిధానాలు జిల్లా అధికారులకు రాలేదని అధికారులు తెలియజేశారన్నారు. వెంటనే వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన 12వేల రూపాయల్ని మంజూరు చేయాలని వారు ప్రభుత్వానికి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, పడిగల నాగేశ్వరరావు, బోడబట్ల సుదర్శన్, ఎస్‌కే ఇమామ్, వీరభద్రం ఉన్నారు.

గోపాలమిత్ర పశు వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన గోపాలమిత్ర ఉచిత పశువైద్య శిబిరాన్ని సోమవారం మండల పశువైద్యాధికారి కె.మమత ప్రారంభించారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు సంబంధించి 38 పశువులకు చికిత్స చేసినట్లు, 56 దూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత మాట్లాడుతూ చలికాలం ప్రారంభమైందున గేదెలు ఎక్కువగా ఎదకు వస్తాయని, పశువులు ఎదకు వచ్చినప్పుడు అరవడం, బెదురుగా చూడడం, చిరు మూత్రం పోయడం, పలుచని తీగలు మేయడం లాంటివి చేస్తాయని, పాడిరైతులు సకాలంలో ఎదను గుర్తించి సమీప పశు వైద్యశాలలో గాని గోపాల మిత్రులచే గాని కుత్రిమగర్భధారణ చేయించాలని, తద్వారా మేలుజాతి పశు సంతతిని పొందవచ్చునని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలోని వీఎల్‌ఓ శ్రీనివాసరావు, గోపాలమిత్ర సూపర్వైజర్ తుమ్మల వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, ఖమ్మంపాటి అప్పారావు కృష్ణ ప్రసాద్, బి. వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, గ్రామంలో ఉన్న రైతులు పాల్గొన్నారు.

లబ్ధారులకు నగదు భీమా అందజేత

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఇటీవల కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబ సభ్యులకు సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ దివ్య భీమా నగదును సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎరుపాలెం మండల పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన షేక్ చిన్న మహబూబ్ సుభాని మృతి చెందారు. అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సంఘ సభ్యులుగా కొనసాగు తుండటంతో మృతుడు షేక్ చిన్న మహబూబ్ సుభాని భార్య ఆయేషాకు 50 వేల రూపాయల భీమా నగదును ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంక్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, జానీ, మౌనిక, సంఘ సీఈవో మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణారెడ్డి, బ్యాంక్ సిబ్బంది, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో మోటమర్రి విద్యార్థికి ప్రథమ స్థానం

నవతెలంగాణ-బోనకల్



బోనకల్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సోషల్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మోటమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థి కుంచం వంశీకృష్ణ తెలుగు మీడియంలో మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించాడు. వంశీకృష్ణకు బోనకల్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్నవ లోవేల్‌కుమార్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ నంద్రు సునీత, పాఠశాల ఉపాధ్యాయులు నారాయణ, మెరుగు మంజుల, కొమ్ము శ్రీనివాసరావు, గుత్తా శ్రీనివాసరావు, వీరయ్య, బంగారయ్య, మాజీ సర్పంచ్ కేతినేని ఇందు, విద్యార్థులు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-వైరా



ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులతో పాటుగా విద్యార్థులను వివిధ రంగాల్లో తీర్చిదిద్దే విధంగా విశిష్ట ఫౌండేషన్ సహకరిస్తుందని ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం లీలా లాస్య, రామ్, వేద, సాత్విక అన్నారు. సోమవారం మండలంలోని గరికపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏక రూపదుస్తులను ఫౌండేషన్ అందజేసింది. 20 వేల రూపాయలు విలువచేసే ఏకరూప దుస్తుల పంపిణీ చేసే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు దొంతిబోయిన సత్యనారాయణ, ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్రరావు అభ్యర్థన మేరకు విద్యార్థులకు అవసరమైన వసతులు అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని ఇప్పటికే ఎనీమియాతో బాధపడుతున్న వారికి నెలవారి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు, వారికోసం బ్లడ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పాఠశాలల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న విశిష్ట ఫౌండేషన్ వారిని మండలంలో వివిధ పాఠశాల అభ్యున్నత కోసం కృషి చేస్తున్న పెనుగొండ ఉపేంద్ర రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మండల ప్రధాన కార్యదర్శి కొల్లా రాంబాబు, లయన్ కట్ల సురేష్, కృష్ణా అర్జునరావు, కొండలరావు, రమేష్, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మధిర



ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో టివిఎం ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ స్టేట్ సోషల్ సైన్స్ టీచర్స్ ఫోరం మండల్ లెవల్‌లో సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో అత్యధిక మార్కులు సాధించి(54/60) మండల ద్వితీయ స్థానంలో నిలిచిన సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి కె.హరిదీప్‌ను పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఆన్ బేబీ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు ప్రిపేర్ చేయించిన సోషల్ టీచర్ తంబిరాజును అభినందించారు.

20లోగా పెండింగ్ ఉపకార వేతన దరఖాస్తు ఫారాలు అందించాలి

- **జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి**

ఖమ్మం : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోనీ ప్రభుత్వ, ప్రైవేటు, యూనివర్సిటీ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలు 2017-18 నుండి 2023-24 సంవత్సరాల వరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను జనవరి 20లోగా అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో రెండవ అంతస్తులో ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను అందజేయాలని, ట్యూషన్ ఫీజులకు సంబంధించి చాలా అప్లికేషన్లు నో-ఫీజు అని ఈ-పాస్ వెబ్ సైట్లో చూపించడం జరుగుచున్నదనీ, కళాశాలల యాజమాన్యం వారు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో, పియంయు సెంటర్‌లో సంప్రదించి ఫీ-స్ట్రక్చర్‌ను ఈ-పాస్ వెబ్ సైట్లో అప్డేట్ చేయించుకోవాలని, ఫీజు స్ట్రక్చర్‌ను అప్డేట్ చేయని కళాశాలలకు ట్యూషన్ ఫీజు రాకపోతే సంబంధిత కళాశాలల యాజమాన్యం వారు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అలాంటి వారిపై శాఖాపరమైన చర్యల కోసం పైఅధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు.

క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణకు 6లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మం : ఇంటర్మీడియట్ ఎంఎల్‌టి ఒకేషనల్ కోర్సులలో మార్చి 2020 సంవత్సరం నుండి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆసుపత్రిలలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు ఒక వేయి రూపాయలు డిడి రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకొని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జనవరి 6లోగా అందజేయాలని పేర్కొన్నారు.

కోడూరి వెంకటాచారికి సీపీఐ(ఎం) నాయకుల పరామర్శ

నవతెలంగాణ-నేలకొండపల్లి



పట్టణానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కోడూరు వెంకటాచారిని పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, డివిజన్, మండల నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, డేగల వెంకటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. గత కొద్ది రోజుల క్రితం వెంకటాచారి ప్రమాదవశాత్తు క్రిందపడి కాలు ఫ్రాక్చర్ కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. సోమవారం ఇంటికి వచ్చిన వెంకటాచారిని పార్టీ నాయకులు స్వయంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వెంకటాచారి తొందరగా కోలుకొని పార్టీకి అవసరమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి పరుగులు



- ఎకో పార్కులా వెలుగుమట్ల ఉద్యానవనం
- మున్నేరు వరదల నుంచి విముక్తికి రూ.700 కోట్లతో ఆర్సీసీ వాల్
- రూ. 220 కోట్లతో ఫ్లడ్ వాటర్ మళ్లింపునకు డ్రెయినేజీ
- వైద్య విద్యారంగంలోనే మోడల్ గా మెడికల్ కాలేజీ
- నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చిరకాల వాంఛ
- వ్యవసాయ, సహకార, జౌళి, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ఖమ్మం

ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడమే తన ధ్యేయమని వ్యవసాయ, సహకార, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం తన చిరకాల వాంఛగా తెలిపారు. నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఖమ్మంలోని పుట్టకోట రోడ్డు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మున్నేరు వరదల నుంచి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజలకు విముక్తి కల్పించేందుకు రూ. 700 కోట్లతో నదికి ఇరువైపులా ఆర్ సీసీ వాల్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దీనికి అనుసంధానంగా రూ. 220 కోట్లతో ఫ్లడ్ వాటర్ మళ్లింపు కోసం డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. లకారం ట్యాంక్ బండ్ వద్ద శిల్పారామం ఏర్పాటుకు ప్రతిపాదన రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం నగర వాసులకు పర్యాటక ఆహ్లాదం కోసం వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఐదు వందల ఎకరాల్లో ఉన్న వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను ఏకో పార్క్ లా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. చారిత్రక వారసత్వంకు ప్రతీకగా నిలిచిన ఖమ్మం ఖిల్లా పై రోప్ వే ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్య విద్య రంగంలో మోడల్ కళాశాలగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్మిస్తామని అన్నారు. రఘునాథపాలెం దశాబ్దాల సాగు నీటి కలను సాకారం చేస్తూ సాగర్ కెనాల్ పై లిఫ్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. సంక్రాంతి రోజున మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కు శంకుస్థాపన చైన్ ఉన్నట్లు తెలిపారు. ఖమ్మం నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ తన పదవి కాలంలోనే చేయాలనేది చిరకాలం వాంఛగా ప్రకటించారు. ప్రకాశ్ నగర్ మున్నేరు హై లెవల్ బ్రిడ్జి మరమ్మతు పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. నిజాం కాలం నాటి కాల్వ ఒడ్డు బ్రిడ్జి వద్ద తీగల వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం నగరానికి కేబుల్ బ్రిడ్జి ఐకానిక్ గా మారుతుందన్నారు. ఖమ్మం నగరం చుట్టూ నేషనల్ హైవే లతో రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. హైదరాబాద్ ఓ.ఆర్.ఆర్ మాదిరి ఖమ్మం కు రింగ్ రోడ్ ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. తద్వారా ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఖమ్మం అభివృద్ధి చెందుతుందన్నారు. తన మరో చిరకాల కోరిక గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్య శ్యామలం చేయడమని తెలిపారు. వచ్చే ఆగస్ట్ 15 నాటికి యాతాల కుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి- అశ్వారావు పేటకు సాగునీరు అందిస్తామన్నారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు వరకు గోదావరి నీళ్ళు తరలించవచ్చు అని తెలిపారు. సీతమ్మ సాగర్ పూర్తయితే పోలవరం టూ సీతమ్మ సాగర్, అక్కడ నుంచి సమ్మక్క సాగర్ ... తిరిగి మేడిగడ్డ అన్నారం సుందిళ్ళ బ్యారేజ్ వరకు నౌకాయానం ప్రతిపాదన ఉందన్నారు. దక్షిణ అయోధ్య గా బాసిల్లుతున్న భద్రాద్రి కి రైల్వే లైన్ ఏర్పాటుతో భక్తులు, పర్యాటకులకు ఎంతో సౌకర్యం కలుగుతుందన్నారు. కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొత్తగూడెం లో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు పై నిపుణులు నివేదిక తయారు చేస్తున్నారని తెలిపారు. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆశీస్సులు, ప్రజాదీవెనలతో తనకు సేవ చేసే భాగ్యం దక్కిందని పునరుద్ఘాటించారు. తెలంగాణ రైతాంగానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కమర్తపు మురళి, వీవీ పాలెం సహకార సంఘం చైర్మన్ రావూరి సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

- **సీఐ ఎండి.ఉస్మాన్ షరీఫ్**

నవతెలంగాణ-రఘునాథపాలెం



మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలు, యువత డిశంబర్ 31 వేడుకలు శాంతి యుత వాతావరణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని సిఐ ఎండి.ఉస్మాన్ షరీఫ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 31వ తేది రాత్రి 10 గంటల నుండి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, వెల్లడించారు. ఒకవేళ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్ 31 వేడుకలు నిర్వహించుకునే ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉంటూ పోలీసు వారి సూచనలు పాటించాలని కోరారు. వేడుకలు నిర్వహించుకునే వారు ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రమాదాలకు దూరంగా ఉంటూ నిర్వహించుకోవాలని అన్నారు. మద్యం దుకాణాలు, వైన్ షాప్స్ ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలన్నారు.

నిబంధనలు ఉల్లఘిస్తే చర్యలు

- **ఇన్‌స్పెక్టర్ ముష్కరాజు**

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

నూతన సంవత్సర ఆరంభ వేళ ఎవరూ అనుమతులు లేకుండా రోడ్లపై కేక్ కటింగ్, డీజేలు ఏర్పాటు చేయడం వంటివి చేయడానికి వీలులేదని, అలా ఎవరైనా చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇన్స్‌పెక్టర్ ముష్కరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీ రాత్రి వేళ్లలో మద్యం సేవించి వాహనాలు నడిపిన, మైనర్లు డ్రైవింగ్ చేసినా, రాత్రి పూట ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్, ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించినా వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మండల ప్రజలు అందరూ తమ కుటుంబ సభ్యులతో క్షేమంగా కొత్త సంవత్సరాన్ని జరుపుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలి : ఎస్ఐ

నవతెలంగాణ-కల్లూరు

నూతన సంవత్సరానికి స్వాగతం పలికే సందర్భంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా నిబంధనలకు లోబడి ప్రశాంతంగా నిర్వహించబోవాలని ఎస్సై డి.హరిత మండల ప్రజలను సోమవారం ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 31 రోజు రాత్రి ఒంటి గంట తర్వాత ఎవరు కూడా అనవసరంగా రోడ్లపై తిరగకూడదు. అర్ధరాత్రి ఒంటిగంటలోపు కూడా, మద్యం సేవించి, వాహనాలని రోడ్లపై నడపరాదని తెలిపారు. పోలీస్ శాఖ వారి నిబంధనల మేరకు వేడుకలు జరుపుకోవాలని

సామర్థ్యాలను వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు

- **మండల విద్యాశాఖ అధికారి బి.చలపతిరావు**

నవతెలంగాణ-నేలకొండపల్లి



టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, ప్రతిభ సామర్థ్యాలను వెలికితిస్తాయని మండల విద్యాశాఖ అధికారి బి.చలపతిరావు అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి టాలెంట్ టెస్టులలో పాల్గొనడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తద్వారా విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. మండల స్థాయి పోటీలలో తెలుగు మీడియం విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను మండలంలోని అప్పలనరసింహపురం, బోదులబండ, పైనంపల్లి గ్రామాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన ఎం.గోపీచంద్, ఎస్‌కె.జాస్మిన్, కే.విష్ణు గెలుచుకున్నారన్నారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో ప్రథమ స్థానాన్ని నేలకొండపల్లి హైస్కూల్‌కు చెందిన జి .రిషిత, ద్వితీయ స్థానాన్ని నేలకొండపల్లి గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన వై.పూజాపల్లవి, తృతీయ స్థానాన్ని నేలకొండపల్లి హైస్కూల్‌కు చెందిన పి. శ్రీభావన అమృత గెలుచుకున్నారన్నారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో సింగారెడ్డిపాలెంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.గ్రీషిత, టి.సుమంత, ఆర్.ఇందు, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల నుండి ఇంగ్లీష్ మీడియం విభాగంలో నేలకొండపల్లిలోని గౌతమ్ మోడల్ స్కూలుకు చెందిన విద్యార్థులు టి. తేజేశ్వరూప్, కే. రేణుక, ఎస్‌కే.రిహాన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్నారన్నారు. నేలకొండపల్లి మండలం నుంచి తప్పకుండా రాష్ట్ర స్థాయికి వెళ్లాలని తద్వారా నేలకొండపల్లి మండల ప్రత్యేకతను రాష్ట్రస్థాయిలో వినిపించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాంఘిక శాస్త్రం ఫోరం మండల కన్వీనర్ బేతమల్ల ప్రసాద్ మాట్లాడుతూ సాంఘిక శాస్త్రం ఒక మహాసముద్రం లాంటిదని దానిని అభ్యసనం చేయడం ద్వారా అన్ని శాస్త్రాలను అధ్యయనం చేసినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ద్వారకపూడి గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అలాంటి పౌరులను తయారు చేయడంలో టాలెంట్ టెస్టులు ఎంతో దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులందరూ సాంఘిక శాస్త్రాన్ని అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటి రామారావు, షేక్ నవాబ్ సాహెబ్, పోలెపాక సునీత, పెరుమాళ్ళపల్లి రాములు, చిమట ఝాన్సీరాణి, ఉంగరాల పూర్ణచందర్‌రావు, షేక్ నాగుల్ మీరా, ఏ.గణేష్, సయ్యద్ మన్సూర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామపై కొడలు హత్యాయత్నం

- **కేసు నమోదు**

నవతెలంగాణ-కారేపల్లి

మామ మందలిస్తున్నాడని ఆవేశంతో కోడలు వేడి వేడి నూనెను నిద్రపోతున్న మామపై పోయటంతో అతనను చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఘటన కారేపల్లి మండలం పైల్‌తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పైల్‌తండాకు చెందిన అజ్మీర బాబు, అజ్మీర ఉమాలు మామ కోడళ్లు, బాబు కుమారుడు కోవిడ్ సమయంలో మృతి చెందాడు. అప్పటి నుండి ఉమా ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఉమా చెడుతిరుగుళ్లు తిరుగుతుందని దానిని మానుకోవాలని మామ చాలా సార్లు కోడలును హెచ్చరించాడు. దీంతో మామపై కోపం పెంచుకున్న ఉమా మామను అడ్డుతొలగించుకోవాలని ప్రయత్నించింది. దానిలో భాగం ఈనెల 28న తేదిన ఇంట్లో మంచపై నిద్రిస్తున్న మామపై కళాయిలో సలసలలాడుతున్న నూనెను పోసింది. బాధితుడు బాబును వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి తరలించి చిక్సిత నిర్వహిస్తున్నారు. బాబుపరిస్థితి విషమంగా ఉంది. దీనిపై బాబు అల్లుడు పిర్యాదు మేరకు కొడలు ఉమాపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కారేపల్లి ఎస్సై ఎస్. రాజారాం దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోయాడని ఫిర్యాదు..

అజ్మీరబాబుపై ఆయన కోడలు వేడి నూనెపోయటంతో వరంగల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని బాధితుని అల్లుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వరంగల్ వెళ్ళి పోస్టుమార్టం గదిలో తనిఖీ చేశారు. అజ్మీర బాబు కనిపించకపోవటంతో ఆసుపత్రి వైద్యులను విచారించగా బాబు మృతి చెందలేదని తేలింది. దీంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు పిర్యాదు దారులను మందలించారు.

ఉపాధి హామీ లింకు ఆలోచన విరమించుకోవాలి

- పట్టణ కూలీలకు మొండి చెయ్యి చూపిస్తే పోరాటం తప్పదు
- వ్యవసాయ కార్మిక సంఘం నేత కిన్నెర రాఘవులు వర్ధంతి సభలో బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



వ్యవసాయ కూలీల భరోసాకు ఆలోచన విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఉపాధి హామీ లింకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న భరోసా అమలుకు వంద రోజులు ఉపాధి హామీ పథకంలో పనిచేసి ఉండాలనే నిబంధన మున్సిపాలిటీల పరిధిలో ఉన్న కూలీలకు మొండి చెయ్యి చూపడం అవుతుందని, మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పథకం అమలు ఎత్తివేసిన ప్రభుత్వం కూలీల భరోసాకు ఎలా లింకు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. సోమవారం వైరా మున్సిపాలిటీ పరిధిలో గండగలపాడులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిన్నెర రాఘవులు 20 వర్ధంతి సందర్భంగా పాపగంటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సభలు ద్వారా కూలీలను గుర్తించాలని డిమాండ్ చేశారు. భూమి ఉంటే కూలీ భరోసా నిరాకరించే విధానం సరికాదని, అరకోర భూమి ఉన్న కూలీపై ఆధారపడి జీవించే కుటుంబాలను ప్రభుత్వం నమోదు చేయాలని, సంవత్సరం కాలంలో పేదలకు అందించే కూలీ భరోసా పథకం విధివిధానాలు రూపొందించకుండా కాలయాపన చేసి ఇప్పుడు హడావుడి ప్రకటనలు చేసి కూలీలను గందరగోళం చేయడం సరికాదని అన్నారు. సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటులో అవమానం చేయడం సరికాదని అన్నారు. పేదలకు, నిమ్న వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగం వలన ప్రయోజనం చేకూరిందని అన్నారు. ఈ సందర్భంగా కిన్నెర రాఘవులు స్మారక స్థూపం వద్ద చిత్రపటానికి కిన్నెర మోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జెండాను పల్లెబోయిన కృష్ణ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) సినీయర్ నాయకులు మల్లెంపాటి రామారావు, వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, గ్రామ కార్యదర్శి గుమ్మా నరసింహరావు, ఇమ్మడి సుధీర్, కామినేని రవి, ఖాజా కృష్ణ, సొసైటి డైరెక్టర్ బాల్లెపోగు శ్రీనివాస్, దేవభక్తిని నరసింహారావు, కిన్నెర నారాయణ, కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్- 2025 డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



టీఎస్ యూటీఎఫ్ 2025 సంవత్సర డైరీ, వాల్ క్యాలెండర్లు, స్టిక్కర్ క్యాలెండర్లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, పత్రిక సంపాదకవర్గ సభ్యులు జి.వి.నాగమల్లేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 డైరీ, క్యాలెండర్లు, స్టిక్కర్ క్యాలెండర్లు ఆకర్షణీయంగా ఉన్నాయని, ఉద్యోగ ఉపాధ్యాయులకు క్యాలెండర్లు, డైరీలు దిక్సూచిగా ఉపయోగపడతాయని అన్నారు. విద్యారంగ అభివృద్ధిలో ఉపాధ్యాయులు మంచి ఫలితాలు సాధించే విధంగా తగు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, బడ్జెట్ లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, షమీ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కార్యదర్శులు ఎం. నర్సయ్య, పి.సురేష్, బి.రాందాస్, డి. నాగేశ్వరరావు, వివి రామారావు, షేక్ ఉద్దండు షరీఫ్, షేక్ నాగూర్‌వలీ, కె.నిర్మలాకుమారి, కె.పద్మ, కె.విజయకుమార్, డి.ఉమామహేశ్వరరెడ్డి, జి.రామకృష్ణ, ఎ.కోటేశ్వరరావు, ఎస్.సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యర్రబోయినపల్లిలో సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే రాగమయి సహకారంతో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు
- కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామంలో పలు సమస్యలు పరిష్కారం కోసం ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి ఆ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బత్తుల రాము, ఆధ్వర్యంలో తీసుకుపోవటంతో సంవత్సర కాలంలో యర్రబోయినపల్లి గ్రామంలో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి పలు సమస్యలకు పరిష్కారం చూపారు. గ్రామంలో మంచినీటి కొరత అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవటంతో పాత యర్ర బోయనపల్లి గ్రామంలో దళిత వాడకు మంచి నీటి కొరత తీర్చేందుకు డి ఎంఎఫ్‌టి నుండి 3.50 లక్షలు, మంజూరు చేయగా బోరు వేసి పైపు నిర్మాణం చేపట్టి దళితవాడకు మంచినీటి సమస్య పరిష్కరించారు. కొత్త ఎర్రబోయినపల్లి గ్రామంలోని దళిత వాడకు 1.50 లక్షలతో పైపు లైన్ నిర్మాణం చేపట్టి మంచినీటి సమస్య పరిష్కరించారు. కొత్త యర్రబోయినపల్లి గ్రామంలో 12 లక్షల రూపాయలతో అంగన్వాడీ భవనాన్ని నిర్మించారు. 25 లక్షల రూపాయలతో పాత యర్ర బోయినపల్లి గ్రామంలోని దళితవాడలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని బత్తుల రాము తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 29 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొత్త యర్ర బోయినపల్లిలో 25 లక్షల రూపాయలు ఎస్‌డిఎఫ్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఒక సంవత్సరం కాలంలోనే కోటి రూపాయలు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు ఆ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బత్తుల రాము, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే రాగమయికి కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

నకిలీ రిపోర్టర్లపై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి కొత్తగూడెం జర్నలిస్టుల వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రిపోర్టర్ల మంటూ చలామణి అవుతున్న నకిలీ రిపోర్టర్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం పాత్రికేయులు కోరారు. సోమవారం ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతో పాటు ఇతర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు యూట్యూబ్, పిడిఎఫ్, గుర్తింపులేని పత్రికల వంటి వాటితో సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకొని రిపోర్టర్ల ముసుగు ధరించి తిరుగుతున్నారని, వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారి పట్ల దృష్టి సారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు ఎస్పీని కోరారు. జిల్లా ప్రెస్ క్లబ్ పేరుతో, సామాజిక స్థితి గతులు అడ్డుపెట్టుకుని కొందరు నకిలీ విలేకరులు ఆర్థిక వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ.. ఇకపై నకిలీ రిపోర్టర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు ఇమంది ఉదయ్ కుమార్, పండుగ రేశ్వంత్, చావా పాపారావు, దాట్ల రవీందర్, నరసింహారావు, సురేష్, ఉప్పల్, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు డిపో పరిధిలోని కరకగూడెం, పినపాక, బయ్యారం, అశ్వాపురం తదితర మండలాలలోని గ్రామాల ప్రజలు తమసలహాలను సూచనలను సమస్యలను సాయంత్రం 3 గంటల నుండి 4 గంటల మధ్యలో ఫోన్ ద్వారా తెలియజేయవచ్చును అన్నారు. ఫోను చేయాల్సిన నెంబర్ 9959225963కి డయల్ చేయవచ్చును అన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహనా సదస్సు

- డాక్టర్ శివకుమార్

నవతెలంగాణ-మణుగూరు

భారతదేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్‌లో భాగంగా సోమవారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డా.శివ కుమార్ సార్ ఆధ్వర్యంలో ఎంజేపీటీబీసీ బాలికల-, ఎంజేపీటీబీసీ-బాలుర హాస్టల్‌లో క్షయ వ్యాధిపై అవగాహన నిర్వహించినట్టు తెలిపారు. అనుమానితుల గుర్తింపు, శాంపిల్ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్న 347 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయన్నారు. టీబీ అనుమానితుల నుంచి తేమడా సాంపిల్స్ తీసుకొని ట్రూ నాట్‌కి పంపించినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ రజని రాంప్రసాద్, కృష్ణ, స్టాఫ్ నర్స్-సౌభాగ్య, రవి, భవాని పాల్గొన్నారు.

మోటివేషన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు తమ ఒత్తిడిని అధిగమించి మానసికంగా ఆందోళన చెందకుండా చదువుల్లో ఉన్నతంగా రాణించేందుకు నిర్వహిస్తున్న మోటివేషన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణి అన్నారు. సోమవారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నెస్ ఎక్స్పీరియన్స్ లైఫ్ పొటెన్షియల్ హెల్ప్ ప్రోగ్రామ్ ద్వారా యోగా, సమయ భావం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగు అధ్యాపకులు వర రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ మల్లెల శ్రీనివాస్ రావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతికి కార్మికులు సంతాపం

నవతెలంగాణ-మణుగూరు



మాజీ ప్రధానమంత్రి భారతదేశానికి నూతన ఆర్థిక సవరణలు అందించిన మన్మోహన్ సింగ్‌కు సింగరేణి కార్మికులు ఘన నివాళులర్పించారు. సోమవారం పీకే ఓ సీటు-2లో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, ప్రధాన కార్యదర్శి ఆల్బర్ట్, మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజుతో పాటుగా పాల్గొన్న పీకే ఓసీ అధికారులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీకే ఓసీ-2 ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు, సీఎంఓఏ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్ రామ్, ఇతర అధికారులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎస్.రాములు, బుర్రా వెంకటేశ్వర్లు, బానోత్ కృష్ణ, అబ్దులు రాహుప్, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయండి

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని రామచంద్రునిపేట గ్రామానికి చెందిన గిరిజన రైతులు, రైతుబంధు తీసుకుంటున్న రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని బేతంపూడి పీఏసీఎస్ చైర్మెన్ లక్కినేని సురేందర్ రావు, రైతులు భద్రాచలం ఐటీడీఎస్ ప్రాజెక్టుకి సోమవారం వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. సుమారు 58 మంది రైతులకు, అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు పట్టా ఇవ్వకుండా, నెంబర్ కేటాయించడంతో, వారందరికీ రైతుబంధు వస్తుందని, అందరి రైతుల లాగే పోడు పట్టా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, అటవీశాఖ అధికారులు పట్టాలు లేవని, అవి అటవీ భూమి అంటూ రైతుల్ని వేధిస్తున్నారని ఐటీడీఏ అధికారిని రైతులతో కలిసి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఉన్న ఆధారాల ప్రకారం, పోడు పట్టాలు ఇచ్చి, గిరిజన రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. అటవీ హక్కుల కమిటీ ఆమోదం పొంది, నెంబర్ కూడా కేటాయించారని, అందుకే వారందరికీ రైతుబంధు వస్తుందని తెలిపారు. అటవీ అధికారుల వేధింపులు లేకుండా చేయాలని కోరినట్లు తెలిపారు.

తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పినపాక





ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ పినపాక మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు (టీయూసీఐ) జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జి.ముత్తయ్య తెలిపారు. సోమవారం పినపాక మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లుగా తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్.మధుసూదన్ రెడ్డి, సలహాదారుగా రవి, అధ్యక్షులుగా చంటి, ఉపాధ్యక్షులుగా కే.తిరుపతి, నాగరాజు, కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా బాలరాజు, లక్ష్మయ్య కోశాధికారిగా ఎం.సతీష్, కమిటీ సభ్యులుగా వెంకన్న, స్వామి, సంపత్, సమ్మయ్య, రామనాథం, సుమన్, మౌనిక, కన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధిగా పనిచేసి, కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలను పరిష్కరించండి

- సీఈకి 1104 యూనియన్ వినతి

నవతెలంగాణ-పాల్వంచ



కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ఏడవ దశలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కేటీపీఎస్ ఏడవ దశ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 నాయకులు పలు సమస్యల మీద వినతి పత్రం అందజేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏడవ దశలో 2018 సంవత్సరం నుండి పీఎల్ఎఫ్‌ను ఇవ్వడం లేదని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. కేటీపీఎస్ కాలనీ నందు గల రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి అని, వాటిని రోడ్లు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టిజన్ కార్మికులకు డ్యూటీ డ్రెస్ క్లాత్ ఇచ్చారు. కానీ స్టిచ్చింగ్ చార్జెస్ ఇవ్వాలని కోరారు. సమస్యలపై చీఫ్ ఇంజనీర్‌కి జెన్కో అధ్యక్షులు కేశబోయిన కోటేశ్వరరావు, రీజనల్ అధ్యక్షుడు యాకుబ్, రీజినల్ సెక్రటరీ కంటే రాజేంద్ర, జెన్కో ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి రమేష్, ఆర్టిజన్‌లు కలిసి కోరారు.

దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవహేళన చేయడమే
- వామపక్షాల జిల్లా నేతలు
- బస్టాండు సెంటర్‌లో నిరసన



కొత్తగూడెం



భద్రాచలం రూరల్

నవతెలంగాణ-కొత్తగూడెం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వామపక్షాల జిల్లా నేతలు డిమాండ్ చేశారు. వామపక్షాల జాతీయ కమిటి పిలుపు మేరకు దేశ వ్యాపితంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బస్టాండు సెంటరులో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, చంద్రన్న వర్గం నాయకులు కందగడ్ల సురేందర్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ముద్దా బిక్షం మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని, రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ఆంతర్యం అమితాషా వ్యాఖ్యలతో బహిర్గతమైందన్నారు. అంబేద్కర్, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అమితాషా వ్యాఖ్యలపై స్పందించాల్సిన ప్రధాని తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సిపిఐ, ఎమ్మెల్ పార్టీల నాయకులు ఏజే.రమేష్, అన్నవరపు సత్యనారాయణ, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎస్.కె.ఫహీమ్, యూసుఫ్, రేపాకులా శ్రీనివాస్, ధర్మరాజు, మంద నర్సింహారావు, భూక్యా రమేష్, హరికృష్ణ, ఖయూమ్, ఉమర్, మోకాళ్ళ రమేష్, వీరభద్రం, వీరన్న, కుంజా కృష్ణ, రెడ్డి, లక్ష్మి, ఉప్పరబోయిన రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఉమ, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను మంత్రివర్గం నుండి తొలగించాలి

భద్రాచలం రూరల్ : అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను తక్షణమే మంత్రివర్గం నుండి తొలగించి, అతనిపై కేసు నమోదు చేయాలని వామపక్ష పార్టీలు సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్‌ల ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, సీపీఐ పట్టణ నాయకులు మారెడ్డి శివాజీ, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు సాయిలు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రచించి భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచం ముందు ఉంచిన మహా మేధావి, బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల కేంద్రంలోని బీజేపీకి గాని ఆ నాయకత్వానికి గాని ఏమాత్రం గౌరవం లేదని అన్నారు. తక్షణమే అమీషాను భర్త్ రఫ్ చేయాలని ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ నోరు విప్పాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు మాట్లాడి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ నాయకులు డి.సీతాలక్ష్మి, ఎన్.నీలావతి, యు.జ్యోతి, ఎన్.నాగరాజు, కుంజా శ్రీనివాస్, అజయ్ కుమార్, చాట్ల శ్రీను, ధనకొండ రాఘవయ్య, కోరాడ శ్రీనివాస్, మచ్చా రమా, సక్కుబాయి, రాధ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ములకలపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాలని హెూం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని దమ్మపేట-పాల్వంచ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్‌ను అవమానించడమంటే భారత దేశ ప్రజలను అవమానించడమేనని అన్నారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా చేయడం సరైనది కాదని అన్నారు. అమిత్ షాని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నిమ్మల మధు, జి.లక్ష్మి నరసయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, కాంపసాటి వెంకటేశ్వర్లు, వగ్గేల ఏసు, కర్రీ కృష్ణయ్య, సున్నం భద్రయ్య సుందర్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం : అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం ములకపాడు అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాపంథ నాయకులతో కలిసి యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు సాయన్న, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, జి.పద్మ, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి, మహమ్మద్ బేగ్, లక్ష్మయ్య, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



చర్ల : అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా చర్ల మండలంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ చర్ల, దుమ్ముగూడెం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ మండల్ నాయకులు పార్టీ పాలెం చుక్కయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు పొడుపు గంటి సమ్మక్క, సీపీఐ(ఎం) మండల నాయకులు బాలాజీ, దొడ్డి హరి నాగవర్మ వరలక్ష్మి, షారోని, ఏఐటీఎఫ్ ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జిల్లా నాయకులు గొంది ముయ్యన్న, మల్లేష్, నరసింహ, ఉయిక రాము తదితరులు పాల్గొన్నారు.



పినపాక : సంపన్నులకు దేశ సంపద దోచిపెట్టడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న మండిపడ్డారు. సోమవారం మండల కార్యదర్శి దుబ్బ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ బయ్యారం క్రాస్ రోడ్డులో నిరసన తెలియజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, నట్టి శంకరయ్య, మడివి జోగయ్య, పాయం శంకర్, బాడిష నరసయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్ : అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని క్షమాపణ తెలియజేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ అన్నారు. సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకొని ప్రధాన రహదారిపై నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, నాయకులు చప్పిడి వెంకటేశ్వర్లు, శ్రీను, పుల్లయ్య, శంకర్, బాలు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట : అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని కించపరచడం మే నని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేసారు. అమిత్ షా మాటలకు నిరసనగా సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేసారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాద్‌లు పాల్గొన్నారు.



దమ్మపేట : అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా సీపీఐ(ఎం) సీపీఐ, ఎంఎల్ ప్రజాపంథా, మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిపారు. అనంతరం అమీత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తుంటే దమ్మపేట పోలీసులు అడ్డగించి దిష్టిబొమ్మను లాక్కెళ్లారు. అనంతరం సీపీఐ(ఎం) మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మినారాయణ, సిపిఐ ఎంఎల్. ప్రజాపందా మాస్ లైన్ జిల్లా కార్యవర్గ సభ్యులు అమర్ల పూడి రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు కొలికి పోగు శ్రీనివాసరావు, ఆరుకుట్ల రాంప్రసాద్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రైతు సంఘం డివిజన్ నాయకులు పండూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు : అమీషా తక్షణమే రాజీనామా చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. స్థానిక మార్కెట్ బిల్డింగ్ వర్కర్స్ అడ్డా వద్ద సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శ అబ్దుల్ నబి, జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కామ నాగరాజు, మహమూద్, సత్యనారయణ, కోరి లక్ష్మణ్ పాసి, కోటేశ్వరరావు, భద్రు, వెంకన్న, పాల్గొన్నారు.



సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద

నవతెలంగాణ-ఇల్లందు

గత ఎన్నికలలో సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహా రావు డిమాండ్ చేశారు. జే కే 5 మైన్ నందు ఉపాధ్యక్షులు శిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హామీలను విస్మరిస్తే ఊరుకునేది లేదని సొంత ఇల్లు అమలు కొరకు ఎంతటి ఉద్యమాల కైనా సిద్ధంగా ఉన్నామన్నారు. పెరాక్స్ మీద ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ గతంలో 2011వ సంవత్సరంలో గెలిచిన సంఘం ఏఐటీయూసీ ఉన్నప్పుడు కోల్ ఇండియాలో ఒప్పందం జరిగిందని, ఇప్పటికీ 13 సంవత్సరాలు గడిచిన తర్వాత మరల ఏఐటీయూసీ అధికారంలో వచ్చి పెరెక్స్ మీద ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ మీద మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. స్ట్రక్చర్ సమావేశాల్లో ఇట్టి అంశాన్ని చర్చించకపోవడంపై కార్మికుల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో రావడానికి కార్మికులందరూ ఏకతాటిపైకి వచ్చి అధికారం ఇచ్చారని ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇట్టి విషయాన్ని మరిచి సంవత్సరం కాలము అయిందని ఇప్పటికీ సంవత్సర కాలంగా అటు రాష్ట్ర ప్రభుత్వానికి ఇటు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలకు సమయం ఇచ్చామని భవిష్యత్తు కార్య చరణలో హామీల పట్ల వైఖరి తెలియజేస్తూ ముందుకు రావాలన్నారు. హామీలకు సంబంధించిన అంశాలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పెద్దన్న పాత్ర పోషించి చేస్తే బాగుంటుందని లేనిచో భవిష్యత్తులో కార్మికులు తగిన బుద్ధి చెబుతారని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎండీ అబ్బాస్, సిరాజ్ అహ్మద్, రాం భరోస్, వరంగంటి రాజ మొగిలి, సోమ కృష్ణ ఓసీ కార్మికులు పాల్గొన్నారు.

చర్చిలో క్రిస్టమస్ విందు

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండలంలోని చర్చిలో రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టమస్ సందర్భంగా ఇచ్చిన కానుక విందును సోమవారం నిర్వహించినట్టు పాస్టర్ అధ్యక్షులు బి.జాన్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ గుగులోతు రామచందర్, జనరల్ సెక్రటరీ పాస్టర్ టి.బోయాజ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్టమస్ వేడుకలను పురస్కరించుకుని జరుపుకోవడం సంతోషకరమ న్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పాస్టర్స్, సిస్టర్స్‌లు, సంగస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో కొన్ని ఫిర్యాదుల చూస్తే కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన రాజుల సరోజిని తన భర్త గుండె నొప్పితో చనిపోయారని, సొంత ఇల్లు లేక కిరాయి ఇంటిలో ఉంటూ కిరాయి కట్టలేక, కుటుంబం గడవడం కష్టంగా మారిందని తెలిపారు. పెన్షన్ కూడా రావడం లేదని తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని చేసిన దరఖాస్తులను పరిశీలించి తగు చర్యల నిమిత్తం హౌసింగ్ డిపార్ట్మెంట్‌కు సిఫార్సు చేశారు. గాజులరాజాం బస్తికి చెందిన మహేష్ శంకర్ కూలి పని చేసుకుని జీవిస్తున్నానని, చాలీచాలని కూలీతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, తన భార్య చనిపోయిందని, తనకు ప్రభుత్వం నుండి పెన్షన్ మంజూరు చేయించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం డీఆర్‌డీఓకు ఎండార్స్ చేశారు. చంద్రుగొండ మండలం తోకల గూడెం గ్రామానికి చెందిన బురుగు రామారావు తాను ఉపాధ్యాయ వృత్తికి సంబంధించి బీఈడీ కోర్సు పూర్తి చేసి దీనికి సంబంధించిన ప్రిపరేషన్‌లో ఉన్నానని ఆర్థిక ఇబ్బందుల వలన నేను ఏదైనా ఉపాధిని పొందాలనుకుంటున్నానని అందుకొరకు మా చంద్రుగొండ మండల పరిధిలో గల విద్యా సంస్థల్లో ఏదైనా ఉపాధిని కల్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎండార్స్ చేశారు. మణుగూరుకు చెందిన మాదాసు రిషిత నేను పదో తరగతి వరకు చదివి ఉన్నానని తన చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో తనకంటూ ఎవరూ లేక ఒంటరిగా జీవనం సాగిస్తూ చాలా దీనమైన పరిస్థితిలో ఉన్నానని తన పరిస్థితిని ఆలోచించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురుకులాల్లో హాస్టల్లో ఖాళీగా ఉన్న కుక్/వాచ్మెన్ పోస్టులలో ఏదైనా ఒకటి ఇప్పించగలరని ఆర్‌సీఓకి ఎండార్స్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో పశువులు విచ్చలవిడిగా రోడ్లమీద, పంట పొలాల్లో పంటను నాశనం చేస్తున్నాయని, రహదారులు వెంట వాహనదారులు ఇబ్బందులకు గురి అవుతున్నారని, కావునా మున్సిపాలిటీ పరిధిలో బందెల దొడ్డి నిర్వహణ చేపట్టాల్సిందిగా స్థానికులు చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం అధికారులకు ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగారెడ్డి ఘటనపై ప్లకార్డులతో నిరసన

నవతెలంగాణ-దమ్మపేట



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాములుపై మతోన్మాద మూకలు భక్తి ముసుగులో దాడి చేయడాన్ని ఉద్యోగ కార్మికులు ప్రజాతంత్ర వాదులు లౌకిక శక్తులు ఖండించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రాములు పై దాడిని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ పాఠశాలలో మతోన్మాదులు ఈ విధమైన అమానుష చర్యలకు పాల్పడడం సరైనది కాదని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ఈ చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాధ, సుజాత, విజయ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని మున్నూరుకాపు సంఘం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలోని ఎస్ఆర్ వంక్షన్‌హాల్లో నూతన సంవత్సర 2025 క్యాలండర్‌ను ఎంపీడీఓ అశోక్, ఏఓ వినయ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సంఘం పెద్దలు మాట్లాడుతూ...బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు పెంచాలని, ఓటుబ్యాంకు రాజకీయలకు బీసీలు చమరగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం బాధ్యులు రామిశెట్టి సైదయ్య, వెలగల మధు, రంగిశెట్టి రాము, అంచ క్రిష్ణ, పూసాల లక్ష్మీపతి, శెట్టిపల్లి క్రిష్ణయ్య, గాజుల ప్రసాద్, ఆకుల రాంబాబు, ఆళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

జర్నలిస్టులకు ప్రత్యేక నిధిని సాధించిన టీయూడబ్ల్యూజే

- జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను వదిలిపెట్టేది లేదు
- టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) హెచ్-143 రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ



నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడింది టీయూడబ్ల్యూజేనని, జర్నలిస్టులకు ప్రత్యేక నిధిని సాధించింది, రికార్డు స్థాయిలో 20,300పై చిలుకు అక్రిడేషన్లు అందజేసిన ఘనత కూడా మనకు దక్కుతుందని, కరోనా సమయంలో రూ.7కోట్ల ఆర్థిక సాయం అందజేయడమే కాకుండా రాష్ట్రంలో దాదాపు 450 జర్నలిస్టుల కుటుంబాల్లో పింఛన్ అందజేసి వెలుగులు నింపామని టీయూడబ్ల్యూజే(టిజేఎఫ్) హెచ్-143 రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ అన్నారు. స్వరాష్ట్రానికై ఆంధ్రా యజమానుల చేతుల్లో నుంచి పెద్ద పదవులను సైతం కాదని బయటి వచ్చి పోరాటం చేశామని, ఆంధ్రా పెత్తందారీ యూనియన్లతో ఒరిగేదేమీ లేదని, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి మహమ్మద్ షఫీ సమక్షంలో కొత్తగూడెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అల్లం నారాయణ మాట్లాడుతూ... 15 ఏండ్ల పాటు పోరాటం చేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో టీయూడబ్ల్యూజే పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. జర్నలిస్టులకు రూ.42కోట్ల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడంతో పాటుగా కరోనా లాంటి విపత్కర సమయాల్లో రూ.10వేలు, రూ.20వేలు చొప్పున రూ.7కోట్ల ఆర్థిక సాయం కేవలం ఆధార్ కార్డు ద్వారా అందజేశామని తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు సంబంధించి ప్రత్యేక జీవో సైతం వచ్చిందని, కానీ సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో నిలిచిపోయాయని, ఇండ్ల స్థలాల సమస్యను వదిలిపెట్టేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ హజరే, రాష్ట్ర కోశాధికారి యోగానంద్, టెంజూ రాష్ట్ర అధ్యక్షులు విష్ణు, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కాగితపు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఐజేయూ సభ్యులు చంద్ర నరసింహారావు, గుర్రం రాజేష్, టెంజూ జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, జిల్లా కార్యదర్శి శ్రీహరి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల కుట్టు మిషన్లు మాయం

- భాగాల వారీగా అపహరణ
- బాధ్యులు ఎవరు?



నవతెలంగాణ-అశ్వారావుపేట

మైనార్టీ మహిళల కోసం గత ప్రభుత్వం అసెంబ్లీ గతేడాది ఎన్నికల ముందు ఉచిత కుట్టు మిషన్ పథకాన్ని అమలు చేయాలని భావించింది. అనుకున్నదే తడవుగా ప్రతి నియోజకవర్గానికి వంద కుట్టు మిషన్లను మంజూరు చేసి, ఆయా మిషన్లను ఎంపీడీఓ కార్యాలయాల్లో నిల్వ చేసింది. ఇందులో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గానికి కుడా లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు 98 కుట్టు మిషన్లను మంజూరు చేయగా, ఆయా కుట్టు మిషన్లను మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచారు. వీటిని గతేడాది జూలై నాటికే అందుబాటులోకి తీసుకొచ్చినా అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో పంపిణీకి నోచుకోలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన కుట్టు మిషన్ల పథకానికి బ్రేక్ వేసింది. దీంతో ఆ నాటి నుంచి కుట్టు మిషన్లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. ఇదే అదునుగా తీసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచిన 83 కుట్టు మిషన్లలో మిషన్‌ల విడిభాగాలు వారీగా చోరీకి గురైన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్యాలయం నుంచి మాయం చేసిన కుట్టు మిషన్ల విలువ ఒక్కొక్కటి రూ.10 వేల చొప్పున రూ.83 వేలు ఉంటాయని అంచనా. కొద్ది రోజుల క్రితం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఈఓ గదిలో అడ్డుగా ఉన్న ఈ కుట్టు మిషన్లను ఖాళీగా ఉన్న ఎంపీపీ గదిలోకి మార్చారు. ఈ క్రమంలోనే కుట్టు మిషన్లు ఉండాల్సిన వాటి కంటే తక్కువగా ఉండటాన్ని గుర్తించినట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని బయటకు రాకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్త పడుతున్నారు. కాగా ఈ కుట్టు మిషన్లు కార్యాలయానికి చేరిన తర్వాత ఒక ఎంపీడీఓ పదవీ విరమణ చేయగా ఎంపీఈఓ బదిలీ అయ్యారు. ఈ మిషన్‌ల చోరీలో ఎవరి హస్తం ఉందో విచారణలో తేలుతుంది.

మండలం	మిషన్ లు
అశ్వారావుపేట	38
దమ్మపేట	16
చంద్రుగొండ	16
ములకలపల్లి	13
అన్నపురెడ్డిపల్లి	01
మొత్తం	83

విడి భాగాలు వారీగా చోరీకి గురైనవి....

భాగం	ఉన్నవి	మాయమైనవి
మోటర్లు	34	49
హెడ్స్	64	19
బల్లలు	66	17
స్టాండ్‌లు	69	14

మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఎంపీడీఓ కార్యాలయానికి వంద కుట్టు మిషన్లు అందించినట్లు సమాచారం ఉంది. కానీ వాటిలో కొన్ని మిషన్లు తగ్గినట్లు గుర్తించాం. ఎంపీఈఓ గదిలో అడ్డుగా ఉన్న కుట్టు మిషన్లను ఖాళీగా ఉన్న ఎంపీపీ గదిలోకి మార్చే సమయంలో కొన్ని తగ్గినట్లు గుర్తించాం. అయితే భాగాలు వారీ మాయం అయ్యాయని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఈ విషయం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ నవతెలంగాణతో మాట్లాడుతూ చోరీకి గురైన విడిభాగాలు పై పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

తక్షణమే పంపిణీ చేపట్టాలి

జలాల్ సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్

కుట్టు మిషన్లు పంపిణీ చేయమని పదేపదే అడుగుతూనే ఉన్నాము. చివరికి ఇలా మాయమయ్యాయి. ఇది పరిస్థితి ఇప్పటికైనా మాయం చేసిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలి.

ఆకర్షవంతంగా గిరిజన మ్యూజియంని సిద్ధం చేయాలి

- పనుల పరిశీలనలో పీఓ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున తప్పనిసరిగా ట్రైబల్ మ్యూజియంనకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి మ్యూజియంను విద్యుత్ కాంతులతో విరాజిల్లేలా సంబంధిత అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకొని పర్యాటకులు ఆకర్షించేలా ముస్తాబు చేయాలని పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించి జరుగుతున్న పనులను సంబంధిత ట్రైబల్ మ్యూజియం కమిటీ సభ్యులతో చేపట్టవలసిన పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే నెల 9, 10 తేదీలలో సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం జరుగుతున్నందున భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున వారు తప్పనిసరిగా ట్రైబల్ మ్యూజియంను సందర్శించేలా భద్రాచలం పట్టణంలోని ముఖ్య కూడళ్ళలో, మ్యూజియం ఎదురుగా మ్యూజియం సంబంధించిన స్వాగత బోర్డులు ఏర్పాట్లు చేయాలని పర్యాటకులు మ్యూజియం సందర్శించడానికి వచ్చినపుడు సాంప్రదాయకమైన దుస్తులు ధరించిన స్త్రీలు స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఎఫ్‌డీసీ ఉదయ్ కుమార్, ఐటీసీ జీఎం చంగల్ రావు, ఏపీవో పవర్ ఏఈ మునీర్ పాషా, డీఈ హరీష్, మలేరియా అధికారిని స్పందన, జేడీఎం హరికృష్ణ, ఈవో జిపి శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విచారణానంతరం చర్యలు

- సివిల్ సప్లై డీటీ ప్రభాకర్

నవతెలంగాణ-అశ్వారావుపేట

సఖి కేంద్రంలో శనివారం అనుమతికి మించి లభ్యం అయిన గ్యాస్ సిలిండర్‌లపై సోమవారం సివిల్ సప్లై డీటీ ప్రభాకర్ విచారణ చేపట్టారు. భారత్ గ్యాస్ గోడౌన్‌లో భద్రపరిచిన సిలిండర్లును తనిఖీ చేసిన అనంతరం సఖి కేంద్రం నిర్వాహకులతో ఆయన విచారించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ విచారణ నివేదికను డీసీ ఎస్‌వోకు అందజేస్తామని ఆయన తెలిపారు. తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

పోషక ఎరువులతో అధిక దిగుబడులు

- ఉద్యాన అధికారి విస్తృత పర్యటన



నవతెలంగాణ-అశ్వారావుపేట

పోషక ఎరువులతో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు రాబట్టవచ్చని ఉద్యాన అధికారి వేణుమాధవ్ రైతులకు సూచించారు. ఆయన సోమవారం మండలంలోని ఆసుపాక, తిరుమలకుంట, పండు వారి గూడెం, అనంతారం, జగన్నాధపురం గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ ఫాం, కొబ్బరి, పుచ్చ తోటల్లో విస్తృతంగా పర్యటించి వాటికి సోకిన వ్యాధులు, తీసుకోవాల్సిన నివారణ చర్యలను రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట రైతులు కక్కిరాల ముక్తేశ్వర రావు, భూక్యా నవీన్, వెంకటేశ్వరరావులు ఉన్నారు.

స్వల్పంగా పెరిగిన క్రైమ్...

- గంజాయి పై ఉక్కుపాదం
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అద్భుత ఫలితాలు
- పెద్ద ఎత్తున మావోయిస్టుల లొంగుబాట్లు
- అందరి సహకారంతో మరింత మెరుగ్గా పోలీస్ సింగ్
- విలేకర్ల సమావేశంలో ఎస్పీ వార్షిక నివేదిక



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత ఏడాది కంటే క్రైమ్ రేటు పెరిగినప్పటికీ, జిల్లా మీదుగా తరలి వెళ్లే గంజాయిని అరికట్టి ఉక్కుపాదం మోపామని, నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నక్సలిజం ఏరివేశామని, ఈ ఏడాది పలు విజయాలు సాధించినట్లు ఎస్పీ బి.రోహిత్ రాజు స్పష్టం చేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వార్షిక నివేదికను వెల్లడించారు. జిల్లాలో శాంతి భద్రతలతో పాటు విపత్కర పరిస్థితిలో పోలీస్ సేవలు ఉన్నాయన్నారు. భద్రాచలంలో వరదలతో పాటు అశ్వారావుపేట మండలం పెద్దవాగు ప్రాజెక్టుకు వరద ముంపులో చిక్కుకున్న 40 మందిలో ఒక్కరికి ఎలాంటి హాని కలగకుండా ప్రాణాలతో కాపాడగలిగామని ఇది తనకు సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఏడాది కాలంలో 5 రాబరీలు, ఇంటి తాళాలు పగలగొట్టి గత ఏడాది 18 చోరీలు జరుగుతే ఈ ఏడాది 16 జరిగాయని, రాత్రి పూట గత ఏడాది 137 చోరీలు జరుగగితే, ఈ ఏడాది 130 జరిగాయని, చిన్న దొంగతనాలు గత ఏడాది 223 ఏడాది 260 చోటు చేసుకున్నాయని, గత ఏడాది 26 హత్యలు జరగగా ఏడాది 24 జరిగినట్లు తెలిపారు. 57 అత్యాచారం కేసులు నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 89కి పెరిగిందన్నారు. వ్యక్తులపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలు గత ఏడాది 676 జరగగా, ఏడాది తగ్గి 574 జరిగాయన్నారు. రోడ్డు ప్రమాదాలు ఏడాది 220 జరిగాయని రెండు శాతం పెరుగుదల ఉందన్నారు. ఫోక్సో కేసులు గత ఏడాది 86 కాగా ఈ ఏడాది 105 జరిగాయన్నారు. అట్రాసిటీ కేసులు గత ఏడాది 84 కాగా ఏడాది 102 నమోదయ్యాయని, మహిళలపై క్రైమ్ రేట్లో 5.9శాతం పెరుగుదల ఉందన్నారు. రేషన్ బియ్యం కేసులు 71, ఇసుక రవాణాపై 218, గేమింగ్ యాక్ట్ లో 206 కేసులు నమోదు చేశామన్నారు. 11 పెద్ద కేసుల్లో 31 మందికి శిక్ష పడగా అందులో నలుగురికి యావజ్జీవ కారాగారం, ఒకరికి 27 సంవత్సరాలు, మరోకరికి 12 ఏళ్లు, మరొకరికి 10 ఏళ్ల నలుగురికి ఐదేళ్ల చొప్పున శిక్ష పడిందన్నారు. ఈ ఏడాది జనవరిలో ముక్కోటి ఏకాదశి శ్రీరామనవమి ఉత్సవాలు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించగలిగామని, పార్లమెంటు ఎన్నికల్లో 3.45లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. అందరి సహకారంతో సబ్ డివిజన్ పోలీస్ అధికారుల సహకారంతో ముందుకు వెళ్తున్నామని ఎస్పీ వివరించారు. గంజాయి మీద ఉక్కుపాదం మోపామని, జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణా అడ్డుకునేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, భద్రాచలంలో ఒక శాశ్వత చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఒక ఎస్ఐని నియమించమన్నారు. గత ఏడాది73 కేసులు నమోదుకాగా, ఈ ఏడాదిలో 106 కేసులో నమోదు చేశామని, 45శాతం అరికట్టామని, గత ఏడాది 4300 కేజీలు స్వాధీనం చేసుకున్నామని, ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 8 వేల కిలోల గంజాయి పట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో తొలిసారి నార్కోటిక్స్ విభాగంలో జాగిలానికి శిక్షణ ఇచ్చామని, దాని ద్వారా అనుమానితుల ఇళ్లలో, వాహనాల్లో తనిఖీలు చేసి కేసులు పెడుతున్నామన్నారు. ఈ పరిశోధనాత్మక ప్రయోగం భద్రాద్రి జిల్లాను చూసి మిగతా జిల్లాల్లో కూడా పోలీసు జాగిలాన్ని ఇందుకు వాడుతున్నతీరు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 36 వేల గంజాయిని ఆరు విడతల్లో ధ్వంసం చేశామన్నారు. దీని విలువ రూ.90 కోట్లు ఉంటుందన్నారు. జిల్లాలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. ప్రజల్లో చైతన్యం పెరిగి వెంటనే 1930కు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా అధికంగా వాడకం వల్ల మోసపోతున్నారని స్పష్టం చేశారు. 2.5 కోట్లు ఫ్రీజ్ చేసి ఇప్పటికి రూ.1కోటి 30 లక్షలు తిరిగి బాధితులకు అందజేశామని తెలిపారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులతో ఆయా గ్రామాల్లో నాణ్యమైన రోడ్లు వేయడం, ఆ ప్రాంత యువతకు క్రీడా సామగ్రిని అందజేస్తున్నామని తెలిపారు. మూడేండ్ల కాలంలో రూ.90 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. ఆదివాసీయులకు అవసరమైన కమ్యూనిటీ హాళ్ళు,ఆటలకు అవసరమైన సామాగ్రి, క్రీడ స్థలాలు అవసరం అయినవి ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. జిల్లాలో 5 డిడిఆర్ ఎఫ్ బృందాలు ఏర్పాటు చేశామని, ఈ బృందాలు ఖమ్మంలో వచ్చిన వరదలప్పుడు కూడా సేవలందిచాయన్నారు. మావోయిస్టుల కార్యకలాపాలపై పూర్తి దృష్టి పెట్టామని మొత్తం 59 మంది అరెస్టు అయ్యారన్నారు. లొంగిపోయిన 31 మందిలో 11మంది ఏరియా కమిటీ సభ్యులు,, పదిమంది దళ సభ్యులు, ఒక మిలీషియా కమాండర్, మిలిటరీ డిప్యూటీ కమాండర్ మరో ఏడుగురు మిలీషియా సభ్యులు ఉన్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు పనితీరు మెరుగైన ఫలితాలతో మంచిగా ఉన్నదన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి షేక్ అబ్దుల్ రహమాన్, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, మణుగూరు డిఎస్పి వీ.రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పి ఎం.చంద్రభాను తదితరులు పాల్గొన్నారు.



ముక్కోటికి ముస్తాబైన పర్ణశాల

- నేటి నుండి స్వామివారి అలంకార సేవలు
- స్వామివారి తిరువీధి సేవ కోసం ప్రత్యేక పల్లకి




నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్య క్షేత్రం నేటి నుండి జనవరి 20వ తేదీ వరకు జరిగే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు (ముక్కోటి)కి పర్ణశాల ముస్తాబైంది. ఆలయాన్ని ప్రత్యేకంగా రంగులతో తీర్చిదిద్ది చలువ పందిళ్లు ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతోపాటు మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులపాటు జరిగే అలంకార సేవల కోసం భద్రాచలం తరహాలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో నిర్వహించే స్వామివారి తిరువీధి సేవ కోసం ప్రత్యేక పల్లకిని సిద్ధం చేశారు. నేటి నుండి తొమ్మిది రోజులు పాటు జరిగే అలంకార సేవలలో భాగంగా పర్ణశాల శ్రీ సీతారామ చంద్ర స్వామి వారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవంలో భాగంగా జనవరి 9వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు తెప్పోత్సవంతో పాటు, 10వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్తరం ద్వారం గుండా స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భద్రాచలం తరహాలోనే పర్ణశాలలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలకు భక్తులు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. ఈ సంవత్సరం వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల సందర్భంగా నిర్వహించే అలంకారాలలో భాగంగా శ్రీరామ చంద్రమూర్తిని భక్తులు కనులారా వీక్షించే విధంగా ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేయడంతో పాటు, పల్లకిని సిద్ధం చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్ నవతెలంగాణకు తెలిపారు.

ఆ నలుగురుపై మంత్రి పొంగులేటి సీరియస్..!

- ప్రభుత్వ భూమిని సైతం రిజిస్ట్రేషన్ చేసిన ఆరోపణలు
- సీసీఎల్ఏ ద్వారా అక్రమార్కుల కార్యకలాపాలు

పూర్తి స్థాయిలో రంగంలోకి దిగనున్న ఎమ్మెల్యే జారే



నవతెలంగాణ-దమ్మపేట

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డిసెంబర్ 26వ తేదీన దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం, కొన్ని రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి రైతులను నేరుగా ప్రశ్నించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. దీనికి కొనసాగింపు అన్నట్లుగా డిసెంబర్ 28వ తేదీన సర్వేయర్ రూ.50వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని, కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. అసలైన సూత్రధారి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వదిలి వేశారని రైతులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పటికీ తహశీల్దార్ కార్యాలయంపై ఇక్కడ జరిగిన కార్యకలాపాలపై, ధరణి యాప్ ప్రారంభం నుండి జరిగిన లావాదేవీలు, రిజిస్ట్రేషన్‌లపై తన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో పొంగులేటి ప్రత్యేకంగా చర్చించి వారి సూచనలు కోరినట్లు తెలుస్తోంది. దీంట్లో భాగంగా భూ లావాదేవీల్లో కీలక పాత్ర వహించిన నాచారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, ఆసన్నగూడెం గ్రామానికి చెందిన మరో వ్యక్తి, ముష్టిబండ గ్రామ పంచాయతీకి చెందిన ఇద్దరు వ్యక్తుల పట్ల తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వాళ్ళపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునే విధంగా ఆధారాలను తహశీల్దార్ కార్యాలయం నుండి తరలిపోకుండా పగడ్బందీగా ఉంచాలని ఆ నలుగురు వ్యక్తులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని కోట్ల రూపాయల్లో ఆ నలుగురు వ్యక్తులు కూడబెట్టినట్లు వాటి అన్నింటిని బహిర్గతం చేయాల్సిందిగా రెవెన్యూ టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించినట్లు నమ్మదగ్గ సమాచారం. దీంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎక్కడెక్కడ భూ లావాదేవీలు జరిగాయి, అక్రమంగా ప్రభుత్వ భూములను ఏమైనా రిజిస్ట్రేషన్‌లు చేయించారా, ఆ నలుగురు వ్యక్తులకి కాంగ్రెస్ పార్టీ పరంగా ఎవరైనా అండదండలు అందించారా అనే విషయాలపై పూర్తిగా రంగంలోకి దిగి ఎమ్మెల్యే కూపీ లాగుతున్నట్టు తెలుస్తోంది.

మరో సంచలన విషయం ఏమిటంటే దమ్మపేట రెవెన్యూ మోజా జమేదార బంజర 1458/1/19 సర్వే నెంబర్‌లో ప్రభుత్వభూమి పోడిసైతం కాలేదు. 29.01.2024 తేదీన డాక్యుమెంట్ నెంబర్ 162024, 172024 అప్పటి తహశీల్దార్ ఇరువురు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి పాస్‌పుస్తకాలు సైతం ఆ వ్యక్తులకు అప్పజెప్పారు. ఇది సాధ్యం కానప్పటికీ ప్రభుత్వ భూమిని సైతం రిజిస్ట్రేషన్ చేయించినందుకు అప్పటి తహశీల్దార్‌పై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

1458/1/19 ఈ సర్వే నెంబర్ నిషేదిత జాబితాలో ఉన్నప్పటికి చీఫ్ కమిషనరేట్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సిసిఎల్ఎ)లో పనిచేస్తున్న కొంతమంది అధికారులను మచ్చిగ చేసుకొని ఈ సర్వే నెంబర్ నిషేదిత జాబితాలో నుండి తొలగించి కలెక్టరేట్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఒక అధికారి ద్వారా మిస్సింగ్ సర్వే నెంబర్ కింద మార్పుచేసి ఫ్రీడమ్ ఫైటర్స్ పట్టా చేయించి 10 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. 2021 ఆగస్టు నెలలో ఈ సర్వేనెంబర్‌లో ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగింది. ఆ సమయంలో ఈ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిగాని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఇరువురు వ్యక్తులు గాని లేరు. అప్పట్లోనే ఈ సర్వేనెంబర్‌ను ప్రభుత్వ భూమితో పాటు అటవీశాఖ భూమి ఉందని అధికారులు తెలియజేసినప్పటికీ ప్రభుత్వ భూమికి ప్రైవేట్ వ్యక్తులను పట్టాదారులుగా చేసి పాస్‌పుస్తకాలు ఇవ్వడంపై రెవెన్యూ అధికారులపై భూ లావాదేవీల్లో పాలుపంచుకున్న అధికారులపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ఫ్రీడమ్ ఫైటర్స్ పట్టా ఇచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు ఆ వ్యక్తికి భూమిని చూపించలేదు. ఆ వ్యక్తి మరణించడంతో ఖమ్మంలో నివాసం ఉంటున్న ఆ వ్యక్తి వారసుల వద్దకు వెళ్ళి ఎకరానికి రూ.2లక్షల చొప్పున రూ.20లక్షల నగదు ఇచ్చి ఆ పట్టాద్వారా అప్పటి తహశీల్దార్‌కు మరో రూ.20లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయించిన వ్యక్తులలో ఏసీబీకి చిక్కిన మండల సర్వేయర్ మెరుగు వెంకటరత్నం, ఆర్ఐలు ఉన్నట్లు పూర్తి సమాచారం. వారి ఆధ్వర్యంలోనే సర్వే నిర్వహించి ఎటువంటి అభ్యంతరాలు లేవు అన్నట్లుగా అధికారులకు తెలియజేసి ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసిన ఘనులు వీళ్ళు. ఏది ఏమైనప్పటికి మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన, ఏసీబీ దాడులు, ప్రభుత్వ భూములు ప్రయివేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్‌లు సంచలనాలను కలిగిస్తున్నాయి.

ఆదివాసీలతో ఆడుకుంటున్న ఫారెస్ట్ అధికారులు

- పోడు భూములలో కొర్రలు, జొన్నలు పండించాలని హుకూం
- మా అనుమతి లేకుండానే పోడు పట్టాలు ప్రభుత్వం పంపిణీ చేసింది



నవతెలంగాణ-చర్ల

ఆదివాసీలను అన్ని విధాల ఆదుకుంటామని గిరిజనుల పోడు భూములకు పట్టాలిస్తామని నమ్మ పలికి రేవంత్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత అమాయక ఆదివాసీలతో ఫారెస్ట్ అధికారులు చదరంగం ఆడుకుంటున్నారని పలువురు ఆదివాసీలు పెదవిరుస్తున్నారు. జీవనోపాధి కోసం పోడు సాగు చేసుకుంటూ ఉంటే ఆ పోడు సాగులో కేవలం కొర్రలు, జొన్నలు సాంప్రదాయ పంటలే పండించాలని మిర్చి, పత్తి, పామాయిల్ వంటి పంటలు పండిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆదివాసీలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పోడు భూములలో బోరు బావులు నిర్మించుకోవచ్చు అని అనుమతులు ఇవ్వగా అట్టి అనుమతులతో కూర్నపల్లి, బోధనెల్లి, దానవాయిపేటకు చెందిన సుమారు 300 మంది రైతులు బోరుబావులు నిర్మించుకునేందుకు ప్రయత్నించగా ఫారెస్ట్ అధికారులు దానికి నిరాకరించడంతోపాటు మండల కేంద్రంలో ఉన్న రేంజర్ కార్యాలయంలో మండల ఆటవీ శాఖ అధికారిని కలిసి అనుమతి తీసుకోవాలని బెదిరించినట్లు తెలుస్తోంది. మండల అధికారి కదా అనే గౌరవంతోనే అటవి శాఖ కార్యాలయంకి వెళ్తే అక్కడ భద్రాచలం ఎఫ్డిఓ, మండల అటవీ శాఖ అధికారి ఇతర అధికారులు ఆదివాసీల పట్ల ప్రవర్తించిన తీరు చాలా హేళనగా ఉందని పలువురు రైతులు తమ గోడును నవతెలంగాణ ముందు వెళ్లగక్కారు. బోరు బావులు నిర్మించుకోండి కానీ విద్యుత్ సౌకర్యం లేకుండా సోలార్‌తో సాగునీటి లిఫ్టు చేసుకోవాలని విద్యుత్తు లైను ఏర్పాటు చేసుకుంటే ఆయా ఆదివాసీలపై కేసులు పెట్టించి జైలుకు పంపిస్తామని ఎఫ్డిఓ బెదిరించడంతో ఆదివాసీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆయా పోడు భూములలో ఎటువంటి వాణిజ్య పంటలు సాగు చేయకుండా సాంప్రదాయ పంటలే సాగు చేయాలని అలా కాక వాణిజ్య పంటలు పండిస్తే ఆ యా రైతులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలు పాలు చేస్తానని ఎఫ్‌డీఓ హెచ్చరించడం చాలా బాధాకరంగా ఉందని ఆదివాసీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క ప్రభుత్వం పోడుసాగుదారులకు అన్ని వసతులు కల్పిస్తామని రైతే రాజు అని ప్రలోభాలు పలుకుతూ ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఫారెస్ట్ అధికారుల జులుం తారాస్థాయికి చేరుకుందని పలువురు ఆదివాసీలు వాపోతున్నారు.

పనికిరాని పోడు పట్టాలు ఎందుకు ఇచ్చారు

సోడి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్, కుర్నపల్లి



ఎటువంటి పంటలు పండించు కోవడానికి అవకాశం లేని పనికిరాని పోడు పట్టాలు మాకు ఎందుకు ఇచ్చారు. మా ఆదివాసీల ఓట్లు అప్పనంగా వేపించుకొని మమ్మల్ని పాలకులు నట్టేట ముంచుతున్నారు. పీవో మా గోడు వినండి. మీరు బోరు బావుల నిర్మాణం చేసుకోమని అనుమతి ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు అన్నిటికీ ఆంక్షలు పెడుతున్నారు. మమ్మల్ని కొర్రలు, జొన్నలు వంటి పంటలు పండించుకుని అవే తినాలని హేళనగా మాట్లాడిన భద్రాచలం ఎఫ్‌డీఓ పై చర్య చేపట్టాలి. మా గోడు అరణ్య రోదనగా మారింది. కలెక్టర్ సార్ సైతం ఈ విషయమై దృష్టి సారించి మాకు న్యాయం చేకూర్చాలి.

ఆదివాసీలు కొర్రలు, జొన్నలే తినాలా..?

నూపా రామకృష్ణ, యువరైతు



ఆదివాసీలమైన మేము కొర్రలు, జొన్నలు తప్ప బియ్యం తినొద్దని భద్రాచలం ఎఫ్‌డీఓ హేళనగా మాట్లాడి మా మనోభావాలను దెబ్బతీసింది. అరణ్య ప్రాంతంలో జీవనోపాధి కోసం పోడు వ్యవసాయం చేస్తూ ఉంటే మమ్మల్ని ఉగ్రవాదులుగా చిత్రీకరించి ఎఫ్డిఓ మాట్లాడిన మాటలకు భద్రాచలం పీఓ, కలెక్టర్‌లు చర్యలు చేపట్టాలి. మా పోడు భూములకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించి సాగును మెరుగుపరచి మా అభ్యుదయానికి చక్కని అవకాశం కల్పించాలి నిరుద్యోగులమైన మాకు అనుకూల పరిస్థితులు కల్పించాలి. అలా కాకపోతే మేము పోరాటాలు చేయడానికి వెనకాడము.

సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం

- డిసెంబర్ 31 రోజున విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు
- ఎస్పీ రోహిత్ రాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు ప్రజలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ జిల్లా పరిధిలోని ప్రజలు ప్రశాంతమైన వాతవరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 31 రోజున జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయిన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డిజేలు, అధిక శబ్దం వచ్చే బాక్స్‌లు ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం. ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తులపై, రాళ్ళు వేయడం, అద్దాలను పగలగొట్టడం, మహిళలను ఇబ్బంది పెట్టినా, అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో మూసివేయాలి. మైనర్లకు మద్యం అమ్మకూడదు. ఈ అంక్షలను ఎవరైన అతిక్రమించినా, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఎస్పీ రోహిత్ రాజు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-నేలకొండపల్లి



మానవ సేవే- మాధవసేవ అన్న సూక్తిని మాటల ద్వారా కాకుండా చేతల ద్వారా చేసి చూపిస్తూ తమ సేవా నిరతిని చాటుకుంటోంది చేతనా ఫౌండేషన్. అనేక మంది పేదలకు, అభాగ్యులకు తమ సేవా కార్యక్రమాలతో చేయూతను అందిస్తోంది. పేద, నిరుపేద విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పదో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు పరీక్ష సామాగ్రిని మండల విద్యాశాఖ అధికారి బి.చలపతిరావు పంపిణీ చేశారు. దాతలు దొండపాటి సాత్విక్, శ్రీహాస్ మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చున్నారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డా సీతారామయ్య, ముత్తినేని. సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, దొండపాటి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, సురేష్, వీరబాబు, అమ్మ ఫౌండేషన్ సభ్యులు సైదులు, ఎల్లయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్ రోడ్‌లో గల లెప్రసీ కాలనీలో కుష్టి వ్యాధిగ్రస్తులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా ఉర్దూ ఆఫీస్ తిరుపతిరావు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. కొత్త సంవత్సరం కానుకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జాకోబ్ మాట్లాడుతూ క్రిస్మస్ నూతన సంవత్సర కానుకగా పలు కుటుంబాలకు సహాయ సహకారాలు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు

గీతాంజలి విద్యార్థులను అభినందించిన కలెక్టర్

నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మంనగరం శ్రీనివాస్ నగర్‌లో ఉన్న గీతాంజలి విద్యానికేతన్ విద్యార్థులను కలెక్టర్ ముజమిల్‌ఖాన్ అభినందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ నెలలో సంభవించిన తీవ్రమైన వరదలు వల్ల నష్టపోయిన వారందరిని చూచి చెలించిపోయిన విద్యార్థులు తమ పాకెట్ మనీని అంతా ఒక దగ్గరగా పోగు చేసి భారీ విరాళాన్ని కలెక్టర్కు విరాళంగా అందించారు. దీంతో కలెక్టర్ ఆ విద్యార్థులను అభినందించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రశంసా పత్రాన్ని పాఠశాల మేనేజ్మెంట్ కు పంపించినట్లు పాఠశాల డైరెక్టర్ అప్పారావు, టి.పద్మ, టి.అరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సుధా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరెలు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి పట్టణంలోని సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి తన ట్రస్ట్ ద్వారా పట్టణ పరిధిలోని గుడిపాడుకు చెందిన వితంతులు, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రతియేటా కొత్త యేడాది ఆరంభం సందర్భంగా గత కొన్నేళ్లుగా ఈ విధంగా చీరలు, దుస్తులు పంపిణీ చేయడం జరుగుతోందని సుధారాణి తెలిపారు. మనకున్నంతలో సాటివారికి సాయపడటంలో ఉన్న సంతృప్తి మరింకెందులోనూ దొరకదని సుధారాణి ఈ సందర్భంగా తెలిపారు. యేడాదిలో లెక్కలేనన్ని సార్లు ఏదోఒక ప్రాంతంలో సుధా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను పట్టణ ప్రజలు, సేవలు అందుకుంటున్న ప్రాంతాల ప్రజలు సుధారాణి దాతృత్వాన్ని అభినందిస్తున్నారు.

104 వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల జీతాలు విడుదల చేయాలి

నవతెలంగాణ-ఖమ్మం



అక్టోబర్ 2024 వరకు 104 ఉద్యోగుల జీతాలు అందకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాల కొండలరావు, బి.వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మంలోని కలెక్టరేట్లోని సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా రాష్ట్ర అధికారులకు అనేక సందర్భాలలో విన్నవించుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, అనేక దఫాలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పుడు జీవో నెంబర్ 706 విడుదల చేస్తూ 12 కోట్ల 56 లక్షల రూపాయలను ఈనెల 4వ తేదీన విడుదల చేసిందని, నేటి వరకు వారి అకౌంట్లో జమ కాకపోవడం వలన ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నిసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. అదే విధంగా 104 ఉద్యోగులు ఏజెన్సీ తరఫున పనిచేయడం వలన వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ,డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో 104 ఉద్యోగులను ఇన్‌సిట్యూషన్ చేస్తామని హామీ ఇచ్చిందని, వారిని ప్రభుత్వంలో కలుపుతూ త్వరలో జీవో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చారి, శాంతకుమారి, యాకూబ్ పాషా, కమల, గోపి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-సత్తుపల్లి



అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా సోమవారం సత్తుపల్లిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ మాట్లాడారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ, మండల కార్యదర్శులు కొలికపోగు సర్వేశ్వరరావు, జాజిరి జ్యోతి, నాయకులు సప్పిడి భాస్కర్, బడేమియా, వెంకటేశ్వరరావు, జిలాని, నబీ, బాబు, రామకృష్ణ, చంద్ర, సైదా, వలీ, మీరాజ్, జాని, రమేశ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి: డీపీవో

నవతెలంగాణ-ముదిగొండ



గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శాలత అన్నారు. మండలపరిధిలో బాణాపురం, వల్లభి గ్రామాలలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో నిర్వహించే ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె నిశితంగా పరిశీలించి, అంగన్వాడి టీచర్లతో మాట్లాడి ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో సాంకేతిక లోపాలు ఏమైనా వస్తున్నాయని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వందశాతం పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) వాల్మీకి కిషోర్, పంచాయతీ సెక్రెటరీలు ఎ.రాజు, ఎం.మురళీకృష్ణ, అంగన్వాడి వర్కర్స్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

- **సీఐ జి.అశోక్‌రెడ్డి**

నవతెలంగాణ-అశ్వాపురం



మండలంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారికి డీజేలకు అనుమతి లేదని సిఐ జి.అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లపై ద్విచక్ర వాహనాలతో అతివేగంతో వెళ్లడం, కేకులు కట్ చేయడం లాంటివి చెయ్యొద్దని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికా వద్దని కోరారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించవద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని, అలాగే వాహనాలు కూడా సీజ్ చేస్తామని తెలిపారు. నింధనలు ఉల్లంఘించినన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇబ్బందులకు తలెత్తేలా వ్యవహరిస్తే 100కు డయల్ చేయాలని కోరారు.

ముక్కోటికి ముస్తాబైన భద్రగిరి..!

నేటి నుండి సీతారాముల అధ్యయనోత్సవాలు ప్రారంభం..!

- **నేడు మత్స్య అవతారంలో దర్శనం**
- **భారీగా పెరిగిన రామయ్య ఆదాయం..!**

నవతెలంగాణ-భద్రాచలం రూరల్





భద్రగిరి క్షేత్రాన నేటి నుండి ప్రారంభం కానున్న ముక్కోటి అధ్యయన ఉత్సవాలకు భద్రాద్రి దివ్య క్షేత్రం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా స్వాగత ద్వారాలు ఆకర్షవంతమైన రంగులు విద్యుత్ కాంతులతో ముక్కోటి శోభను సంతరించుకుంది. నేటి నుండి జనవరి 20 వరకు వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవములు శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సీతారాముల ఆలయంతో పాటు భద్రాద్రి పట్టణ పురవీధులలో స్వాగత ద్వారాలు విద్యుత్ కాంతులు తోపాటు నూతన రంగులను అద్ది ఆకర్షవంతంగా భద్రగిరిని సిద్ధం చేశారు. జనవరి 9న గోదారి నది తీరాన నిర్వహించనున్న సీతారాముల తెప్పోత్సవ కార్యక్రమానికి హంస వాహనాన్ని శరవేగంగా సిద్ధం చేస్తున్న అధికారులు పదో తారీఖున జరగనున్న ఉత్తర ద్వార దర్శన కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

నేడు మత్స్యవతారంలో దర్శనమివ్వనున్న రామయ్య...

అధ్యయన ఉత్సవాలలో మొదటి రోజు భద్రాద్రి, సీతారామచంద్ర స్వామివారు మత్స్యవతారంలో భక్తులకు దర్శనం ఇయ్యనున్నారు. శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల వరుసలో మొట్టమొదటి అవతారం మత్స్యవతారం. కాగా ఈ అవతారానికి సంబంధించి రెండు గాధలు పురాణాల్లో ఉన్నాయని భక్తుల విశ్వాసం అందులో ఒకటి జ్ఞాననిధులైన వేదాలను బ్రహ్మ నుండి అపహరించి సముద్రంలో దాగి ఉన్న సోమకారుసునీ సంహరించడానికి మత్స్య అవతారం ధరించి వేదాలను ఉద్ధరించాడని ఒక విశ్వాసం కాగా రెండవది జలప్రళయం నుండి నావలో ఉన్న వైవాసత మనువును సప్త ఋషువులను సృష్టికి అవసరమైన విత్తనాలను ఔషధాలను మత్స్యవతారంలో రక్షించాడని మరో గాధగా భక్తులు చెబుతుంటారు. మత్య అవతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకుంటే కేతు గ్రహ బాధలు తొలిగుతాయని స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో అవతారాల ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అంచనాలతో కావలసిన ఏర్పాట్లను ఆలయ అధికారులు రెవెన్యూ పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాద అవకాశంతో పాటు లడ్డు ప్రసాదం కూడా అందరికీ అందే విధంగా ప్రత్యేక కౌంటర్ ద్వారా విక్రయించనున్నారు.



భారీగా పెరిగిన రామయ్య ఆదాయం..

భద్రాద్రి సీతారాముల ఆదాయం అంతకంతకు పెరుగుతుందని చెప్పాలి. ఆలయ అధికారులు తీసుకుంటున్న సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని స్పష్టమవుతుంది. నవంబర్ 7వ తారీఖున హుండి లెక్కింపు చేపట్టిన అధికారులు అనంతరం మళ్లీ సోమవారం భద్రాద్రి రామయ్య హుండి లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టగా రామయ్య ఆదాయం ఒక కోటి 71,21,321 రూపాయలు రాగా 92 గ్రాముల బంగారం, ఒక కేజీ 485 గ్రాముల వెండి భక్తులు స్వామి వారికి సమర్పించుకున్నారు. అంతేకాకుండా భద్రాద్రి సీతారాములకి విదేశీ నగదు సైతం భారీగానే వచ్చిందని చెప్పాలి. అమెరికా డాలర్లు 923 ఆస్ట్రేలియా 165 డాలర్లు సింగపూర్ 12 డాలర్లు కెనడా 20 విన్లెట్ డాలర్లు ఇంగ్లాండ్ ఐదు పౌండ్లు యూరోప్‌కు చెందిన 10 యూరోస్ మలేషియా కు చెందిన 20 రింగేట్స్ భక్తులు హుండీలో కానుకల రూపంలో చెల్లించుకున్నారని ఆలయ అధికారులు తెలియజేశారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ హుండీ లెక్కింపు చేపట్టిన ఆలయ అధికారులు వచ్చిన నగదు మొత్తాన్ని బ్యాంకులో జమ చేశారు.

జన్నారం గ్రామ సమస్యలు పరిష్కరించాలి..

- **సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం**
- **పంచాయతీ కార్యదర్శికి వినతి**

నవతెలంగాణ-కొణిజర్ల/ఏన్కూర్



మండల పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన జన్నారం గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం అధికారులు చొరవ చూపి తగిన స్థాయిలో నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో మండల పార్టీ బృందం పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు బోరు చెడిపోయి ఐదు రోజుల నుంచి మంచినీరు అందటం లేదని, చేతి పంపు బోర్లు దాదాపు 15 చేతి పంపులు పని చేయడం లేదని, గ్రామంలో సైడ్ డ్రైనేజీ లేక ఇబ్బందుల గురవుతున్నమని ప్రజలు సీపీఐ(ఎం) బృందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బానోతు రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ గ్రామానికి సరఫరా చేసే మంచినీటి బోరు మరమ్మతు చేసి గ్రామస్తులు తాగునీరు అందిస్తామని, అదేవిధంగా పనిచేయని చేతి పంపులు బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషి చేయాలని పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, ఏన్కూర్ మండల కార్యదర్శి దోంతబోయిన నాగేశ్వరావు కోరారు. భవిష్యత్తులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని, ప్రజలందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పర్యటనలో సీపీఐ(ఎం) మండల నాయకులు, డివిజన్ కమిటీ సభ్యులు ఏర్పుల రాములు, మండల నాయకులు స్వర్ణ కృష్ణారావు, జన్నారం శాఖ కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ అడపా రామారావు, బొంతు రాఘవయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 2న డివిజన్ విస్తృత స్థాయి సమావేశం

సీపీఐ(ఎం) వైరా డివిజన్ స్థాయి విస్తృత సమావేశం జనవరి 2న ఏన్కూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. సోమవారం సీపీఐ(ఎం) మండల కార్యాలయంలో డివిజన్ కమిటీ సభ్యులు బానోత్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన వెల్లడించారు. సమావేశానికి డివిజన్ వ్యాప్తంగా పార్టీ మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, తదితర జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి హాజరాయే ప్రతినిధులు ఉదయం 10 గంటలకు ఏన్కూర్ చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) ఏన్కూర్ మండల కార్యదర్శి దోంతబోయిన నాగేశ్వరావు, ఏర్పుల రాములు, గుడ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడితో విద్యార్థి కాలు మొక్కించడం అవమానకరం

- **సీఐటీయూ నాయకులు అర్జున్**

నవతెలంగాణ-అశ్వారావుపేట



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాములుపై మతోన్మాద మూకలు భక్తి ముసుగులో దాడి చేయడాన్ని ఉద్యోగ కార్మికులు, ప్రజాతంత్ర వాదులు, లౌకిక శక్తులు ఖండించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. సోమవారం స్థానిక హమాలీ అడ్డ వద్ద రాములుపై దాడిని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లే కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పాఠశాలలో ఒక విద్యార్థిని లెక్కలు అడిగే సందర్భంగా నిలబెట్టారని, దీనిని మతోన్మాద మూకలు అనేక రకాలుగా చిత్రీకరిస్తూ హెచ్ఎం రాములు పై దాడి చేశారని అన్నారు. ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని రాములు క్షమాపణ చెప్పినప్పటికీ వినకుండా అయ్యప్ప మాల ధరించిన విద్యార్థితో పాటు ఇతర స్వాముల కాళ్ళను ఉపాధ్యాయుడితో మొక్కించటం హేయమైన చర్యని, పాఠశాలలో మతోన్మాదులు ఈ విధమైన అమానుష చర్యలకు పాల్పడడం సరైనది కాదని అన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఈ చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యేసు, నాగేంద్రరావు, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు గొడవలు చేస్తే గ్రామ బహిష్కరణ

- **నేరాల సంఖ్య తగ్గింది : డీఎస్పీ**

నవతెలంగాణ-ఇల్లందు



నూతన సంవత్సరం సంక్రాంతి సందర్భంగా గ్రామాలు పట్టణం వివిధ సెంటర్లలో రౌడీషీటర్లు గొడవలు చేస్తే గ్రామ బహిష్కరణ చేస్తామని డిఎస్పి చంద్రభాను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు ముందస్తు జాగ్రత్తగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి, మద్యం తాగి ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో క్రైమ్ చాలా తగ్గిందన్నారు. తాగిన మైకంలో జరిగిన సంఘటనలు తప్ప కావాలని చేసిన హత్య కేసులు లేవన్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోని పోలీసులు, అధికారుల సమన్వయంతో ఎటువంటి ఘటనలు జరగకుండా చూస్తున్నామన్నారు. న్యూడెమోక్రసీ పార్టీలో అజ్ఞాత దళ సభ్యులు లేకుండా నిర్మూలించినట్లు పేర్కొన్నారు. డీజె సౌండ్స్, అధిక స్పీడ్‌గా ద్విచక్ర వాహనాల నడిపితే తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇల్లందు సిఐ బత్తుల సత్యనారాయణ, సందీప్, నాగులు మీరా, సూర్య ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు లేకుంటే... యూపీఐ పేమెంట్ అయినా ఓకే..!

- **బరితెగించిన బహిరంగ అవినీతి**

నవతెలంగాణ-దమ్మపేట

రైతులు న్యాయంగా ఉచితంగా పొందాల్సిన సేవలకు సైతం ముక్కుపిండి లంచం వసూళ్ల చేస్తూ దమ్మపేట మండల అసిస్టెంట్ సర్వేయర్ అవినీతి నిరోధక శాఖకు చిక్కిన విషయం విదితమే. ఈ సర్వేయర్‌తో పాటు మరో తోడు దొంగ అయిన ఒక మండల రెవెన్యూ అధికారి ఈ ఉచ్చులోంచి అదృష్టవశాత్తు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈఎంఆర్ఐ డిమాండ్‌కు అంగీకరించి లంచం ఇవ్వకపోతే లేని భూవివాదాలు ఉన్నట్లు తన ధృవీకరణలో రాసేస్తాడు. బోరు వేసుకోవాలంటే రూ.2 వేల నుంచి 5 వేలు అక్షరాల ముట్ట చెప్పాల్సిందే. లేదంటే బోరు వేస్తున్న ప్రదేశానికి వెళ్లి వీరంగా వేస్తాడు. బోరు లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని తారా స్థాయిలో బెదిరిస్తాడు. ముందుగా తనకు కప్పం కట్టనందుకు అపరాధ రుసుముతో కలసి రూ.10 వేలకు పైగానే వసూళ్ల చేస్తాడని బాధిత రైతులు వాపోతున్నారు. నగదు సిద్ధంగా లేకపోతే యుపిఐ ద్వారా చెల్లింపులు చేయొచ్చని చాయిస్ ఇచ్చి మరీ లంచం గుంజుతాడని బాధితులు చెబుతున్నారు. సదరు అధికారితో పాటు అతని కుటుంబ సభ్యుల బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్లను పరిశీలిస్తే ఆయన చేసిన అవినీతి తేటతెల్లం అవుతుందని కొంత మంది అంటున్నారు. రైతులను ఈ విదంగా జలగలను మరిపిస్తూ పీల్చేస్తున్న ఇటువంటి అధికారులపై నిస్పక్షపాత విచారణ చేయించాలని రైతులు కోరుతున్నారు. ఈ శిక్షలు మిగిలిన అవినీతి అధికారులకు కనువింపుగా వుండాలనేది రైతుల అభిప్రాయం.

కుట్టు మిషన్ల స్వాహాపై విచారణ చేపట్టాలి

- **మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా**

నవతెలంగాణ-పాల్వంచ

పేద మైనారిటీ మహిళలకు ఆర్థిక స్వావలంభన దిశగా ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషన్లను స్వాహా చేసిన వారిపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి నింధితులను కఠినంగా శిక్షించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి. యాకూబ్ పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి వంద చొప్పున పేద మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేసి, లబ్దిదారుల జాబితా రూపొందించారని, అనంతరం ఎన్నికల కోడ్ నేపద్యంలో ఒక్క పినపాక నియోజకవర్గం తప్ప మిగిలిన నాలుగు నియోజకవర్గాలలో పంపిణీ చెయ్యలేదని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చిన కుట్టు మిషన్లను అధికారులు స్థానిక ఎంపిడిఓ, ఆర్‌డిఓ కార్యాలయాలలో భద్రపరచియుండగా, దురదృష్టవశాత్తు అశ్వారావుపేట ఎంపిడిఓ కార్యాలయంలో భద్రపరిచిన 100 కుట్టు మిషన్లలో సుమారు 18 కుట్టు మిషన్లు మాయమైనట్లు, వాటి విలువ సుమారు రూ.1,80,000 ఉన్నట్లు మా దృష్టికి వచ్చిందని, కావున అధికారులు మాయమైన కుట్టు మిషన్లు ఎక్కడున్నాయో గుర్తించి, మాయం చేసిన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్, జిల్లా కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారులకు లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో కూడా సమగ్ర దర్యాప్తు చేసి ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్లు సరిపడ ఉన్నాయా లేదా అన్నది తేల్చాలని కోరారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవీలాల్ నాయక్ నియామకం

నవతెలంగాణ-పాల్వంచరూరల్

కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధి పాండురంగాపురానికి చెందిన దేవీలాల్ నాయక్ ఎన్నికయ్యారు. నియామక పత్రాన్ని ఎస్టీ సెల్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవి సోమవారం అందించారు. కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి దేవిలాల్ ఎనలేని సేవలందించారు. గత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించారు. అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఫలితంగానే ఇవాళ తనకు ఈ పదవి దక్కిందని దేవీలాల్ నాయక్ విలేకరులకు తెలిపారు. ఈ పదవి తనపై ఎంతో బాధ్యతను పెంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆహర్నిశలు కష్టపడతానని స్పష్టం చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, వైరా శాసనసభ్యులు రాందాస్‌నాయక్, పార్లమెంట్ సభ్యులు రఘురామ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పోదేం వీరయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బెల్లయ్య నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమానికి పాటుపడతానని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవు : సీఐ

నవతెలంగాణ-పినపాక

ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలలో భాగంగా ఎవ్వరూ డీజేలు వినియోగించరాదని, రోడ్లపై రాష్ డ్రైవింగ్ చేయడం రోడ్లపై కేకులు కట్ చేయడం లాంటివి చేయరాదని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం ఆయన ఈ బయ్యారం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా గస్తీ నిర్వహించే పోలీసులకు సహకరించి వారి సూచనలు పాటించగలరన్నారు. శాంతి భద్రతల విషయమై ఎటువంటి సమాచారం ఉన్న డయల్ 100 కి ఫోన్ చేయగలరన్నారు.

అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలి

నవతెలంగాణ-టేకులపల్లి

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానిస్తూ దేవుడికి మొక్కిన పుణ్యముంటదని, అంబేద్కర్‌కి దండం పెట్టడం వల్ల ప్రయోజనం లేదని అనుచిత వ్యాఖ్యానాలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో టేకులపల్లిలో సోమవారం నిరసన చేపట్టారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి (చంద్రన్న వర్గం) బానోత్ ఉక్లా, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీర బ్రహ్మాచారి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్ష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు గుగులోతు రామచందర్, ఎట్టి నరసింహారావు, మాజీ సర్పంచ్ భూక్య కీరియా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

నూతన సంవత్సరం సందర్భంగా నిబంధనలు పాటించాలని టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్ మండల ప్రజలకు సోమవారం విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలలో కేకులు కట్ చేయరాదని, అర్ధ రాత్రుళ్ళు గుంపులు, గుంపులుగా తిరగడం, మోటార్ సైకిళ్ల పై వేగంగా వెళ్లడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేయకూడదని తెలిపారు. పోలీస్ వారికీ సహకరించి కుటుంబ సభ్యులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలని మండల ప్రజలను కోరారు.

కార్మికుల ఉద్యమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు : పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు,

ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన

సమస్యలపై జనవరి 20న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా : తెలంగాణ చేనేత కార్మిక సంఘం రౌండ్‌టేబుల్ నిర్ణయం

- హాజరైన పలు పార్టీలు, వివిధ చేనేత కార్మిక సంఘాల నేతలు
- చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దు
- చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నవతెలంగాణ - ముషీరాబాద్

చేనేత కార్మికుల సమస్యలపై వచ్చే ఏడాది జనవరి 20న జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా, ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్‌లో నిర్ణయించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ చేనేతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్‌కు పలు రాజకీయ పార్టీలు, వివిధ చేనేత కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభ పెద్ద ఎత్తున జరగాలని, ఆ సభలో, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఈ ప్రభుత్వంలోనూ కొన సాగించే విధంగా కార్మికసంఘాలు పోరాటం చేస్తే తాను ముందుంటానని అన్నారు. చేనేత కార్మికులు ఎలాంటి ఆత్మహత్యలూ చేసుకోవద్దని, ప్రభుత్వం మెడలు వంచైనా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. చనిపోయిన కుటుంబాలకు తమవంతు ఆర్థికసాయం చేస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హామీ ఇచ్చారు. సమస్యలపై ఉద్యమించిన వారికి మద్దతు పూర్తిగా ఉంటుందని అన్నారు. చేనేత పథకాలు అమలయ్యే వరకు, ప్రభుత్వం మెడలు వంచే దాకా పోరాడాలని పిలుపునిచ్చారు.

చేనేత కార్మికులకు సీపీఐ(ఎం) మద్దతు : చెరుపల్లి

చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, చేనేత కార్మికుల ఉద్యమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు ఉంటుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చేనేత కార్మిక సంఘం అనేక విధాలుగా పోరాటం చేస్తున్నద న్నారు. కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ వచ్చే విధంగా పోరాడారని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించక తప్పదన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను యధావిధిగా ఈ ప్రభుత్వం కూడా అమలు చేసే విధంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

చేనేత కార్మికుల సమస్యలపై మీరు ఏ ఉద్యమం చేసినా సీపీఐ(ఎం) తరవున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ముందుండి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు ఆత్మహత్యలకు పూనుకోవద్దని ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తూ పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య సలహాదారు కూరపాటి రమేష్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేనేత సమస్యలు పరిష్కారం కాలేదని, కావున పోరాటం చేయాలన్నారు. జనవరి చివరి వారంలో శాసనసభ, శాసనమండలి సభ్యులకు, వినతి పత్రాలు అందించాలని, బడ్జెట్ సమావేశాల సంద ర్భంగా ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో వేలాది మందితో చేనేత గర్జన నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నరసింహారెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, సహాయ కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ , ఆప్కో మాజీ డైరెక్టర్ వీరన్న, చిక్క దేవదాస్, జమ్మికుంట సంఘం అధ్యక్షులు పెండెం సర్వేషం,నల్గొండ జిల్లా చేనేత అధ్యక్షులు కందగట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ నిజమైన దేశభక్తుడు

- మచ్చలేని నాయకుడు
- వ్యక్తిగత అంశాలను రాజకీయ అంశాలతో ముడిపెట్టడం సరికాదు : సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన నిజమైన దేశభక్తుడు మన్మోహన్ సింగ్ అని సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు కొనియాడారు. సోమవారం శాసన సభలో మన్మోహన్ సింగ్‌కు సంతాప తీర్మానంపై ఆయన మాట్లాడారు. వ్యక్తిగత అంశాలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డికి సూచించారు. మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపే కార్యక్రమాన్ని రాజకీయ వేదిక చేయడం సరికాదన్నారు. మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మన్మోహన్ సింగ్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. ఆయన నీతి నిజాయితీలకు నిలువుటద్దమన్నారు. యూపీఏ-1 ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టుల ఒత్తిడితో ప్రజలకు ఉపయోగపడే పలు కీలకమైన చట్టాలను తీసుకురావడంలో మన్మోహన్ సింగ్ పాత్ర చాలా కీలకమని చెప్పారు. భారతదేశ గమనాన్ని మార్చేందుకు కమ్యూనిస్టులు ఇచ్చిన సలహాలను స్వీకరించారన్నారు. ఒక మేధావి మాత్రమే మరొక మేధావిని అర్థం చేసుకుంటారని దానికి పీవీ నరసింహారావు మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించడమే నిదర్శనమన్నారు.

ఆయన విశ్వసనీయతకు మారుపేరనీ, గొప్ప మానవతావాదని చెప్పొచ్చన్నారు. స్థిత ప్రజ్ఞత ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన బతికి ఉన్నప్పుడు మౌనముని అని చాలామంది అపహాస్యం చేయటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరు అతిగా మాట్లాడుతారు గాని చేతల్లో ఏమి చేయరనీ, కొందరు తక్కువగా మాట్లాడినా చేయాల్సిన పనిని నిక్కచ్చిగా చేస్తారనే కోవకు చెందిన వారే మన్మోహన్ సింగ్ అని అన్నారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క స్టైల్ ఉంటుందనీ, ఎదుటివారి స్టైల్‌ని అపహాస్యం చేయడం సరిగాదని సూచించారు. పీవీకి మన్మోహన్ సింగ్‌కి చాలా విషయాల్లో సారూప్యత ఉంటుందన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసన
- దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ- విలేకరులు

అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నేతలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో, నకిరేకల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. చిట్యాలలో అంబేద్కర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేతెపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట స్థానిక కొత్త బస్టాండ్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేటలో స్థానిక కొత్త బస్టాండ్ ఏరియాలో, బస్సుల్లో ప్రయాణికులకు బీజేపీ ఫాసిస్టు విధానాలపై కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. కోదాడ పట్టణంలో నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భద్రాచలం, చర్ల, పినపాక, మణుగూరు, దమ్మపేట, సుజాతనగర్, ఇల్లందు, అశ్వారావుపేట మండలాల్లో అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేశారు.హైదరాబాద్ శాలిబండ చౌరస్తా నుంచి చార్మినార్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి మండలం ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. హనుమకొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి ధర్నా చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

సమ సమాజ స్థాపనకు పోరాడాలి

- సీపీఐ(ఎం) హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి
- హైదరాబాద్‌లో రక్తదాన శిబిరం



నవతెలంగాణ - ముషీరాబాద్

సమ సమాజ స్థాపన కోసం పోరాడాలని సీపీఐ (ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. ఎస్ఎఫ్ఐ 55 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను ఆర్.ఎల్.మూర్తి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి అమరవీరులను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలని కోరారు. లేదంటే ప్రభుత్వాలను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారని హెచ్చరిం చారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు

ఆర్ఎల్ మూర్తి. మాట్లాడుతూ.. 1970లో డిసెంబర్ నెలలో కేరళలోని త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు చేస్తూ.. విజయాలు సాధిస్తూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యా యన్నారు. ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండీ జావేద్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, శ్రీమన్, నాగేందర్, ప్రశాంత్ చరణ్‌శ్రీ, నాయకులు విగ్నేష్, రాజేష్, రజినీకాంత్, సహనా తదితరులు పాల్గొన్నారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం నాయకులు జెండాలు ఆవిష్కరించారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షులు అక్బర్ జెండా ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సంఘం జిల్లా కేవై ప్రణయ్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, వేములపల్లి, దేవరకొండలో ఎస్ఎఫ్ఐ జెండాలను ఆవిష్కరించారు.ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆవిష్కరించారు.

అన్ని వర్గాలకూ అన్యాయం

రుణమాఫీలో మోసం

- రైతు భరోసా పేరిట దగా
- నిజామాబాద్‌కు మంత్రి లేదు.. ఎంపీ ఉన్నా లేనట్టే : కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్సీ కవిత మండిపాటు



నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలూ అన్యాయానికి గురవుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం ఆమె బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దుష్టపరిపాలనకు తెరతీసిందని విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతు భరోసాకు అనేక షరతులతో దగా చేస్తున్నారని అన్నారు. మహిళలకు భద్రత లేదన్న విషయాన్ని డీజీపీ వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం గాలికొదిలేశారని విమర్శించారు. పదేండ్లపాటు ప్రజలను కేసీఆర్ కన్నబిడ్డల్లా చూసుకున్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వానికి రైతుబంధు ఇవ్వాలన్న సోయి లేదని, రైతు కూలీలకూ సాయం చేస్తామని ఇప్పటికీ ఏం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఎప్పుడూ లేనిది కాంగ్రెస్ హయాంలో రెండు పెద్ద ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. శాంతి భద్రతలను భగ్నం చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం విడుదల చేసిందని, పనులు చేయని కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను నరకయాతన పెట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. రీసర్వే చేసే ముందు భూముల వివరాలు తెలియజేస్తూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పై ప్రజలు నమ్మకం కోల్పోయారని, బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలో నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరని, ఎంపీ ఉన్నా లేనట్లే.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదు.. ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారని వ్యాఖ్యానించారు. ఆరు నెలల నుంచి నిజామాబాద్‌కు పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, జాతీయ నాయకుడని చెప్పుకునే షబ్బీర్ అలీ ఇక్కడి నుంచే ఉన్నా కనీసం కమిషనర్‌ను నియమించకపోవడాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేష, జెడ్పీ చైర్మెన్ విఠల్‌రావు, మేయర్ నీతు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఇప్పుడు గుర్తొచ్చారా..?

- బీసీల జపం చేస్తున్న కవిత
- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్



నవతెలంగాణ-కంఠేశ్వర్

అధికారం కోల్పోయాక ఎమ్మెల్సీ కవిత బీసీల జపం చేస్తున్నారని, ఇన్నాళ్లకు బీసీలు గుర్తొచ్చారా అని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీ వర్గాలు కవిత ఉచ్చులో పడొద్దని, బీఆర్ఎస్ పదేండ్ల అధికారంలో ఏనాడూ వారి సంక్షేమం పట్టించుకోలేదని చెప్పారు. నిజామాబాద్ నగరంలోని ఓ హోటల్లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వప్రయోజనాల కోసమే కల్వకుంట్ల కవిత బీసీల జపం చేస్తున్నారని ఆరోపించారు. బీసీలు ఇప్పటికైనా రాజకీయ చైతన్యం తెచ్చుకొని కవిత ఉచ్చులో పడొద్దని సూచించారు. ఎమ్మెల్సీ కవిత కొత్త వేషం కట్టి బీసీల నినాదం అందుకున్నారని, బీసీ వర్గాలకు తాను అండగా ఉండటంతో ఆమెకు పాల్ భయం పట్టుకుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీ నినాదాన్ని ఎంచుకున్నాయని విమర్శించారు. ఆ ఎన్నికల్లో తాము గెలిస్తే.. ప్రజాశాంతి పార్టీ తరవున ప్రతి గ్రామంలో ఉచిత వైద్యం, విద్య ఏర్పాట్లు చేస్తామన్నారు. చనిపోక ముందు డి.శ్రీనివాస్ తనతో మాట్లాడారని, కాంగ్రెస్ పార్టీ బీసీలను పీసీసీ చీఫ్‌గా నియమిస్తూ.. బానిసలుగా మారుస్తోందని అన్నారని ఆరోపించారు. మధుయాష్కీ తనను కలిసిన తర్వాతే రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నాయని విమర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం

- నల్లగొండలో సీపీఐ 100 వసంతాల బహిరంగ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మతతత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్, బీజేపీ నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇందుకు ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. సీపీఐ 100 వసంతాల ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు పాల్గొన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా.. ఆక్సిజన్ పైపులతో వీల్‌చైర్‌లోనే సుధాకర్‌రెడ్డి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీతోపాటు కమ్యూనిస్టు పార్టీ కూడా పోరాటం చేసిందన్నారు. అదే స్ఫూర్తితో మరోసారి బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. వందేండ్ల కింద స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి పార్టీ అని, వలసవాదులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిందని అన్నారు. బీజేపీ గురువు ఆర్ఎస్ఎస్ అని, దాని రాజకీయ విభాగమే బీజేపీ అని చెప్పారు. భారతదేశం మతపరమైన దేశం కావొద్దని, లౌకిక గణతంత్ర, ప్రజాతంత్ర దేశంగా పరిఢవిల్లాలని కమ్యూనిస్టులు ఆనాడు కోరుకున్నారన్నారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సైతం భారతదేశాన్ని మతతత్వ దేశంగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని, హిందూదేశంగా మారితే పెను విపత్తుగా పరిణమిస్తుందని హెచ్చరించారని అన్నారు. అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పి, మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆయన చేయకపోతే ప్రధాని మోడీ తొలగించాలని డిమాండ్ చేశారు. 75 సంవత్సరాల రాజ్యాంగ వార్షికోత్సవాలు జరుపుకుంటున్నప్పటికీ పేదలకు, సామాన్యులకు సమానత్వం, సౌభ్రాతృత్వం ఎక్కడ ఉందని, ఎక్కడ న్యాయం అందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ క్రిస్టియన్లు, ముస్లింపై దాడులు, దళితులు, ఆదివాసీలపై లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దళిత, గిరిజన మహిళలకు, పిల్లలకు భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీలను మోడీ రక్షిస్తున్నారని విమర్శించారు. పేదలు, కార్మిక, రైతులకు మోడీ, బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకమని, అదానీ, అంబానీ లాంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు అనుకూలమని, అందుకే దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని వివరించారు. ప్రధాని మోడీ ఒక వైపు వికసిత్ భారత్ అని చెబుతున్నారని, కానీ పెరిగిన ధరలతో ప్రజలు బాధపడుతున్నారని, వికసిత్ భారత్ ఎక్కడ ఉన్నదని ప్రశ్నించారు.

ప్రతి పల్లె, పట్టణాల్లో ఎర్రజెండా ఎగరాలే..

అంటరానితనానికి వ్యతిరేకంగా కుల, వర్గ రహిత నూతన సమాజం, సోషలిస్టు భారతదేశం కోసం పోరాటం చేయాలని, అదే కమ్యూనిస్టుల ముందు ఉన్న లక్ష్యం అని రాజా అన్నారు. రాష్ట్రంలో ఎర్రజెండా లేని పల్లెలు, పట్టణాలు ఉండరాదన్నారు. భారతదేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి విముక్తి చేసేందుకు ఎర్రజెండా ముందుండి పోరాడాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వి.ఎస్.బోస్ హాజరయ్యారు. వంద వసంతాల ప్రారంభ సభకు నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం స్వాగతం పలకగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్, మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎంఎల్ ఉజ్జిని యాదగిరి రావు, సీపీఐ యాద్రాది భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

- మహిళలపై లైంగికదాడులు, హింసను అరికట్టాలి
- ఇందిరమ్మ ఇండ్లలో ఒంటరి మహిళలకు అవకాశం కల్పించాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వంగా విఫలమైందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. దేశంలో మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న హింస, దాడులను అరికట్టడంలోనూ వైఫల్యం చెందిందని అన్నారు. సిద్దిపేటలో సోమవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి నవీన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వర్క్‌షాప్‌లో మల్లు లక్ష్మి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక 11 ఏండ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే 100% ధరలు పెరిగాయన్నారు. దేశంలో నిత్యం హత్యలు, లైంగికదాడులు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అమలవుతున్న ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు కొంత ఉపశమనం ఉన్నప్పటికీ జనాభాకనుగుణంగా బస్సులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసే ఎత్తడం లేదని, వెంటనే అమలు చేయాలని కోరారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యాన్ని ప్రతి పేద మహిళలకూ కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లల్లో ఒంటరి మహిళలకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలపై, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రానున్న కాలంలో సర్వేలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అత్తిని శారద, ఉపాధ్యక్షులు మంజులత, సహాయ కార్యదర్శులు జాలిగపు శిరీష, ఇప్పకాయల శోభ, నాయకులు సంద బోయిన రాణి, దండు లక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శోభ, నరసవ్వ, మల్లవ్వ, విగ్నేశ్వరి, లావణ్య వరలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి...

శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన ప్రయోగంలో భాగంగా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ-సీ 60 నింగిలోకి దూసుకెళ్లింది. సరిగ్గా సోమవారం రాత్రి 10 గంటల 15 సెకెన్లకు నిప్పులు చిమ్ముతూ మొదటి ప్రయోగవేదిక నుంచి దూసుకెళ్లింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలో అనుసంధానం చేసే బృహత్తర ప్రయోగాన్ని చేపట్టింది. అంతరిక్షంలోనే వ్యోమనౌకలను డాకింగ్, అన్ డాకింగ్ చేయగల సాంకేతిక అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టారు. పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమ నౌకలను అంతరిక్షంలోనే ఒకదానితో ఒకటి డాకింక్ చేయించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఆ టార్గెట్, ఛేజర్ ఉపగ్రహాల బరువు 440 కిలోలు ఉంటుందని ఇస్రో తెలిపింది. భూ ఉపరితలం నుంచి 470 కిలోమీటర్ల ఎత్తున వృత్తాకార కక్ష్యలో 2 వ్యోమ నౌకలు స్వతంత్రంగా ఏకకాలంలో డాకింగ్ అయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. చంద్రుడిపై వ్యోమగామిని దించడం, జాబిల్లి నుంచి మట్టిని తీసుకురావడం, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించాలన్న భారత్ కల సాకారం కావాలంటే.. వ్యోమ నౌకల డాకింగ్, అన్ డాకింగ్ సాంకేతికత ఎంతో అవసరమని ఇస్రో పేర్కొంది. ఈ ప్రయోగం విజయవంతమైతే... ఈ సాంకేతికతను కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఇప్పటికే అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈ సాంకేతికతను కలిగి ఉన్నాయి.



తన రాతను తిరిగి రాయడానికి

మనాలికి చెందిన టెన్జిన్ డోల్మా 15 ఏండ్ల వయసులో వివాహం చేసుకుంది. 30 ఏండ్ల వయసులో పరుగు ప్రారంభించింది. హిమాలయాల్లో అత్యంత భయంకరమైన మారథాన్‌లలో కొన్నింటిని గెలుచుకుని తన పట్టణంలోని ఏకైక మహిళా మారథానర్‌గా నిలిచింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఆసియాలోనే ఎత్తైన గ్రామమైన కోమిక్‌లో జన్మించిన డోల్మా పేదరికంతో పోరాడుతున్న ఆ కుటుంబంలోని నలుగురు తోబుట్టువులలో చిన్నది. బాల్య వివాహం వల్ల అవకాశాలను పోగొట్టుకునే చాలా మంది మహిళల్లా కాకుండా డోల్మా తన రాతను తానే తిరిగి రాసుకుంది. అత్తమామల రూపంలో ఆమెకు ఓ సహాయక వాతావరణం కనిపించింది. ఏడేండ్ల కిందట మనాలిలో 21కె మారథాన్ చేయాల్సిందిగా స్నేహితురాలు సలహా ఇచ్చినప్పుడు డోల్మా ఎంతో ఇష్టంగా తన పేరు నమోదు చేసుకుంది. ఆ రేసులో ఆమె పోలీసు కుటుంబాల నుండి వచ్చిన మహిళలతో సహా అనుభవజ్ఞులైన రన్నర్లను ఓడించింది. అంతేకాదు హెల్ అల్ట్రాను సమయ పరిమితిలో పూర్తి చేసిన మొదటి మహిళగా అవతరించింది. ఇదే ఆమెను సముద్ర మట్టానికి 10,000 అడుగుల ఎత్తులో జరిగిన క్రూరమైన రేసు లాహౌల్‌లోని స్నో మారథాన్‌కు తీసుకెళ్లింది.

స్ఫూర్తినిచ్చే జీవితాలు

ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోతోంది. ఏడాదికేడాది సాధికారత దిశగా మహిళలు పరుగులు తీస్తూనే ఉన్నారు. మహిళా వ్యాపారవేత్తలుగా తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటున్నారు. సామాజిక అసమానతలను సవాల్ చేస్తూ సమానమైన ప్రపంచాన్ని సృష్టించేందుకు శ్రమిస్తూనే ఉన్నారు. స్టార్టప్‌ల నుండి సామాజిక మార్పుకై ఉద్యమాలు నడిపిన మహిళల సాహస గాథలు మనచుట్టూ ఎన్నో ఉన్నాయి. ఈ ఏడాది కొత్త ఆవిష్కరణలకు వారు నిదర్శనంగా నిలిచారు. కలలు కనే ప్రపంచం కోసం అసమాతలను ధిక్కరించే స్వరాలుగా వెలిశారు. 2024ను మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చే ఏడాదిగా మార్చిన వారి చిరుపరిచయాలు నేటి మానవిలో...

వయసు అడ్డంకులు బద్దలు కొట్టి

డెబ్బై రెండేండ్ల విజి వెంకటేష్... ది మ్యాక్స్ ఫౌండేషన్‌కు భారతదేశంతో పాటు దక్షిణాసియాకు రీజియన్ హెడ్‌గా ఉన్నారు. ఇది లాభాపేక్షలేని సంస్థ. భారతదేశంలోని క్యాన్సర్ కేర్ కమ్యూనిటీకి మూలస్తంభం. ఈ రంగంలో ఆమెకు 35 ఏండ్ల అనుభవం ఉంది.



2002 నుండి ఈమె ది మాక్స్ ఫౌండేషన్‌లో పనిచేస్తున్నారు. గ్లివెక్ ఇంటర్నేషనల్ పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రాంకు నాయకత్వం వహిస్తున్నారు. స్థానిక నోవార్టిస్ ఆంకాలజీ యాక్సెస్ ప్రోగ్రామ్‌లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. గత ఏడాది ఈమె అఖిల్ సత్యన్ దర్శకత్వంలో నటుడు ఫహద్ ఫాసిల్‌తో కలిసి 'పచ్చుం అల్భుతావిలక్కుమ్' చిత్రంతో ఆమె సినీ రంగ ప్రవేశం కూడా చేశారు.

వైరల్ దాదీలు

50 ఏండ్లు పైబడిన ఏడుగురు మహిళలతో కూడిన ఓ వీడియో ఈ ఏడాది ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాది మంది వీక్షకుల హృదయాలను దోచుకుంది. వారే బాలీవుడ్ చిత్రం బాడ్ న్యూజ్‌లోని తౌబా తౌబా పాటకు నృత్యం చేసిన మహిళలు. కర్ణాటకలోని బెల్గామ్‌లో ఒక సాధారణ వృద్ధాశ్రమం వలె ప్రారంభమైనది శాంతై వృద్ధాశ్రమం. ఇప్పుడు భారతదేశం అంతటా ఖ్యాతిని పొందింది. దానికి కారణమైన ఈ వృద్ధ మహిళలకు ధన్యవాదాలు చెప్పాల్సిందే. వారు తమ నృత్య కదలికలతో సోషల్ మీడియాలో ప్రసిద్ధ పాటలకు నృత్యం చేస్తూ తమ యవ్వనాన్ని పునరుజ్జీవింపజేస్తున్నారు. వారిని ఇప్పుడు ఇంటర్నెట్‌లో "వైరల్ దాదీలు" అని పిలుస్తున్నారు. దాదీ అంటే హిందీలో అమ్మమ్మ. గత సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఇన్‌స్టాగ్రామ్ ఛానెల్ ప్రస్తుతం 37,000 మంది ఫాలోవర్లను కలిగి ఉంది. అనేక మంది యువ సోషల్ మీడియా వినియోగదారులతో పాటు ప్రముఖులు వారికి మద్దతు ఇస్తున్నారు.



నటనతో పాటు...

సినిమాకి అతీతంగా నటి సమంతా రూత్ ప్రభు... నటనతో పాటు D2C ఫ్యాషన్ ప్రపంచంలోకి కూడా అడుగు పెట్టింది. నోరిష్ యుతో సహా బ్రాండ్‌ల సీడ్ ఫండింగ్ రౌండ్‌లలో కూడా పాల్గొంది. ఇటీవలె వెల్‌నెస్ స్టార్టప్, సీక్రెట్ ఆల్కెమిస్ట్‌లో సహ వ్యవస్థాపకురాలిగా పెట్టుబడి పెట్టింది. జుట్టు పెరుగుదల, కీళ్ల నొప్పులు, చర్మ సంరక్షణ కోసం ఈ సంస్థ నూనెలను ఉత్పత్తి చేస్తోంది. 'నేను ఈ ఉత్పత్తులను నమ్ముతున్నాను. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజానికి మంచి చేసే బ్రాండ్‌లలో భాగం కావడం చాలా అవసరం. అర్థవంతమైన ప్రభావాన్ని చూపే ఆలోచనలు, బ్రాండ్‌ల విషయంలో నేను సంతోషిస్తున్నాను. అయితే నా ఆశయాలు గొప్ప ఉద్దేశ్యంతో ముడిపడి ఉండాలి. అర్థవంతమైన ప్రభావాన్ని చూపాలి' అంటుంది సమంతా రూత్.





స్టీమ్‌లో మహిళలకు సాధికారత

ఫెమినిస్ట్ అప్రోచ్ టు టెక్నాలజీ అనే సంస్థను 2007లో లింగ సమానత్వం కోసం తన గొంతు విప్పిన న్యాయవాది గాయత్రి బురగోహైన్ స్థాపించారు. మహిళల జీవితాలను రూపొందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని ఆమె గుర్తించారు. 'మహిళలు సాంకేతిక నైపుణ్యాలను కలిగి ఉంటే, సామాజిక అడ్డంకులను ఛేదించగలరు, స్వాతంత్ర్యం పొందగలరు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో తమ గొంతులను నొక్కి చెప్పగలరు' అని నమ్మే గాయత్రి ఈ లాభాపేక్ష రహిత సంస్థ స్థాపించారు. ఏండ్లుగా ఇది మూడు ప్రధానమైన లక్ష్యలతో పని చేస్తుంది. అవే యంగ్ ఉమెన్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్, గర్ల్స్ ఇన్ స్టీమ్ ప్రోగ్రామ్, కలెక్టివిజేషన్ ఇనిషియేటివ్. మహిళా సాధికారత కోసం పని చేస్తున్న ఈ సంస్థకు పూణేతో పాటు చుట్టుపక్కల ఉన్న పట్టణ మురికివాడలు, గ్రామీణ ప్రాంతాలు, ఢిల్లీలోని లజ్‌పత్ నగర్, జార్ఖండ్‌లోని గిరిదిహ్, పాట్నా, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలలో సాంకేతిక కేంద్రాలు ఉన్నాయి.





వైకల్యాన్ని జయించింది

గీతా కన్నన్ పోలియోతోపాటు నీటి భయంతో పెరిగింది. శరీర కదలికలపై నియంత్రణను తిరిగి పొందడానికి మూలకంతో స్నేహం చేసింది. తన వైద్యం కోసం చేసిన ప్రయాణంలో నీటితో అనుబంధం ఏర్పడింది. ప్రస్తుతం 43 ఏండ్ల వయసులో చెన్నైకి చెందిన ఈమె పారాలింపిక్ స్విమ్మింగ్ ఛాంపియన్. ఈ ఏడాది మార్చిలో జరిగిన తమిళనాడు రాష్ట్ర స్థాయి పారాలింపిక్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఇద్దరు పిల్లల తల్లి అయిన ఈమె దక్షిణ చెన్నై శివారులోని తాంబరంలోని తన ఇంటి నుండి పెరియమేడు వరకు ప్రతిరోజూ 34 కిలోమీటర్లు ప్రయాణిస్తోంది. ఇందులో రాంప్, కుర్చీ లిఫ్ట్‌తో కూడిన ఏకైక కొలను ఉంది. ఈ కుర్చీ లిఫ్ట్ ఆమె నీటిలోకి, బయటికి రావడానికి సహాయం చేస్తుంది. అనేక మంది పారా స్విమ్మర్లు, ఔత్సాహికులకు గీత గేమ్ ఛేంజర్‌గా మారారు.



యక్షగానాన్ని ముందుకు తీసుకెళుతూ...

బెంగళూరులో పెరిగిన ప్రియాంక మోహన్ చిన్నప్పటి నుండి యక్షగానమే ప్రపంచంగా బతికింది. ఎందుకంటే ఆమె ఇల్లు యక్షగాన కళాకారులకు ఓ కేంద్రం. తండ్రి యక్షగాన ఔత్సాహికుడు. ఆ కళా రూపాన్ని ప్రోత్సహించేవారు. నగరంలో ప్రదర్శనలు ఇవ్వడానికి దక్షిణ కన్నడ నుండి కళాకారులను తీసుకువచ్చేవారు. కళపై తండ్రి ప్రేమను చూసి ప్రియాంక కూడా యక్షగానానికే అంకితమయ్యింది. అయితే ఆమె 10వ తరగతి తర్వాత కళకు కొంత విరామం ఇచ్చింది. ఆ విరామ సమయంలోనే కళకు విలువ కట్టి, సరికొత్త దృష్టి కోణంతో చూడటం మొదలుపెట్టింది. ఇప్పుడు యక్షగానాన్ని ప్రదర్శించే, నేర్పించే అతికొద్ది మంది మహిళల్లో ప్రియాంక కూడా చేరిపోయింది. తండ్రి ప్రారంభించిన యక్షదేగులతో కళను ముందుకు తీసుకెళుతోంది.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటాం

(మొదటిపేజి తరువాయి)

సందర్భంగా ఆయన సీఎంతో చర్చించారు. నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్టు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో రేవంత్ దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. సర్కార్ చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటనీ, ప్రస్తుతం 10 వేల మందికి ఉపాధి కల్పిస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందనీ, హైదరాబాద్‌తోపాటు తెలంగాణవ్యాప్తంగా ఆ సంస్థ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐతో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థ అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులను అందుబాటులో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని రేవంత్ వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

(మొదటిపేజి తరువాయి)

టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా సిహెచ్.రాములు, సోమశేఖర్, ఎం.రాజశేఖర్ రెడ్డి, వి.శాంతి కుమార్, జి.సమ్మారావు, డి.సత్యానంద్, జి.నాగమణి, బి.రాజు, కె.రంజిత్ కుమార్, ఎస్.రవి, ప్రసాద్‌గౌడ్, మల్లారెడ్డి, కె.రవికుమార్, జి.శ్రీధర్, ఎ.సింహాచలం, వెంకటప్పను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మస్తాన్‌రావు, కృష్ణయ్య వ్యవహరించారు. నూతన కమిటీని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభినందించారు.

తెలంగాణ ఆత్మబంధువు

(మొదటిపేజి తరువాయి)



పెట్టుకుంటారు. దేశానికి మన్మోహన్ చేసిన సేవలు చిరస్మరణీయం. అందువల్ల ఆయనకు భారత రత్న ఇవ్వాలని తీర్మానిస్తున్నాం. పార్టీలకతీతంగా మన్మోహన్‌సింగ్ పట్ల ఏకాభిప్రాయం వ్యక్తం చేయాల్సిన అవసరం ఉంది. ఆయనకు, జైపాల్ రెడ్డికి ఎంతో సన్నిహిత సంబంధం ఉంది. ఆయన నాయకత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్. అలాంటి మహానుభావుడి విగ్రహాన్ని హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆయన విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో సభ్యుల సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నాం. తెలంగాణ గడ్డపై మన్మోహన్ సింగ్ విగ్రహం పెట్టడం సముచితం అని మేం భావిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో ఆయన సతీమణి తనతో మాట్లాడారనీ, తెలంగాణ పట్ల ఆయన ఆసక్తిగా ఉండేవారంటూ ఆమె చెప్పారని సీఎం గుర్తు చేసుకున్నారు. కుటుంబాన్ని, పిల్లలను గొప్ప విలువలతో తీర్చిదిద్దారనీ, దేశ యువతకు ఆయన జీవితం ఆదర్శప్రాయమని చెప్పారు. ఆర్థికంగా, రాజకీయంగా, సాంకేతికంగా దేశాన్ని ముందుకు నడిపించడంలో మన్మోహన్‌సింగ్ కృషి మరువలేనిదని రేవంత్ ఈ సందర్భంగా నివాళులర్పించారు.

గుదిబండగా మెట్రోలు !

(మొదటిపేజి తరువాయి)

శాటిలైట్ నగరాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 20 దాటుతుంది) మెట్రోలు పరుగులు తీస్తున్నాయి. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న లేదా అనుమతి పొందిన లేదా సుమారు పాతిక నగరాల్లో ప్రతిపాదనలు సిద్ధమైన దశల్లో మరో వెయ్యి కిలోమీటర్ల మెట్రో ట్రాక్ ఉంది. అయితే ఇంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య మాత్రం నిరాశాజనకంగా ఉంటోంది.

దూర ప్రయాణాలకే అనుకూలం

మెట్రో రైళ్లు ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంటాయి. పర్యావరణహితమైనవి. అయినప్పటికీ ప్రయాణికులను ఆకర్షించడంలో సబర్బన్ మెట్రో రైళ్లు విఫలమవుతున్నాయి. దానికి కారణం పట్టణ ప్రాంత వాసుల్లో అనేక మందికి మెట్రోల అవసరం లేకపోవడమే. ప్రయాణ దూరం తక్కువగా ఉన్న చోట మెట్రో అవసరం పెద్దగా ఉండడం లేదు. మన దేశంలో ఈ దూరం చాలా చోట్ల తక్కువగానే ఉంటోంది. తమ ఇంటికి సమీపంలో అందుబాటులో ఉన్న ప్రయాణ సౌకర్యాల వైపే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతారు. 'భారతీయ నగరాల్లో జనాభా ఎక్కువ. కాబట్టి ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. ప్రజలు అధిక సంఖ్యలో మెట్రోలను ఉపయోగిస్తారని అనుకోవడం అవాస్తవం' అని ఢిల్లీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఛైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గీతం తివారీ చెప్పారు. దూర ప్రాంత ప్రయాణాలకు మెట్రో తరహా వ్యవస్థలు ఆకర్షణీయంగా ఉంటాయని, అయితే లక్నో, జైపూర్, కొచ్చి, తదితర నగరాల్లో సైతం ఆరేడు శాతం మంది కంటే ఎక్కువగా దూర ప్రాంత ప్రయాణాలు చేయడం లేదని ఆయన తెలిపారు.

డిమాండ్ లేక వెలవెల

'ఏదైనా నగరంలో మెట్రో వ్యవస్థను విస్తరించినప్పటికీ అది ఎక్కువ మందికి ఉపయోగపడదు. ఎందుకంటే కొన్ని పెద్ద నగరాల్లో మాత్రమే దూర ప్రయాణాలు ఉంటాయి. కాబట్టి వ్యవస్థను విస్తరించినప్పటికీ ప్రయాణికుల సంఖ్య పెద్దగా పెరిగేదేమీ ఉండదు' అని తివారీ చెప్పారు. రాజధాని ఢిల్లీలోని కొన్ని మెట్రో కారిడార్ల పనితీరు బాగుంది. అయితే చెన్నయ్ వంటి పెద్ద నగరాల్లో సైతం ముందుగా అంచనా వేసిన డిమాండ్‌లో నాలుగో వంతో లేక ఎనిమిదో వంతో ఉంది. నెలో లేదా రెండు నెలలో డిమాండ్ లేకపోవడం కాదు. మెట్రో సర్వీసులు మొదలై సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా డిమాండ్ తక్కువగానే ఉంటోంది.

ఖర్చు అధికం... ఆదాయం స్వల్పం

2014-2022 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం మెట్రో రైల్ ప్రాజెక్టుల కోసం రూ.90,000 కోట్లు విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల్లోని చిన్న చిన్న నగరాలు సైతం మెట్రో రైళ్లు కావాలని కోరుతున్నాయి. దీనికి ప్రధాన కారణం వాటిలో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానమే. ఆర్థికంగా లాభదాయకంగా లేకపోయినా రాష్ట్రాలు మెట్రోల వైపే చూస్తున్నాయి. అవి ఉంటే రాష్ట్రానికి గర్వకారణమని భావిస్తున్నాయి. మరోవైపు పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉపయోగించే బస్సుల సంఖ్య తగ్గిపోతోంది. కిలోమీటరు దూరం మెట్రోను నిర్మించాలంటే రూ.500 కోట్లకు పైగానే ఖర్చవుతుంది. ఇంత ఖర్చు చేసినా ఢిల్లీ, మెట్రో వంటి నగరాల్లో ఆ కిలోమీటరు ప్రయాణం రోజూ కేవలం 10,000 నుండి 20,000 వేల మందికి మాత్రమే ఉపయోగపడుతోంది. అదే ఆ ఐదు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ఐదు వందల నాణ్యమైన మెట్రో వంటి బస్సులు వస్తాయి. అవి రోజూ నాలుగైదు లక్షల మందిని గమ్యస్థానాలకు చేరుస్తాయి.

బస్సుల సంఖ్యనూ పెంచాలి

పైగా మెట్రో రైళ్లకు అనుసంధానంగా ప్రయాణికుల కోసం బస్సులు నడపాల్సి వస్తోంది. అరవై కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని నిర్మిస్తే అది 60 చదరపు కిలోమీటర్ల పరిధిలో ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. కానీ నగర విస్తీర్ణం ఐదు వందల నుండి వెయ్యి చదరపు కిలోమీటర్ల వరకూ ఉంటుంది. అలాంటప్పుడు అవి ప్రజలకు విస్తృత సేవలు ఎలా అందించగలవు? కేవలం మెట్రోలపై ఆధారపడితే సమస్య పరిష్కారం కాదు. ఉదాహరణకు బెంగళూరులో మెట్రోను ప్రవేశపెట్టడానికి ముందు బస్సుల సంఖ్యను పెంచలేదు. ఇప్పుడు బస్సు ప్రయాణికుల సంఖ్య పడిపోయింది. అటు మెట్రో ప్రయాణికులూ పెరగలేదు. ఫలితంగా రోడ్లపై ద్విచక్ర వాహనాల జోరు కన్పిస్తోంది. కాబట్టి చౌకగా అందుబాటులో ఉండే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి.

వైద్య బీమా కంపెనీల దోపిడీ

నవతెలంగాణ- బిజినెస్ డెస్క్

దేశంలోని పలు వైద్య బీమా కంపెనీలు పాలసీదారుల క్లెయిమ్‌లను పరిష్కరించకుండా.. ఓ విధంగా దోపిడీకి పాల్పడుతున్నాయి. బీమా ఇచ్చే సమయంలో క్యాష్‌లెస్, మొత్తం మేమే భరిస్తామని చెప్పుతూ పాలసీలు చేయిస్తున్న సంస్థలు.. ఆ తర్వాత పాలసీదారు అనారోగ్యంతో హాస్పిటల్ పాలు అయితే చెల్లింపుల్లో కొసర్లు, కోతలు పెట్టడమే కాదు.. కొన్ని సార్లు పూర్తిగా తిరస్కరిస్తున్న ఘటనలు అమాంతం పెరిగాయి. ఇన్సూరెన్స్ రెగ్యూలేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) రిపోర్ట్ ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో విలువ పరంగా 29 శాతం క్లెయింలు తిరస్కరణకు గురైయ్యాయి. దీంతో పాలసీదారులపై రూ.16,000 కోట్ల పైగా భారం పడింది. తాము చేసుకున్న బీమా తిరస్కరణకు గురి కావడంతో ఈ మొత్తాన్ని వారు తమ జేబు నుంచి భరించాల్సి వచ్చింది. దీంతో తమకు హామీకి తగ్గట్లుగా సేవలు అందలేదని అంబుడ్స్‌మెన్‌కు 34,000కు పైగా ఫిర్యాదులు అందాయి. అంటే బీమా కంపెనీల పనితీరు స్పష్టమవుతోంది.

దేశంలోని ఆరోగ్య బీమా సంస్థలు మొత్తం ఫైల్ అయిన క్లెయిమ్‌లలో 71.3 శాతం విలువైన క్లెయిమ్‌లను మాత్రమే పరిష్కరించాయి. 2023-24లో దాదాపు రూ.1.2 లక్షల కోట్ల విలువైన క్లెయిమ్‌లు ఫైల్ అయ్యాయి. వాటిలో రూ.1.1 లక్షల కోట్ల విలువైన 3 కోట్ల కొత్త క్లెయిమ్‌లు, అంతక్రితం సంవత్సరాలకు సంబంధించిన రూ.6,290 కోట్ల క్లెయిమ్‌లు ఉన్నాయి.

మొత్తం క్లెయిమ్‌లలో రూ.83,493 కోట్ల విలువైన 2.7 కోట్ల క్లెయిమ్‌లను బీమా సంస్థలు పరిష్కరించాయి. సంఖ్యా పరంగా 82 శాతం క్లెయిమ్‌లు పరిష్కరించగా, విలువ పరంగా 71.3 శాతం చెల్లింపులు జరిగాయి. ఇందులో తమ షరతులకు అనుగుణంగా లేవని రూ.15,100 కోట్ల విలువ చేసే వైద్య బీమా క్లెయిమ్‌లను నిరాకరించాయి. అదనంగా రూ.1,093 కోట్ల విలువైన 3.6 లక్షల పాలసీలు తిరస్కరించబడ్డాయి.

పెండింగ్‌లో 6.4 శాతం క్లెయిమ్‌లు

రూ.7,584 కోట్ల విలువైన 6.4 శాతం క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. 2023-24లో బీమా సంస్థలు రూ.1.1 లక్షల కోట్ల విలువైన ఆరోగ్య బీమా ప్రీమియాలు వసూలు చేశాయి. ఇందులో ప్రయివేటు బీమా సంస్థలు రూ.34,503 కోట్లు వసూలు చేశాయి. ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు రూ.40,993 కోట్లు వసూలు చేశాయి. స్టాండ్అలోన్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.32,180 కోట్ల ప్రీమియంలను నమోదు చేశాయి.

ప్రభుత్వ సంస్థలు భేష్..

దేశంలోని 20 ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు గతేడాది 2023లో 80 శాతం లోపే క్లయిమ్ మొత్తం చెల్లింపులు చేశాయని ఇటీవల ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) ఒక రిపోర్ట్‌లో తెలిపింది. వైద్య బీమా చెల్లింపులు, పరిష్కారాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరును కనబర్చాయి. గరిష్ఠంగా 98 శాతం మేర చెల్లింపులు చేసిన సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ మాత్రం ఏకంగా 98.74 శాతం మొత్తం చెల్లిస్తూ టాప్‌లో ఉండటం విశేషం.

మరో పీఎస్‌యూ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కూడా సగటున 97.35 శాతం మొత్తాన్ని చెల్లించింది. ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో సగటున 71.35 శాతం మొత్తం క్లెయిమ్ చెల్లింపులు చేసింది. ఐసీఐసీఐ లంబార్డ్ 63.98 శాతం చెల్లించగా.. ఈ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టార్ హెల్త్ మాత్రం 54.61 శాతం క్లెయిమ్ చెల్లింపులు చేయడం గమనార్హం. ఆరోగ్య బీమా వ్యాపారంలోని 29 బీమా సంస్థలలో కేవలం నాలుగు బీమా కంపెనీలు మాత్రమే 2023 సంవత్సరంలో 90 శాతం కంటే ఎక్కువ క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తిని (క్లెయిమ్‌ల సంఖ్యపై) కలిగి ఉన్నాయి. దాదాపు పది బీమా సంస్థలు 80 శాతం కంటే తక్కువ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను కలిగి ఉన్నాయి.

ఉపాధ్యాయునిపై మతోన్మాదుల దాడి అత్యంత హేయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై మతోన్మాద మూకలు దాడికి పాల్పడడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితుడైన ఉపాధ్యాయుడు కంబలి రాములు తరగతి గదిలో ఒక విద్యార్థిని లెక్కలు అడుగుతూ నిల్చోబెట్టగా.. ఈ సందర్భాన్ని సోషల్ మీడియాలో వ్యక్రీకరిస్తూ మాల వేసుకున్న విద్యార్థిని నిలబెట్టారనే సాకుతో మతోన్మాద మూకలు భక్తి ముసుగులో రాములుపై దాడి చేసి కక్షపూరితంగా కాళ్లు మొక్కించి అవమానపరిచారని పేర్కొన్నారు. ఈ అల్లరి మూకలు తమకుతాము ధర్మరక్షకులుగా చెప్పుకుంటూ గూండాలుగా ప్రవర్తిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. అంబేద్కర్, రాజ్యాంగంపై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం, దాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఖండించకపోవడం తదితర చర్యలన్నీ ఇట్లాంటి మూకలకు మరింత ఊతమిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తమ్మినేని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


(మొదటిపేజి తరువాయి)

ప్రధాని మోడీ కూడా స్పందించడం లేదన్నారు. పెత్తందారీ ధోరణి, అధికార దర్పాన్ని ప్రదర్శించడం శోచనీయమని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వలీ ఉల్లాఖాద్రీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు తేజ మాట్లాడుతూ అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్ర మంత్రివర్గం నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని కోరారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు మనువాదులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శిం చారు. అంబేద్కరిజం, మార్క్సిజం అంటే వారికి కంటగింపుగా ఉందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి హిందూరాజ్యం స్థాపించాలని భావిస్తున్నారని అన్నారు. పార్లమెంటులో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా పక్కదారి పట్టించడంలో భాగంగానే అమిత్‌షా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్, సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, ఎం దశరథ్, ఎం మహేందర్, సీపీఐ నగర నాయకులు స్టాలిన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంధ్య, ఝాన్సీ, అరుణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గాలతో పాటు వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజక వర్గాల ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు స్వీకరించిన అభ్యంతరాల అనంతరం తుది జాబితాను ఖరారు చేసినట్టు ఆయన వెల్లడించారు. గతంలో కంటే మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో 26,782, టీచర్స్ నియోజకవర్గంలో



2,319, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 2,351 ఓటర్లు పెరిగారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ చూడాలని పేర్కొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల తుది జాబితా

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం

ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లు: 499
పురుష ఓటర్లు - 2,18,060
మహిళా ఓటర్లు - 1,23,250
ట్రాన్స్‌జెండర్లు - 3
మొత్తం-3,41,313

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ టిచర్స్ నియోజకవర్గం

ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్‌లు - 274
పురుష ఓటర్లు - 16,364
మహిళా ఓటర్లు - 9,557
మొత్తం- 25,921

వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ నియోజకవర్గ ఎన్నికల వివరాలు

ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్‌లు - 200
పురుష ఓటర్లు - 14,940
మహిళా ఓటర్లు - 9,965
మొత్తం- 24,905



అమెరికా,హైదరాబాద్ ఫ్రెండ్లీ మ్యాచ్!

యుఎస్ఏ, హెచ్‌సీఏ చీఫ్‌ల భేటీలో నిర్ణయం

హైదరాబాద్ : అండర్-19 స్థాయిలో అమెరికా, హైదరాబాద్ జట్లు స్నేహపూర్వక మ్యాచుల్లో తలపడేందుకు అవసరమైన కార్యాచరణ రూపకల్పనకు అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్ వేణు రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ ఓ అంగీకారానికి వచ్చారు. సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమైన వేణు, జగన్‌లు క్రికెట్ అభివృద్ధిపై విస్తృత స్థాయిలో చర్చించారు. హైదరాబాద్, అమెరికా జట్లు స్నేహపూర్వక సిరీస్‌ల కోసం పర్యటించేందుకు త్వరలోనే టూర్ క్యాలెండర్ తయారు చేయాలని భావించారు. వేణురెడ్డితో భేటీలో చర్చించిన అంశాలపై హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అధికారికంగా ప్రకటన చేస్తామని జగన్‌మోహన్‌రావు తెలిపారు.



దీప్తికి 'చిరు' సహాయం

రూ.3 లక్షల నగదు ప్రోత్సాహం అందజేత

హైదరాబాద్ : 2024 పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత స్టార్ పారా అథ్లెట్, తెలంగాణ అమ్మాయి దీప్తి జీవాంజికి కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు చిరంజీవి ఆర్థిక సహాయం అందించారు. సోమవారం గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన ఓ కార్యక్రమంలో దీప్తిని చిరంజీవి ఘనంగా సన్మానించారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. దీప్తి ప్రతిభ, శ్రమకు తగిన గుర్తింపు లభించిందని చిరంజీవి తెలిపారు. జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, చాముండేశ్వరనాథ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చేతులెత్తేశారు

- ఛేదనలో భారత్ 155 ఆలౌట్
- యశస్వి జైస్వాల్ ఒంటరి పోరాటం వృథా
- 184 పరుగులతో ఆసీస్ ఘన విజయం
- 2-1తో టెస్టు సిరీస్‌లో కంగారూల ఆధిక్యం

గెలుపు కోసం ఒక్క రోజులో 400 పరుగులు కొట్టాలంటే..బ్యాటర్లు అందుకు సిద్ధం. డ్రా కోసం ఓ రోజంతా వికెట్లు కాపాడుకునే పరిస్థితికి సైతం బ్యాటింగ్ లైనప్ సిద్ధమే.

కెప్టెన్ రోహిత్ శర్మ చెప్పినట్లు.. మెల్‌బోర్న్‌లో టీమ్ ఇండియా ఈ రెండూ చేయలేదు. విజయానికి అవసరమైన 369 పరుగులు కొట్టలేక, డ్రాకు అవసరమైన డిఫెన్స్ చేయలేక చేతులెత్తేసింది. ఫలితంగా, 12 ఏండ్లలో తొలిసారి భారత్ బాక్సింగ్ డే టెస్టులో పరాజయం పాలైంది. ఆతిథ్య ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 2-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆధిక్యం దక్కించుకుంది. ఈ ఓటమితో డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో టీమ్ ఇండియా ఆశలు గల్లంతయ్యాయి!.

నవతెలంగాణ-మెల్‌బోర్న్





యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (84, 208 బంతుల్లో 8 ఫోర్లు) బాధ్యతాయుత అర్ధ సెంచరీతో చేసిన ఒంటరి పోరాటం వృథా అయ్యింది. రిషబ్ పంత్ (30, 104 బంతుల్లో 2 ఫోర్లు) మినహా మరో బ్యాటర్ రెండెంకల స్కోరు దాటలేదు. 369 పరుగుల భారీ ఛేదనలో భారత్ 79.1 ఓవర్లలో 155 పరుగులకు కుప్పకూలింది. రోహిత్ శర్మ (9), కెఎల్ రాహుల్ (0), విరాట్ కోహ్లి (5), రవీంద్ర జడేజా (2), నితీశ్ కుమార్ రెడ్డి (1) విఫలం అయ్యారు. ఆసీస్ పేసర్లు పాట్ కమిన్స్ (3/28), స్కాట్ బొలాండ్ (3/39) మూడేసి వికెట్లు పడగొట్టగా.. స్పిన్నర్ నాథన్ లయాన్ (2/37), ట్రావిశ్ హెడ్ (1/14) ఆకట్టుకున్నారు. ఆఖరు రోజు ఆట చివరి సెషన్లో ఏకంగా ఏడు వికెట్లు పడగొట్టిన కంగారూలు బాక్సింగ్ డే టెస్టులో మెరుపు విజయం సాధించారు. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కంగారూ కెప్టెన్ పాట్ కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్, ఆస్ట్రేలియా ఆఖరు, ఐదో టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీలో ఆరంభం కానుంది.

జైస్వాల్ ఒక్కడే :

369 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు తేలిపోయారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (84) మరో అర్థ సెంచరీతో మెప్పించాడు. ఛేదనలో డ్రా కోసమే బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియా.. అదే వ్యూహంతో ఆడింది. కెప్టెన్ రోహిత్ శర్మ (9, 40 బంతుల్లో) సహజశైలికి భిన్నంగా ఆడాడు. 40 బంతుల్లో ఒక్క బౌండరీ సాధించలేదు. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ సైతం ఆచితూచి ఆడాడు. దీంతో ఆసీస్ తొలి వికెట్ కోసం 17వ ఓవర్ వరకు వేచి చూడక తప్పలేదు. కమిన్స్‌కు మళ్లీ రోహిత్ వికెట్ కోల్పోయాడు. అదే ఓవర్లో కెఎల్ రాహుల్ (0) సైతం పెవిలియన్ చేరాడు. గుడ్ లెంగ్త్ బంతితో రాహుల్‌ను సైతం కమిన్స్ అవుట్ చేశాడు. అప్పటికి భారత్ స్కోరు 25/2. విరాట్ కోహ్లి (5) లంచ్ విరామం వరకైనా వికెట్ నిలుపుకోలేదు. పాత పద్దతిలోనే ఆఫ్ స్టంప్ ఆవల వెళ్తున్న బంతిని వెంటాడి వికెట్ ఇచ్చేశాడు. భారత్ 33/3తో లంచ్ విరామానికి వెళ్లింది.

రెండో సెషన్లో భారత్ అద్భుత పోరాట పటిమ చూపించింది. రిషబ్ పంత్ (30)తో యశస్వి జైస్వాల్ జోడీ నాల్గో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. ఈ జోడీ క్రీజులో ఉండగా భారత్ మ్యాచ్ రేసులో నిలిచింది. టీ విరామం వరకు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. 112/3తో భారత్ టీ విరామానికి వెళ్లింది. ఆ తర్వాత టీమ్ ఇండియా కథ మారింది. ట్రావిశ్ హెడ్ ఓవర్లో పంత్ దూకుడుగా ఆడటం కొంపముంచింది. ఆ తర్వాత లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. రవీంద్ర జడేజా (2), నితీశ్ కుమార్ రెడ్డి (1), ఆకాశ్ దీప్ (7), జశ్‌ప్రీత్ బుమ్రా (0), మహ్మద్ సిరాజ్ (0) అలవోకగా వికెట్లు సమర్పించుకున్నారు. యశస్వి జైస్వాల్ వివాదాస్పద డీఆర్ఎస్ రివ్యూకు అవుట్ కాగా.. వాషింగ్టన్ సుందర్ (5 నాటౌట్, 45 బంతుల్లో) అజేయంగా నిలిచాడు. భారత్ చివరి ఏడు వికెట్లను కేవలం 34 పరుగులకే కోల్పోయింది. 79.1 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలి టీమ్ ఇండియా ఓటమి చవిచూసింది. అంతకుముందు, ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌటైంది. భారత పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా (5/57) ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 474/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 369/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 234/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) అలెక్స్ (బి) కమిన్స్ 84, రోహిత్ శర్మ (సి) మార్ష్ (బి) కమిన్స్ 9, కెఎల్ రాహుల్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 0, విరాట్ కోహ్లి (సి) ఖవాజా (బి) స్టార్క్ 5, రిషబ్ పంత్ (సి) మార్ష్ (బి) హెడ్ 30, రవీంద్ర జడేజా (సి) అలెక్స్ (బి) బొలాండ్ 2, నితీశ్ కుమార్ రెడ్డి (సి) స్మిత్ (బి) లయాన్ 1, వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 5, ఆకాశ్ దీప్ (సి) హెడ్ (బి) బొలాండ్ 7, జశ్‌ప్రీత్ బుమ్రా (సి) స్మిత్ (బి) బొలాండ్ 0, మహ్మద్ సిరాజ్ (ఎల్బీ) లయాన్ 0, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం :(79.1 ఓవర్లలో ఆలౌట్) 155.**

వికెట్ల పతనం : 1-25, 2-25, 3-33, 4-121, 5-127, 6-130, 7-140, 8-150, 9-154, 10-155.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 16-8-25-1, పాట్ కమిన్స్ 18-5-28-3, స్కాట్ బొలాండ్ 16-7-39-3, మిచెల్ మార్ష్ 3-2-2-0, నాథన్ లయాన్ 20.1-6-37-2, ట్రావిశ్ హెడ్ 5-0-14-1, మార్నస్ లబుషేన్ 1-1-0-0.



ఐసీసీ అవార్డు రేసులో బుమ్రా

దుబాయ్ : భారత పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ అవార్డు రేసులో నిలిచాడు. 2024 ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసీసీ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ నామినీలను ఐసీసీ సోమవారం వెల్లడించింది. జో రూట్ (ఇంగ్లాండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్) సహా జశ్‌ప్రీత్ బుమ్రా ఈ అవార్డుకు నామినేట్ అయ్యారు. అవార్డు రేసులో ముగ్గురు బ్యాటర్లతో పేసర్ బుమ్రా పోటీపడుతున్నాడు. ఈ ఏడాది 13 టెస్టుల్లో 14.92 సగటుతో బుమ్రా 71 వికెట్లు పడగొట్టాడు. ఐసీసీ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు సైతం బుమ్రా నామినేట్ అయ్యాడు. జో రూట్, ట్రావిశ్ హెడ్, హ్యారీ బ్రూక్‌లతో బుమ్రా ఇక్కడ పోటీపడుతున్నాడు. భారత్ నుంచి ఇతర క్రికెటర్లు ఎవరూ ఐసీసీ అవార్డుకు నామినేట్ అవ్వలేదు. ఐసీసీ అవార్డు జ్యూరీ, అభిమానుల ఓటింగ్‌తో అవార్డు విజేతలను నిర్ణయిస్తారు.

విజయాల ఏడాది!

2024 భారత్‌కు అద్భుత విజయాలను అందించింది. పారిస్‌లో మను బాకర్, నీరజ్ చోప్రా, హాకీ జట్టు పతక మెరుపులతో దేశం గర్వపడేలా చేశారు. 11 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమ్ ఇండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ సాధించింది. పారా షూటర్ అవనీ లేఖర పారిస్‌లో పతక గురి తప్పలేదు. చదరంగంలో గుకేశ్, కోనేరు హంపి ప్రపంచ విజేతలుగా నిలిచి ఈ ఏడాది మరింత మధురం చేశారు.



నవతెలంగాణ క్రీడావిభాగం

రౌండప్ 2024

17 ఏండ్ల తర్వాత మళ్లీ.. :

2007 ఐసీసీ టీ20 ప్రపంచకప్ నెగ్గిన భారత్.. మళ్లీ పొట్టి కప్‌ను ముద్దాడలేదు. అమెరికా వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో 17 ఏండ్ల తర్వాత మళ్లీ భారత్ విజేతగా నిలిచింది. ఉత్కంఠభరిత ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. ఈ విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని తాకాయి. సమిష్టిగా రాణించిన టీమ్ ఇండియా 11 ఏండ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు తెరదించింది. చారిత్రక విజయంతో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఈ ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు.





ఒలింపిక్స్‌లో జోరు :

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఆరు పతకాలు సాధించింది. పతకాల సంఖ్య పరంగా నిరాశపడినా.. యువ అథ్లెట్ల ప్రదర్శన దేశం గర్వపడేలా చేసింది. నీరజ్ చోప్రా సిల్వర్ మెడల్ సాధించగా.. షూటింగ్‌లో మను బాకర్ చారిత్రక రెండు కాంస్యాలు దక్కించుకుంది. సరబ్జోత్ సింగ్, స్వప్నిల్ సింగ్, అమన్ సెహ్రావత్‌లు పతకాలు సాధించారు. హాకీ ఇండియా మరోసారి కాంస్య పతకంతో దేశం సంబురాలు చేసుకునేలా చేసింది. రెండు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించిన మను బాకర్.. 0.1 పాయింట్ తేడాతో హ్యాట్రిక్ మెడల్ చేజార్చుకున్న సంగతి తెలిసిందే.



పారా అథ్లెట్ల చరిత్ర :

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఆల్‌టైమ్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, 13 కాంస్యాలు సహా 29 పతకాలు గెల్చుకుంది. పారా షూటర్ అవని లేఖర పారాలింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచింది. సుమిత్ అంతిల్, మారియప్పన్ తంగవేలు, ధరంబీర్, సూర్మ ప్రవీణ్ కుమార్‌లు పతక వేటలో అదరగొట్టారు. పారిస్ మెరుపులతో పారాలింపిక్స్ చరిత్రలో భారత్ పతకాల సంఖ్య అర్థ సెంచరీ దాటేసింది.

చదరంగంలో హవా :

చదరంగంలో 2024 మరుపురాని విజయాలను అందించింది. దొమ్మరాజు గుకేశ్ 18 ఏండ్ల వయసులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించాడు. 14 రౌండ్ల పాటు చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో పోటీపడిన గుకేశ్ ఆఖరు రౌండ్లో అసమాన విజయంతో టైటిల్ సొంతం చేసుకుని చరిత్ర సృష్టించాడు. ఫిడె క్యాండిడేట్స్ విజేతగా నిలిచి సంచలనం సృష్టించిన గుకేశ్ అక్కడితో ఆగిపోలేదు. ఫిడె ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలుగు తేజం కోనేరు హంపి చరిత్ర సృష్టించింది. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడిన టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలువటం హంపికి ఇది రెండోసారి. గుకేశ్ చెస్‌లో రారాజుగా నిలువగా.. హంపి చదరంగం రాణిగా నిలిచింది.

టేబుల్ టెన్నిస్‌లోనూ.. :

మనిక బత్రా, ఆకుల శ్రీజ, అహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ, దియలు ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు తొలి పతకం అందించారు. 1972 నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో భారత్ ఇప్పటివరకు సెమీఫైనల్‌కు చేరలేదు. తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ఈ చారిత్రక విజయంలో కీలక పాత్ర పోషించింది.





నిహారిక



స్వప్నదత్



ప్రియాంక దత్



విద్యా కొప్పినీడి



చైతన్య రెడ్డి



సాయి సౌజన్య

విజయాల్లోనూ తగ్గేదేలే..

నవచిత్రం

ఈ ఏడాది పలు సినిమాల సక్సెస్‌లో హీరోయిన్ల పాత్ర చాలా కీలకంగా నిలిచింది. తమ అత్యద్భుత నటనతో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేశారు. హీరోలకు దీటుగా పాటలు, ఫైట్లలోనూ తగ్గేదేలే.. అంటూ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేశారు. మహిళా దర్శక, నిర్మాతలు సైతం సంచలన విజయాలకు సూత్రధారులుగా నిలిచారు. తమదైన ముద్రతో సరికొత్త సక్సెస్‌ల ఒరవడికి నాంది పలికి, అందర్నీ గర్వపడేలా చేశారు. తెలుగు సినిమా సత్తాని చూపించడంలో కీ రోల్ ప్లే చేసిన మహిళాశక్తికి హ్యాట్సాఫ్.

రీల్ .. రౌండప్ 2024

- **ఈ** ఏడాది అత్యధిక కలెక్షన్లతో మోతమోగించిన 'పుష్ప2' సినిమాలో శ్రీవల్లి పాత్రని ఇట్టే మర్చిపోలేం. పుష్పరాజ్‌గా అల్లుఅర్జున్‌కి దీటుగా తన నటనతో, హావభావాలతో **రష్మిక మందన్నా** సిల్వర్‌స్క్రీన్‌పై నట విశ్వరూపాన్ని చూపించింది. పాన్ ఇండియా మార్కెట్‌ని షేక్ చేస్తూ కేవలం 21 రోజుల్లో రూ. 1705 కోట్ల రూపాయల్ని కొల్లగొట్టిన ఈ సినిమా విక్టరీలో రష్మికది కూడా కీ రోల్ అని వేరేచెప్పక్కర్లేదు.
- ఇక అమాయక కానిస్టేబుల్ పాత్రలో **ప్రియాంక మోహన్‌**ని తప్ప వేరే వారిని ఊహించుకోలేం అన్నట్టుగా ఉన్న ఆమె నటని మెచ్చుకోవాల్సిందే. నాని కథానాయకుడిగా తెరకెక్కిన 'సరిపోదా శనివారం' సినిమాలో చారులతగా ప్రియాంక నటనకి అందరూ ఫిదా అయిపోయారు.
- ఇల్లు, భర్త, తగిన సంపాదనతో సంతోషంగా ఉంటే చాలు అనుకునే ఓ సాధారణ మధ్య తరగతి ఇల్లాలుగా 'లక్కీభాస్కర్' సినిమాలో **మీనాక్షి చౌదరి** పడే ఆవేదనకు ఎవ్వరైనా సరే కన్నీటిపర్యంతం అవ్వకుండా ఉండలేరు. ఉన్నంతలో భర్త తనని సంతోషంగా చూసుకుంటే చాలు అని మురిసిపోయే పాత్రలో మీనాక్షి నటన అందరితో ఆహా..అనిపించింది. దుల్కర్‌సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'లక్కీభాస్కర్' చిత్రం మంచి ఆదరణతోపాటు వసూళ్ళలోనూ అదరగొట్టింది.
- 'టిల్లు స్క్వేర్'లో బ్యూటీఫుల్ స్పై ఏజెంట్‌గా **అనుపమ పరమేశ్వరన్** నటన ట్రెండీగా ఉంటూ అందర్నీ మాయ చేసింది. ఆమె అందం, అభినయం కుర్రకారుని చూపు తిప్పుకోనియ్యకుండా చేసింది. అంతేకాదు సినిమా వంద కోట్ల క్లబ్‌లో జాయిన్ అవ్వడంలోనూ ముఖ్యభూమిక పోషించింది.
- ఈ ఏడాది మోతమోగిన పాటల్లో 'ఆ కుర్చీ మడత బెట్టి..' ఒకటి. ఈ ఫాస్ట్ బీట్ పాటకి నాయిక **శ్రీలీల** వేసిన స్టెప్స్ మామూలుగా లేవు. ఓ స్ప్రింగ్‌లా ఆమె చేసిన డాన్స్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కిన 'గుంటూరు కారం' సినిమాలో అమ్ముగా శ్రీలీల అటు నటనతోను, ఇటు డ్యాన్స్‌తోనూ ప్రేక్షకుల్ని అలరించింది. టాక్ పరంగా ఈ సినియా బాగోలేకపోయినా రూ.180 కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసింది.
- ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా **భాగ్యశ్రీ బోర్సే** వంటి నూతన కథానాయికలు పలువురు పరిచయం అవ్వగా, బాలీవుడ్ నుంచి శ్రీదేవి తనయ **జాన్వీకపూర్** 'దేవర'తో, అలాగే 'కల్కి'తో **దీపికాపదుకొనె** తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఈ సినిమాల విజయాల్లో వీళ్లూ ముఖ్యపాత్ర పోషించారు.
- సినిమా నిర్మాణంలోనూ మహిళా నిర్మాతలు తమదైన ముద్ర వేశారు. సంచలన విజయాలతో ఎవరికీ తీసిపోమని నిరూపించారు.
- ఈ ఏడాది చిన్న సినిమాగా విడుదలైన 'కమిటీకుర్రోళ్ళు' విశేష ప్రేక్షకాదరణతో మంచి కలెక్షన్లను సాధించి, పెద్ద స్థాయి సక్సెస్‌ని కైవసం చేసుకుంది. పలు వెబ్ సిరీస్‌ల నిర్మాణంతోనే కాకుండా నటిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్న **నిహారిక కొణిదెల** ఈ సినిమాతో నిర్మాతగా మంచి విజయాన్ని దక్కించుకున్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా రూ.1100 కోట్ల వసూళ్ళని కొల్లగొట్టిన 'కల్కి'లాంటి భారీ బడ్జెట్ చిత్రాన్ని తీసిన క్రెడిట్ **ప్రియాంక దత్, స్వప్నాదత్**లదే. భిన్న కథాకథానాలతో నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్, అమితాబ్‌బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె వంటి హేమాహేమీలతో 'కల్కి' లాంటి సినిమా తీయడం సాహసమని చెప్పకతప్పదు.
- అలాగే ఈ ఏడాది విడుదలైన చిన్న సినిమాల్లో సక్సెస్‌పరంగా బాగా సౌండ్ చేసిన సినిమా 'ఆయ్'. ఈ సినిమా నిర్మాతల్లో **విద్యా కొప్పినీడి** ఒకరు కావడం విశేషం. సున్నితమైన అంశాలకు మంచి వినోదాన్ని జోడిస్తూ నిర్మించిన ఈ సినిమా సైతం మంచి ఆదరణతో భారీ వసూళ్ళని రాబట్టింది.
- ఊహించని కలెక్షన్లు సాధించి పాన్ ఇండియా మార్కెట్‌ని కూడా నివ్వెరపోయేలా చేసిన సినిమా 'హను-మాన్'. తేజా సజ్జా, ప్రశాంత్‌వర్మ కాంబోలో భర్త నిరంజన్‌రెడ్డితో కలిసి **చైతన్య రెడ్డి** ఈ సినిమా తీశారు. ఇది ఏకంగా రూ.350కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసి సంచలన విజయం సాధించింది.
- ఇక దర్శకుడు త్రివిక్రమ్ సతీమణి **సాయి సౌజన్య** సైతం ఈ ఏడాది సక్సెస్‌ని సాధించిన వారిలో ఉన్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో 'లక్కీభాస్కర్' చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ భాగస్వామ్యంతో నిర్మించారు. అటు ప్రేక్షకుల ప్రశంసలతోపాటు ఇటు మంచి వసూళ్ళని ఈ సినిమా సొంతం చేసుకుంది.
- **డా.హరిత గోగినేని** వంటి పలువురు దర్శకత్వ ప్రతిభతోనూ ప్రేక్షకుల్ని మెప్పించారు. విడుదలకు ముందే దాదాపు 70 ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అవార్డులు పొందిన 'ఫియర్' సినిమాకి హరిత గోగినేని దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి థియేటర్లలోనూ మంచి ఆదరణ లభించింది. మొత్తమ్మీద టాలీవుడ్‌ని గర్వపడేలా చేసిన ఈ మహిళాశక్తికి జయహో చెప్పాల్సిందే.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886